
తమ్మినేని పెద్దిరెడ్డి అనే వ్యక్తిది కనిగిరి పట్టణం. ఈయన 1975లో మరణించారు. ఆయనకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆయన బతికుండగానే ఆస్తులు అమ్మేశాడు. కానీ ఆయన పేరును ఉపయోగించుకుని వారి బంధువులకు సంబంధించిన ఓ ఆస్తిని కొట్టేయాలని కనిగిరికి చెందిన ఓ వైసీపీ నాయకుడు యోచించాడు. అనుకున్నదే తడవుగా పెద్దిరెడ్డి కుటుంబ సభ్యులకు కొంతమేర ముట్టజెప్పాడు.


ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

గ్రామ-వార్డు సచివాలయ శాఖ

APGSWS AB 628439

GOVERNMENT OF ANDHRA PRADESH

DEPARTMENT OF MUNICIPAL ADMINISTRATION


MEDICAL & HEALTH DEPARTMENT

DEATH CERTIFICATE

నకిలీ ధ్రువీకరణ పత్రాలు సృష్టించేందుకు కొందరు అధికారులను సంప్రదించాడు. మరణ ధ్రువీకరణ పత్రం కావాలంటే మార్కాపురంలో చిటికెలో లభిస్తుందని తెలుసుకున్నాడు. వెంటనే ఆ విభాగం అధికారిని సంప్రదించాడు. పెద్దమొత్తంలో డబ్బులు ఇచ్చేందుకు ఒప్పందం చేసుకున్నాడు. ఇంకేముంది పెద్దిరెడ్డి 1981 జూన్ 10న మరణించినట్లు 2023 నవంబర్ 15న ధ్రువీకరణపత్రం తయారైంది. కానీ ఇక్కడే కొన్ని పొరపాట్లు చోటుచేసుకున్నాయి. డెత్ సర్టిఫికెట్‌లో నమోదు సంఖ్య 109 అని, జనన, మరణాలను నమోదు చేసే రికార్డులో మాత్రం 90 అని ఉంది. అంతేకాక అప్పట్లో మరణ సమాచారం ఇచ్చిన వ్యక్తిగా చెబుతున్న వి.వెంకటేశ్వరరెడ్డి.. పెద్దిరెడ్డికి మనవడు. ఆయనకు 1981లో ఆరేళ్లు ఉంటాయి. ఈ విషయంపై పెద్దిరెడ్డి బంధువులు కొందరు సమాచారహక్కు చట్టం ద్వారా సాక్ష్యాధారాలు సేకరించి ఇప్పటికే కలెక్టర్, సబ్‌కలెక్టర్, తహసీల్దార్, మునిసిపల్ కమిషనర్‌లకు ఫిర్యాదు చేశారు.

ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే. ఇలా వందల సంఖ్యలో నకిలీ ధ్రువీకరణ పత్రాలు జారీచేసి సంబంధిత ఉద్యోగులు రూ.లక్షల్లో గడించారు. ఇంకా ఇస్తూనే ఉన్నారు. ఇందుకోసం పెద్దఎత్తున బేరాలు సాగుతున్నాయి. అక్రమార్కులకు రాజకీయ పలుకుబడి ఉంది. దీంతో వారు 'ఆడిందే ఆట.. పాడిందే పాట' అన్నట్లు మార్కాపురం మునిసిపాలిటీలో నడుస్తోంది. ఎన్ని ఫిర్యాదులు వచ్చినా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది.



మద్దెల వెంకటరత్నం అనే వ్యక్తిది పూర్వం మార్కాపురం పట్టణమే. ఆయనకు భార్య మినహా పిల్లలు ఎవరూ లేరు. 1970 ప్రాంతంలో మార్కాపురం నుంచి వెళ్లిపోయారు. ఎక్కడ ఉన్నారో కూడా బంధువులతోపాటు ఎవరికీ తెలియదు. కానీ ఈయన పేరున మార్కాపురం పట్టణంలోని ఎస్‌వీకేపీ కళాశాల ఎదురుగా సర్వే నెంబర్ 889లో సుమారు 25సెంట్ల భూమి ఉంది. ప్రస్తుత మార్కెట్ ధరల ప్రకారం ఎంతలేదన్నా రూ.10కోట్ల విలువ చేస్తుంది. ఆ 25 సెంట్లు మినహా చుట్టూ ఉన్న మొత్తం భూమిని ఓ వైసీపీ ముఖ్యనాయకుడు, ఆయన అనుచరులు కొన్నారు. పనిలో పనిగా వెంకటరత్నం భూమిని ఆక్రమించారు. దానికి ఓ దొంగ రిజిస్ట్రేషన్ కూడా చేయించుకుంటే లీగల్‌గా ఉంటుందని ప్రణాళిక రచించారు. ఈక్రమంలో అదే ఇంటిపేరు కలిగిన మద్దెల ప్రసాద్ అనే వ్యక్తిని సంప్రదించారు. ఆయనతో బేరం మాట్లాడుకున్నారు. ప్రసాద్ తండ్రి అంపయ్య అయితే వెంకటరత్నంగా ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌లో మార్పించారు. అంతేకాక వెంకటరత్నం పేరుతో ఓ దొంగ మరణ ధ్రువీకరణ పత్రాన్ని కూడా సృష్టించారు. ఎలాంటి ఆధారాలు లేకపోయినా 10-345 అనే ఇంటి చిరునామాతో వెంకటరత్నం 1987 మే 25న మరణించినట్లు 2020 డిసెంబర్ 26న సర్టిఫికెట్ పొందారు. దీని వెనుక భారీ మొత్తంలో చేతులు మారినట్లు తెలుస్తోంది.

# సర్టిఫికేట్లు



## కాసులిస్తే క్షణాల్లో జారీ

## నకిలీ ధ్రువపత్రాలకు కేరాఫ్ మార్కాపురం మునిసిపాలిటీ

- జేబులు నింపుకొంటున్న జనన, మరణ ధ్రువీకరణ విభాగం
- ఐదేళ్లుగా వైసీపీ అండదండలు
- వాటిని అడ్డంపెట్టుకొని భూముల ఆక్రమణకు తెగబడిన నేతలు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని ఉన్నతాధికారులు



మార్కాపురం, ఆగస్టు 5 : మార్కాపురం మునిసిపాలిటీలో జనన, మరణ ధ్రువపత్రాలు జారీచేసే విభాగం అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. రూ.లక్షల్లో వసూలు చేస్తూ ఇష్టారీతిన నకిలీ సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారు. గత వైసీపీ పాలనలో రాజకీయ నాయకుల అండదండలు పుష్కలంగా ఉండటం, అన్నిస్థాయిల అధికారుల సహకారం తోడవడంతో మునిసిపాలిటీ నకిలీ ధ్రువపత్రాలకు కేంద్ర బిందువుగా మారింది. చివరికి మార్కాపురంతో సంబంధంలేని ప్రాంతాల వారికి కూడా జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తున్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో వందల సంఖ్యలో ఇలా నకిలీ సర్టిఫికెట్లు ఇచ్చేశారు. అప్పట్లో ఫిర్యాదులు అందినా పట్టించుకున్న నాథుడే లేడు.

### ఇతరుల ఆస్తులు కొట్టేసేందుకే..

మార్కాపురం మునిసిపాలిటీలో ఇష్టారీతిన జారీచేసిన జనన, మరణ ధ్రువపత్రాలు పొందిన వాళ్లు ఇతరుల ఆస్తులు కొట్టేసేందుకే ఉపయోగిస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో ఎన్నడూలేని విధంగా వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల కాలంలోనే మార్కెట్లో రూ.వందల కోట్ల ఆస్తులను నకిలీ ధ్రువీకరణ పత్రాలను అడ్డుపెట్టుకుని వైసీపీ నాయకులు కొల్లగొట్టినట్లు తెలుస్తోంది. ఇలా విచ్చలవిడిగా ధ్రువపత్రా లు జారీ కావడానికి ప్రధాన కారణం అప్పటి నియోజకవర్గ ప్రజాప్రతినిధి సోదరుడి ప్రమేయమేనని స్పష్టమవుతోంది. ఆయన సాగించిన భూదందాలు అన్నీఇన్నీ కావు. భూములు, విలువైన స్థలాలు ఉండి మార్కాపురంలో లేనివారిని లక్ష్యంగా చేసుకుని ఇలా తప్పుడు పత్రాలు సృష్టించి రూ.కోట్ల విలువైన ఆస్తులు కొల్లగొట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి.

### విచారణలతోనే సరి.. చర్యలు శూన్యం..

నకిలీ ధ్రువపత్రాల విషయంపై జిల్లాలోని అన్నిస్థాయిల అధికారులకు ఫిర్యాదులు అందాయి. కానీ విచారణలతోనే అందరూ సరిపెడుతున్నారు. ఈ వ్యవహారంలో బాధ్యులు ఎవరో తేల్చి వారిపై కఠినచర్యలు తీసుకోవాల్సి ఉంది. నకిలీ ధ్రువపత్రాలపై కనిగిరికి చెందిన తమ్మినేని సాయినీలేష్‌రెడ్డి ఇప్పటికే కలెక్టర్, మార్కాపురం సబ్ కలెక్టర్, మునిసిపల్ కమిషనర్‌లకు అన్ని ఆధారాలతో ఫిర్యాదు చేశారు. అయినా చర్యలు శూన్యమయ్యాయి.

# సమగ్ర నివేదిక

- శాఖల వారీగా అందజేసిన కలెక్టర్ అన్సారియా
- భవిష్యత్ ప్రాధాన్యతలపై దిశానిర్దేశం చేసిన సీఎం
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్న జేసీ, అధికారులు

ఒంగోలు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నెలకొన్న పరిస్థితులు, తాను గుర్తించిన సమస్యలు, వాటికి పరిష్కార మార్గాలు, నిలిచిపోయిన అభివృద్ధి పనులు, వాటి పూర్తికి చర్యలు తదితర అంశాలపై శాఖల వారీగా సమగ్ర నివేదికను కలెక్టర్ తమీమ్ అన్సారియా ప్రభుత్వానికి అందజేశారు. సోమవారం అమరావతిలోని సచివాలయంలో జరిగిన కలెక్టర్ల సదస్సులో ఆమె పాల్గొన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక 50రోజుల అనంతరం రాష్ట్రస్థాయి కలెక్టర్ల సదస్సును నిర్వహించింది. మొత్తం తొమ్మిది విభాగాలకు సంబంధించి 29శాఖలతో కూడిన అజెండాను ప్రభుత్వం ఈ సదస్సులో సమీక్షకు రూపొందించింది. ఆయా విభాగాలు, శాఖల వారీగా జిల్లాలో పరిస్థితి, వాటి పురోభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను సూచిస్తూ సదస్సుకు హాజరైన కలెక్టర్ అన్సారియా నివేదికను అందజేశారు. కాగా సమావేశంలో కూటమి ప్రభుత్వ లక్ష్యాలు, శాఖల వారీ, జిల్లాల వారీ తీసుకోవాల్సిన చర్యలు, ప్రభుత్వ ప్రాధాన్యతలు, ఆయావర్గాల ప్రజలకు సంక్షేమం తదితర అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం చేశారు. ప్రధాన రంగాలైన వ్యవసాయం, నీటిపారుదల, విద్య, వైద్యం, సంక్షేమం, సహజవనరులు, రెవెన్యూ, పట్టణ, గ్రామీణాభివృద్ధి తదితర రంగాలపై ఆయన సమీక్ష చేశారు. కలెక్టర్లు ఆయా అంశాలపై క్రియాశీలకంగా వ్యవహరించి పనిచేయాలని సూచించారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో పాటు పలువురు మంత్రులు కూడా తమ శాఖలకు సంబంధించి సూచనలు చేశారు. సమావేశానికి జిల్లాకు చెందిన మంత్రి డీఎస్‌బీవీ స్వామి హాజరయ్యారు.

వెలిగొండ తొలిదశ నీటిని తీసుకునేందుకు అడ్డంకిగా ఉన్న నిర్వాసితుల పునరావాసం కోసం రూ.600కోట్లు తక్షణ అవసరంగా తన నివేదికలో కలెక్టర్ అన్సారియా పేర్కొన్నట్లు సమాచారం. అలాగే గుండ్లకమ్మ గేట్ల పూర్తికి నిధులు, జలజీవన్ మిషన్, మైక్రో ఇరిగేషన్, వ్యవసాయ పథకాల కొనసాగింపునకు నిధుల అవసరాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. సాయంత్రం జరిగిన శాంతిభద్రతల సమీక్షకు హాజరైన ఎస్పీ దామోదర్ జిల్లాలో ప్రస్తుత పరిస్థితులను ప్రభుత్వానికి వివరించినట్లు తెలిసింది. కాగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జేసీ గోపాలకృష్ణ, ఇతర అధికారులు ఇక్కడి ప్రకాశం భవనం నుంచి సమీక్షకు హాజరయ్యారు

### పునరావాసానికి రూ.600 కోట్లు అవసరం



అమరావతిలో సీఎం చంద్రబాబు నిర్వహించిన సమీక్షకు హాజరైన మంత్రి స్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియా

# జలజీవన్ మిషన్ పనితీరుపై పల్స్ సర్వే

### 8నుంచి 14 వరకు నిర్వహణ

ఒంగోలు (కలెక్టరేట్), ఆగస్టు 5: గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య (ఆర్‌డబ్ల్యూఎస్) విభాగం ఆధ్వర్యంలో గ్రామపంచాయతీల్లో నిర్వహిస్తున్న జలజీవన్ మిషన్ అమలు తీరుపై పల్స్ సర్వేకు ప్రభుత్వం ఆదేశించింది. ఈనెల 8నుంచి 14 వరకు సర్వే నిర్వహించి ఫలితాలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో ఈ సర్వే నిర్వహించనున్నారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో 95,44,599 కుటుంబాలు నివసిస్తున్నాయి. జలజీవన్ మిషన్ వెబ్‌సైట్‌లో పేర్కొన్న వివరాల ప్రకారం 70,13,580 గృహాలకు




తాగునీటి కుళాయిలు ఉన్నాయి. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు ఈనెల 9 నుంచి 14 వరకు ఇంటింటికీ వెళ్లి అసలు కుళాయిలు ఉన్నాయా..లేవా? నీరు వస్తుందా.. లేదా? అన్న వివరాలు సేకరించి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. సర్వే నిర్వహణపై ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లకు ఈనెల 8న శిక్షణ ఇస్తారు. గ్రామపంచాయతీల్లో పల్స్ సర్వేను సంబంధిత ఆర్‌డబ్ల్యూఎస్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు పర్యవేక్షించాలి. ఈమేరకు ఆర్‌డబ్ల్యూఎస్ చీఫ్ ఇంజనీర్ టి.గాయత్రీదేవి ఉత్తర్వులు జారీ చేశారు. సర్వేను పక్కాగా నిర్వహించాలని ఎస్ఈ, ఈఈలను ఆమె ఆదేశించారు.




# అక్రమాలపై సమగ్ర విచారణ

- సింగరాయకొండ పంచాయతీలో రూ.40లక్షలకుపైగా గోల్‌మాల్
- ఏడాది క్రితం విచారించినా నివేదిక ఇవ్వని ఇద్దరు డీఎల్‌పీవోలకు నోటీసులు
- సర్పంచ్ చెక్‌పవర్ తాత్కాలికంగా రద్దు

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 5 : మండల కేంద్రమైన సింగరాయకొండ గ్రామ పంచాయతీలో జరిగిన అవినీతి, అక్రమాలను నిగ్గుతేల్చేందుకు అధికార యంత్రాంగం సిద్ధమైంది. పంచాయతీలో నిధులు పెద్దఎత్తున దారిమళ్లించినట్లు అనేక ఆరోపణలు వచ్చినా గత వైసీపీ పాలనలో పట్టించుకున్న పరిస్థితి లేదు. కార్యదర్శులతో సర్పంచ్ కుమ్మక్కై రూ.46లక్షలకుపైగా పంచాయతీ నిధులను దారిమళ్లించారని జనసేన పార్టీ సింగరాయకొండ మండల అధ్యక్షుడు రాజేష్ ఫిర్యాదులు చేస్తూ వచ్చారు. అయితే వైసీపీకి చెందిన సర్పంచ్ కావడంతో ఏడాదిగా అధికారులు పట్టించుకోలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇటీవల మరోసారి రాజేష్ మీకోసం కార్యక్రమంలో కలెక్టర్ తమీమ్ అన్సారియాకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఆమె ఆరా తీయగా ఇప్పటికే ఒంగోలు, కనిగిరి డీఎల్పీవోలు విచారణ నిర్వహించినట్లు తేలింది. దీంతో ఆ నివేదికలను అందజేయాలని ఆమె ఆదేశించారు. ఇద్దరు డీఎల్పీవోలు విచారించి ఏడాది అయినా నివేదికను అందజేయకపోవడంతో వారిద్దరికీ నోటీసులను ఇచ్చారు.

### సర్పంచ్‌పై చర్యలు

పంచాయతీ నిధుల దుర్వినియోగం ఆరోపణల నేపథ్యంలో సర్పంచ్ టి.వనజకు చెక్‌పవర్‌ను వారంరోజులపాటు తాత్కాలికంగా నిలుపుదల చేస్తూ సోమవారం డీపీవో ఉషారాణి ఉత్తర్వులు ఇచ్చారు. ఈ లోపు వివరణ ఇవ్వకపోతే పూర్తిగా చెక్‌పవర్‌ను రద్దుచేస్తామని హెచ్చరించారు. మరోవైపు కలెక్టర్ తమీమ్ అన్సారియా నిధుల దుర్వినియోగంపై నిగ్గుతేల్చేందుకు విచారణకు ఆదేశించారు. విజిలెన్స్ ప్రత్యేక అధికారిని విచారణాధికారిగా నియమించడంతో ఆయన పంచాయతీ సర్పంచ్‌తోపాటు గతంలో పనిచేసిన ఈవోఆర్‌డీ, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందికి నోటీసులు జారీ చేశారు. ఈనెల 9వతేదీన ఉదయం 11 గంటలకు పంచాయతీ కార్యాలయంలో జరిగే విచారణకు హాజరుకావాలని ఆదేశించారు. 2021 డిసెంబరు నుంచి జూన్ 2022 మధ్యకాలంలో పంచాయతీ కార్యదర్శులు ఎలాంటి వస్తువులు కొనుగోలు చేయకుండా సాధారణ నిధుల నుంచి రూ.13లక్షలు బిల్లులు డ్రా చేశారని ఆ నోటీసులో పేర్కొన్నారు. పంచాయతీలో పనులు చేయకుండానే చేసినట్లుగా రికార్డులు సృష్టించి 15వఆర్థిక సంఘంనిధులు రూ.33లక్షలు స్వాహా చేసినట్లు ఫిర్యాదులు అందాయని, వాటిపై సమగ్ర సమాచారంతో హాజరు కావాలని నోటీసుల్లో పేర్కొనడంతో కలకలం రేగింది.

### ఉప్పుగుండూరు సర్పంచ్ చెక్‌పవర్ తాత్కాలికంగా రద్దు

నాగులుప్పలపాడు మండలం ఉప్పుగుండూరు సర్పంచ్ దేవరకొండ జయమ్మ చెక్‌పవర్‌ను తాత్కాలికంగా నిలుపుదల చేస్తూ డీపీవో ఉషారాణి సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. గ్రామ పంచాయతీలో రూ.42,70,666 దుర్వినియోగమైనట్లు కె.శ్రీనివాసరావు అనే వ్యక్తి డీపీవోకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఒంగోలు డివిజనల్ పంచాయతీ అధికారిని విచారణాధికారిగా నియమించారు. అయితే ఆ విచారణ నివేదిక జాప్యం కావడంతో సోమవారం ఫిర్యాదుదారుడు జిల్లా పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. దీంతో స్పందించిన డీపీవో.. సర్పంచ్ జయమ్మ చెక్ పవర్‌ను తాత్కాలికంగా నిలుపుదల చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. వారంరోజుల్లో సంజాయిషీ ఇవ్వకపోతే పంచాయతీరాజ్ చట్టం ప్రకారం చెక్ పవర్‌ను పూర్తిగా తొలగిస్తామని హెచ్చరించారు.

## వలంటీర్లు పెట్టిన వాట్సప్ గ్రూపులు తొలగించాలి

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

ఒంగోలు (కలెక్టరేట్), ఆగస్టు 5 : గ్రామ, వార్డు వలంటీర్లు పెట్టిన వాట్సప్, టెలిగ్రామ్ గ్రూపులను వెంటనే తొలగించాలని ప్రభుత్వం ఆదేశించింది. అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు ఉత్తర్వులిచ్చింది. ఆ గ్రూపుల నుంచి వైదొలిగేలా ప్రజలకు కూడా అవగాహన కల్పించాలని సూచించింది. ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు లేకుండానే ఆ గ్రూపులు పెట్టినట్లు తమ దృష్టికి వచ్చిందని, అందువల్ల వాటిని తొలగించి నివేదికను పంపాలని కలెక్టర్లను ఆదేశించింది.

# అమృత్ పథకంపై కదలిక

- అన్ని ప్రాంతాలకూ నీటిని అందించలేకపోతున్న దర్శి ఎన్‌ఏపీ
- ఏడాదిన్నర క్రితం రూ.121 కోట్లు మంజూరు చేసిన కేంద్రం
- వైసీపీ హయాంలో పట్టించుకోని పాలకులు
- తాజాగా టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి చొరవతో కార్యాచరణ


వివరాలు లోపలి పేజీల్లో..



దర్శి పట్టణం వ్యూ


బోడపాడు గ్రామస్థులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా

# మా సర్పంచ్ కబ్జాకోరు!

- భూస్వాహాకు పాల్పడుతున్న అతనిపై చర్యలు తీసుకోవాలి
- పురుగుమందు డబ్బాలతో ఆందోళన చేసిన బోడపాడు గ్రామస్థులు
- విచారించి చర్యలు తీసుకుంటానని సబ్ కలెక్టర్ హామీ


వివరాలు మెయిన్‌లో..


వ్యాపారులు, రైతులకు సూచనలిస్తున్న బోర్డు ఆర్ఎం

## అన్ని గ్రేడ్లకు మంచి ధరలు ఇవ్వాలి

● పొగాకు వ్యాపారులకు బోర్డు ఆర్ఎం సూచన

టంగుటూరు, ఆగస్టు 5 : పొగాకులో అన్ని గ్రేడ్లకు మంచి ధరలు ఇవ్వాలని వ్యాపారులకు బోర్డు ఒంగోలు ప్రాంతీయ అధికారి ఎం.లక్ష్మణరావు సూచించారు. సోమవారం ఆయన స్థానిక వేలం కేంద్రాన్ని సందర్శించారు. వేలానికి వచ్చిన వివిధ రకాల బేళ్లు, వాటికి వ్యాపారులిస్తున్న ధరలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన కొనుగోలుదారులనుద్దేశించి మాట్లాడుతూ మీరిచ్చే ధరలు రైతులకు లాభదాయకంగా ఉండాలన్నారు. పొగాకు వేయడానికి ముందు పచ్చిరొట్ట ఎరువులైన జనుము, జీలుగ, నువ్వు సాగుచేయడం వలన ఎంతో ప్రయోజనం ఉంటుందని రైతులకు సూచించారు. ఇది లాభాలు తెచ్చిపెడుతుందన్నారు. అనధికారంగా బారన్లు నిర్మించవద్దని, అది చట్టరీత్యా నేరమన్నారు. వచ్చే సీజన్‌లో పొగాకు సాగుకు పొలాలు, బారన్‌లు అధిక కౌళ్లు చెల్లించి తీసుకోవద్దన్నారు. మున్ముందు మార్కెట్ ఎలా ఉంటుందో ఎవ్వరికీ తెలియదన్నారు. ఇప్పుడు లభిస్తున్న ధరలు ఏటా ఉంటాయన్న నమ్మకం లేదన్నారు. బోర్డు అనుమతికి మించి పంట సాగు చేయవద్దని కోరారు. కార్యక్రమంలో రైతు నాయకులు పోతుల నరసింహారావు, పమిడి సుబ్బానాయుడు, మర్రిపూడి హరిబాబు పాల్గొన్నారు.

### పొగాకు గరిష్ఠ ధర రూ.358

సంతనూతలపాడు, ఆగస్టు 5: మండలంలోని పేర్నమిట్ట సమీపంలో ఒంగోలు-1వ పొగాకు బోర్డు వేలం కేంద్రంలో సోమవారం పొగాకు గరిష్ఠ ధర కిలో రూ.358 రూపాయలు పలికింది. అమ్మకాలకు మంగమూరు క్లస్టర్ నుంచి 1,066 పొగాకు బేళ్లు రాగా 941 బేళ్లు అమ్ముడుకాగా 125 బేళ్లు తిరస్కరణకు గురైనట్లు ఆక్షన్ సూపరింటెండెంట్ రవికాంత్ తెలిపారు.





# శ్రావణలక్ష్మికి స్వాగతం



శ్రావణమాసం ప్రారంభం

నేడు మంగళగౌరీ వ్రతం

మోగనున్న పెళ్లి బాజాలు

కళకళలాడుతున్న వ్యాపార సముదాయాలు

ఒంగోలు(కల్చరల్), ఆగస్టు 5: మహిళలకు ఎంతో ప్రాధాన్యమైన శ్రావణమాసం సోమవారం నుంచి ప్రారంభమైంది. ముఖ్యంగా ఈ శ్రావణమాసంలో మహిళలు ఇటు మంగళవారాలు అటు శుక్రవారాలు నోచుకునే నోములకు ఎంతో ప్రాధాన్యత ఉంది. అదేవిధంగా శ్రావణ మాసంప్రారంభమైన తర్వాత రెండో శుక్రవారం వరలక్ష్మీ వ్రతంగా ఆచరిస్తారు. జిల్లావ్యాప్తంగా అనేక దేవస్థానాలలో సైతం వరలక్ష్మీ వ్రతం రోజున సామూహిక వ్రతాలు నిర్వహించారు. ఈ నెల 16వ తేదీ శుక్రవారం వరలక్ష్మీ వ్రతం. అదేవిధంగా శ్రీకృష్ణాష్టమి వంటి అనేక పండుగలు సైతం ఈ శ్రావణమాసంలోనే వస్తాయి. ఈ నెల 26వ తేదీన శ్రీకృష్ణాష్టమి పండుగ.

మూడు నెలలుగా వివాహాలు, గృహప్రవేశాలు వంటి వాటికి మూఢమి మూలంగా ముహూర్తాలు లేవు. శ్రావణమాసంలో ముహూర్తాలు ఉండటంతో జిల్లావ్యాప్తంగా వేలాది వివాహాలు, గృహప్రవేశాలు వంటి శుభకార్యాలు సైతం జరుగనున్నాయి. ఈ నెల 5,6,7,8, 10,11,12, 13,16,17,20,21 తేదీలలో మంచి ముహూర్తాలు ఉన్నట్లు పంచాంగకర్తలు పేర్కొంటున్నారు. దీంతో ఆయా తేదీలలో వేలాదిగా వివాహాలు జరుగనున్నాయి. అదే విధంగా గృహప్రవేశాలు, శంకుస్థాపనలు, ఉపనయనాలు వంటి శుభకార్యాలు సైతం వందల సంఖ్యలో చోటు చేసుకోనున్నాయి.

### కళకళలాడుతున్న మార్కెట్లు

శ్రావణమాసంలో అనేక ముహూర్తాలు ఉండటంతో వారం రోజులుగా మార్కెట్లు కళకళలాడుతున్నాయి.వస్త్రదుకాణాలు, బంగారు ఆభరణాల దుకాణాలు, చిల్లర సరుకులు వంటి అనేక వ్యాపార సముదాయాలు కొనుగోలుదారులతో నిండిపోయి కనిపిస్తున్నాయి. అనేక పెద్ద, చిన్న వస్త్ర వ్యాపారులు శ్రావణమాసం సందర్భంగా భారీ ఆఫర్లు ప్రకటించటంతో మహిళలు పెద్ద సంఖ్యలో కొనుగోలు చేయటానికి రావటంతో కళకళలాడుతున్నాయి. మరోవైపు పూల వ్యాపారులు, డెకరేషన్, ఫంక్షన్ హాళ్లు మొదలైన వాటికి సైతం డిమాండ్ పెరిగింది. ఇక శ్రావణ మాసంలో కేవలం ఫంక్షన్లకే కాకుండా నిత్యం ఇంట్లో పూజకు, అటు మంగళగౌరీ వ్రతం, శుక్రవారం నోములకు సైతం పూలు అవసరం ఉండటంతో వాటికి డిమాండ్ పెరిగి ధరలు సైతం పెరిగాయి.

మరోవైపు శ్రావణమాసం సందర్భంగా జిల్లా కేంద్రమైన ఒంగోలు నగరంతోపాటు జిల్లావ్యాప్తంగా అమ్మవారి దేవస్థానాలలో ప్రత్యేక పూజలు, అలంకరణలు జరుగనున్నాయి. ముఖ్యంగా శుక్రవారాలలో మహిళలు ఎక్కువ సంఖ్యలో దేవాలయాలకు రానుండటంతో అందుకు తగినట్లుగా ఆయా దేవాలయాల నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఒంగోలు నగరంలోని కేశవస్వామిపేట శ్రీ విజయదుర్గా దేవస్థానం, బీవీఎస్ హాలు దగ్గర ఉన్న మహాలక్ష్మీ దేవస్థానం, రంగారాయుడు చెరువు దగ్గర ఉన్న కామాక్షీ దేవస్థానం, నీలాయపాలెం కాళికా అమ్మవారి దేవస్థానం, కొత్తపట్నం బస్టాండులోని రాజరాజేశ్వర స్వామి దేవస్థానం, కేశవస్వామిపేట శ్రీ ప్రసన్న చెన్నకేశవ స్వామి దేవస్థానం, లాయర్‌పేట సాయిబాబా మందిరంలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం, మంగమూరు రోడ్డు శ్రీ గాయత్రి మందిరం, శ్రీ అచలానంద ఆశ్రమం ఇలా పలు చోట్ల శ్రావణమాసంలో ప్రత్యేక పూజలు, అమ్మవారికి విశేష అలంకరణలు, సామూహిక లక్ష కుంకుమార్చనలు జరగనున్నాయి.


మీకోసంలో అర్జీ ఇస్తున్నరైతు సంఘం ప్రతినిధులు

## సమస్యలపై అర్జీల స్వీకరణ

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 5 : స్థానిక కలెక్టరేట్‌లోని మీ కోసం భవన్‌లో సోమవారం అధికారులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. సోమవారం అమరావతిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఏర్పాటు చేసిన కలెక్టర్ల సదస్సులో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా పాల్గొనగా వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్‌కలెక్టర్ గోపాలకృష్ణతో పాటు జిల్లా అధికారులందరూ పాల్గొనడంతో ద్వితీయ శ్రేణి అధికారులు మీ కోసం కార్యక్రమంలో అర్జీలు స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు పలు సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు.

కృష్ణా, గోదావరి నదీ జలాల పునఃపంపిణీ ద్వారా రాష్ట్ర నీటి హక్కులను కాపాడే విధంగా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె. వీరారెడ్డి, వెంకటేశ్వర్లు, చంద్రశేఖరరావు, శ్రీరామ శ్రీనివాసరావు,చెరుకూరి వాసు కోరారు. నీటి హక్కు కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేకచొరవ తీసుకొని రాజకీయపార్టీలు, రైతు సంఘాలు, సాగునీటి రంగ నిపుణులతో సమావేశం నిర్వహించాలని ఆ వినతిపత్రంలో కోరారు.

### ఎస్పీ గ్రీవెన్స్‌కు 73 ఫిర్యాదులు

ఒంగోలు(క్రైం) : ఫిర్యాదులు నిర్ధేత కాలంలో విచారించి బాధితులకు సత్వర న్యాయం అందించాలని అదనపు ఎస్పీ కె.నాగేశ్వరావు సూచించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వివిధ ప్రాంతాలనుంచి 73 మంది వచ్చి తమ సమస్యలను విన్నవించారు.ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ నాగేశ్వరావు ఫిర్యాదులు స్వీకరించారు. ఆయా ఫిర్యాదులపై సంబంధిత అధికారులతో మాట్లాడి చట్ట పరిధిలో సత్వరమే పరిష్కరించాలిని, బాధితులకు సత్వర న్యాయం అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ క్రైమ్స్ ఎస్‌వీ శ్రీధరరావు తదితర అధికారులు పాల్గొన్నారు.

## వృద్ధురాలిపై హత్యాయత్నం

ఇంటికి అడ్వాన్స్ ఇస్తానంటూ

నమ్మించి మారణాయుధంతో దాడి

రూ. 5 లక్షల విలువైన సొత్తు చోరీ

దుండగుడి కోసం పోలీసుల గాలింపు


దాడిలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధురాలు సుగుణమ్మ


వృద్ధురాలి ఇంటి వద్ద వివరాలు సేకరిస్తున్న పోలీసులు

ఒంగోలు(క్రైం)ఆగస్టు5 : ఇల్లు అద్దెకు కావాలంటూ వచ్చిన ఓయువకుడు వృద్ధురాలిపై పట్టపగలు హత్యాయత్నం చేసి దోపిడీకి పాల్పడ్డాడు. ఈ ఘటన ఆదివారం స్థానిక ఏనుగు చెట్టు సమీపంలో జరిగింది. నగరంలోని ఏనుగు చెట్టు సమీపంలో గల ప్రమీల ఆహార్ వెనుక అంకమ్మపాలెంలో పటాపంజుల సుగుణమ్మకు ఓ ఇల్లు ఉంది. కింది పోర్షన్‌లో అద్దెకు ఉంటున్నారు. మొదటి అంతస్థులో ఉన్న రేకుల షెడ్ ఖాళీగా ఉండటంతో టూలెట్ బోర్డు పెట్టారు. ఈనెల 3న ఓ యువకుడు టూలెట్ బోర్డు పైన ఉన్న ఫోన్ నంబరుకు ఫోన్ చేసి ఇల్లు అద్దెకు కావాలని అడిగాడు. దీంతో సుగుణమ్మ అక్కడకు వచ్చి తాళాలు తీసి ఇంటిని చూపించింది. ఇల్లు చూసిన యువకుడు తనకు ఇల్లు నచ్చిందని చెప్పాడు. తనది పొదిలిఅని, ఒంగోలులో ఓ న్యాయమూర్తి వద్ద కారు డ్రైవర్‌గా ఉంటున్నానని చెప్పాడు. తిరిగి ఆదివారం వచ్చిన యువకుడు సుగణమ్మకు ఫోన్ చేసి అడ్వాన్స్ ఇస్తాను రమ్మని పిలిచాడు. మధ్యాహ్నం 12 గంటల తరువాత సుగుణమ్మ అక్కడకు వచ్చి ఇంటి తలుపులు తీసి లోపలకు వెళ్ళింది. వెంటనే యువకుడు లోపలికి వెళ్ళి తన వెంట తెచ్చుకున్న బలమైన ఆయుధంతో వృద్ధురాలి తలపై కొట్టాడు. దీంతో తీవ్ర రక్తస్రావం అయి స్పృహకోల్పోయింది. అనంతరం ఆమె మెడలో ఉన్న 9 సవర్ల బంగారు గొలుసు (సుమారు ఐదు లక్షలు విలువ) ను అపహరించుకొని ఇంటికి తాళాలు వేసి వెళ్లిపోయాడు. కొంత సమయం తరువాత స్పృహలోకి వచ్చిన సుగుణమ్మ రక్తపు మడుగులో నుంచి పైకి లేచి కిటికీలో నుంచి బయటకు వచ్చి తాను నివాసం ఉండే ఇంటికి వెళ్ళిపోయింది. సోమవారం ఉదయం వృద్ధురాలు కుమార్తెను పిలిచి ఆసుపత్రికి వెళ్లిన తరువాత జరిగిన విషయం చెప్పింది. ఈమేరకు ఒంగోలు వన్‌టౌన్ పోలీసులకు సుగుణమ్మ ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సంఘటనా స్థలాన్ని అదనపు ఎస్పీ (క్రైమ్స్) శ్రీధరరావు తన సిబ్బందితో కలిసి పరిశీలించారు.

### ఆందోళనకు గురౌతున్న అంకమ్మ పాలెం వాసులు

అద్దె ఇంటి కోసం అని వచ్చిన యువకుడు పథకం ప్రకారం వృద్ధురాలు సుగుణమ్మపై బలమైన ఆయుధంతో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడటం, అమె వద్ద బంగారం గొలుసు అపహరించుకెళ్లడం తెలుసుకున్న అంకమ్మపాలెం వాసులు ఆందోళనకు గురౌతున్నారు. అంతే కాకుండా అక్కడకు కూతవేటు దూరంలో ఒంగోలు వన్‌టౌన్ పోలీసుస్టేషన్ ఉంది. అయినా దుండగుడు పథకం ప్రకారం దోపిడీకి పాల్పడటం తెలుసుకున్న పట్టణ ప్రజలు భయకంపితులు అవుతున్నారు. పట్టపగలు వృద్ధురాలు లక్ష్యంగా దోపిడీ చేసిన దుండగుడు కోసం పోలీసులు గాలిస్తున్నారు.

## విద్యార్థులకు పురస్కారాల ప్రదానం


విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్న రాఘవరావు

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 5 : ది విశాఖ కో ఆపరేటివ్ బ్యాంకు ఒంగోలు బ్రాంచి ఆధ్వర్యంలో సోమవారం స్థానిక మంగమూరు రోడ్డులోని నారాయణ ఇంగ్లీషు మీడియం స్కూలు విద్యార్థులకు ఆ బ్యాంకు వైస్ ఛైర్మన్ ముదివర్తి రాఘవరావు విద్యార్థులకు ప్రతిభాపురస్కారాలను అందజేశారు. పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన పబ్బిశెట్టి సాయిమహాలక్ష్మి, నేలపాటి అనన్యలకు రూ. 5వేల చొప్పున, ఆవుల నాగకార్తీక్, పాలమర్తి కావ్య, పబ్బిశెట్టి సాయికుమార్, నూతలపాటి యశ్వశిని, ఉప్పలపాటి పెద్ద వెంకట చేతన్, పంగులూరి హర్షిత ఇంటర్ విద్యార్థులకు రూ. 7500 చొప్పున పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు బోర్డుఆఫ్ మేనేజ్‌మెంట్ సభ్యులు వడ్డీల సింగయ్య, నారాయణ స్కూలు ప్రిన్సిపాల్ సయ్యద్ నాగూర్‌వలి, ఏజీఎం ఎన్. పెద్దిరెడ్డి, బ్యాంకు మేనేజర్ వీరపల్లి బంగారుబాబు,బ్యాంకు కమిటీ సభ్యులు కొల్లా సుబ్బారావు, వీవీఆర్ చౌదరి, నాతాని బ్రహ్మానందం తదితరులు ఉన్నారు.

## ఏఐటీయూసీ సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరణ


సమ్మేళనం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 5: ఏఐటీయూసీ జాతీయసమితి సమ్మేళనాలు వచ్చే నెల 1నుంచి మూడు రోజుల పాటు జరుగుతాయని ఆయూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక మల్లయ్యలింగం భవన్‌లో సోమవారం సమ్మేళనాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఏఐటీయూసీ నాయకులు పీవీఆర్‌చౌదరి మాట్లాడుతూ విశాఖలో జరిగే సమ్మేళనంలో విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని, కార్పొరేట్ సంస్థల సంపదను పునఃపంపిణీ జరగాలని, కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని తదితర అంశాలపై చర్చిస్తామన్నారు. ఈసమ్మేళనంలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. శ్రీరామ శ్రీనివాసరావు, గద్దల బాలకోటయ్య, పాటిబండ్ల సిద్ధయ్య, దాసరి పెదబాబు, సిహెచ్‌వెంకటేశ్వర్లు, మంద ఇజ్రాయిల్, పావులూరి అంజయ్య తదితరులు ఉన్నారు.

## కూరగాయల మార్కెట్‌లో ఆక్రమణల తొలగింపు

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

ఒంగోలు(క్రైం)ఆగస్టు5 : కొత్త కూరగాయలు మార్కెట్‌లో రోడ్లపై ఆక్రమణలను కార్పొరేషన్ అధికారులు తొలిగించారు. సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కూరగాయల మార్కెట్‌లో అడ్డదిడ్డం కథనానికి అధికారులు స్పందించారు. మార్కెట్‌లో రోడ్లపై ఎలాంటి ఆక్రమణలు లేకుండా చర్యలు తీసుకున్నారు.రోడ్లపై విక్రయాలు చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని వ్యాపారులను కార్పొరేషన్ అధికారులు హెచ్చరించారు.

### సాధికారతపై బాలికలకు శిక్షణ

ఒంగోలు(విద్య), ఆగస్టు 5 : స్థానిక పీవీఆర్ బాలికల ఉన్నత పాఠశాలలో ఒంగోలు జేసీఐ ఆధ్వర్యంలో బాలికలకు సాధికారతపై శిక్షణ ఇచ్చారు. శిక్షకురాలు హరిత మాట్లాడుతూ విద్యార్థులు, తల్లిదండ్రుల అనుబంధాలు, తల్లిదండ్రుల పట్ల పిల్లలు ఏలా మెలగాలో వివరించారు. ఈ సందర్భంగా కేకే కంప్యూటర్ అధినేత వలేటి రవీంద్ర విద్యార్థినులకు నోట్ పుస్తకాలు, పెన్నులు అందించారు. జేసీఐ అధ్యక్షుడు వరుణ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి వారిని చైతన్యవంతులను చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో జేసీఐ పూర్వ అధ్యక్షుడు ఈపూరిశివకుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రసన్న తదితరులు ఉన్నారు.

### మౌలిక సదుపాయాలపై మాగుంట ప్రశ్న

ఒంగోలు(కలెక్టరేట్),ఆగస్టు 5 : దేశంలో నమోదైన మానసిక ఆరోగ్య సంరక్షణ మౌలిక సదుపాయాల కల్పన పెంపుపై కేంద్ర ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకుందని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి పార్లమెంట్‌లో ప్రశ్నించారు. దీనిపై కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ సహాయమంత్రి సమాధానం ఇస్తూ కేంద్ర నిధులతో 747 జిల్లాల్లో జిల్లా మానసిక వైద్య కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు మాగుంట ప్రశ్నకు కేంద్ర మంత్రి వివరణ ఇచ్చారు.

## అవీ..ఇవీ..

### పేదల ఆకలి తీర్చడం అభినందనీయం


అన్నదానం చేస్తున్న అరుణ, పద్మజ, నరసమ్మ

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 5 : జనసేన అధినేత, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ స్ఫూర్తితో డొక్కా సీతమ్మ పేరుతో పేదల ఆకలితీర్చడం అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు స్థానిక లాయర్‌పేటలోని డొక్కా సీతమ్మక్యాంటీన్ వద్ద సోమవారం రాష్ట్ర మహిళా అభ్యుదయ సమితి అధ్యక్షురాలు టి. అరుణ, టీడీపీ రాష్ట్ర మహిళా సెక్రటరీ నాళం నరసమ్మ, జిల్లాఅధ్యక్షురాలు రావుల పద్మజలు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జనసేన పార్టీ నాయకుడు జడ బాలనాగేంద్ర యాదవ్ ఆధ్వర్యంలో పేదల ఆకలి తీర్చేందుకు చర్యలుతీసుకోవడం హర్షణీయమన్నారు. ఇటువంటి కార్యక్రమాలకు ప్రజలు అండదండలు అందించాలని కోరారు.

### ఒంగోలు తాలుకా సీఐగా అజయ్‌కుమార్


బాధ్యతలు స్వీకరిస్తున్న అజయ్‌కుమార్

ఒంగోలు(క్రైం)ఆగస్టు5 : తాలుకా సీఐగా కె.అజయ్‌కుమార్ సోమవారం ఉదయం బాధ్యతలు తీసుకున్నారు. నెల రోజులుగా ఒంగోలు తాలుకా పోలీసుస్టేషన్ ఇన్‌చార్జీ సీఐగా మహిళా పోలీసుస్టేషన్‌లో పనిచేస్తున్న ఖాజావలి విధులు నిర్వహిస్తున్నారు. జిల్లాలో అత్యంత పెద్ద పోలీసు స్టేషన్ ఇన్‌చార్జీ పాలనలో నడిచింది. అయితే గుంటూరు రేంజ్ పరిధిలో గత నెల 31 న జరిగిన 24 మంది బదిలీలలో తాలుకా సీఐగా అజయ్‌కుమార్‌ను నియమించారు. జిల్లాలో ఐటీ కోర్‌టీమ్‌లో ఎస్సైగా పనిచేసిన అజయ్‌కుమార్ ఉద్యోగోన్నతితో నెల్లూరు మహిళ పోలీసు స్టేషన్ సీఐగా వెళ్లారు. అక్కడ నుంచి బదిలీపై ఒంగోలు తాలుకా పోలీసు స్టేషన్‌కు వచ్చారు. జిల్లాలో ఎస్సైగా అజయ్‌కుమార్ పలు చోట్ల పనిచేశారు.

### నువ్వు పంట పరిశీలన


ఎండుముఖం పట్టిన నువ్వుపంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

సంతనూతలపాడు, ఆగస్టు 5: వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో మండలంలోని పేర్నమిట్టలో బెట్టకు వచ్చి వాడుముఖం పట్టిన నువ్వు పంటను జిల్లా వ్యవసాయఅధికారి ఎస్.శ్రీనివాసరావు సోమవారం పరిశీలించారు. పంట సాగుచేస్తున్న ప్రతి రైతు వివరాలు ఈపంటలో నమోదు చేయాలని వ్యవసాయ సహాయకురాలిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భూసారసంరక్షణ అధికారి ఎం.సుబ్రమణ్యం, వ్యవసాయ సంచాలకులు బి.రమేష్, వ్యవసాయ సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

### తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ


నూతన తహసీల్దార్‌కు పుష్పగుచ్చం అందిస్తున్న కార్యాలయ సిబ్బంది

నాగులుప్పలపాడు, ఆగస్టు 5 : మండల నూతన తహసీల్దార్‌గా కె. ప్రవీణ్ కుమార్ సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. సార్వత్రిక ఎన్నికల్లో విధుల్లో భాగంగా ప్రకాశం జిల్లా నుంచి బదిలీపై పల్నాడు జిల్లా అచ్చంపేట కు వెళ్లారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఇక్కడకు వచ్చారు. డిప్యూటీ తహసీల్దార్ ఎన్. జయలక్ష్మి, సర్వేయర్ నందయ్య, ఆర్ఐ ప్రమోద్, వీఆర్‌వోలు తహసీల్దార్‌కు పూలబొకే అందజేశారు.

### ప్రభుత్వ ప్రోత్సాహాన్ని అందిపుచ్చుకోవాలి


పుస్తకాలు అందజేస్తున్న టీడీపీ అధ్యక్షుడు సాంబశివరావు తదితరులు

పొన్నలూరు (కొండపి), ఆగస్టు 5 : ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని అందిపుచ్చుకుని విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు సూచించారు. పొన్నలూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు సోమవారం ఆయన పాఠ్య, నోటు పుస్తకాలను అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఈ ఏడాది ఇంటర్ విద్యార్థులకు పుస్తకాలు ఉచితంగా అందించారన్నారు. కార్యక్రమంలో నాయకులు మండవ ప్రసాద్, తానికొండ ప్రసాద్, పల్లపోతు రమేష్, ఎంఈవో ఇడపలపాటి రవిచంద్ర, కళాశాల ప్రిన్సిపాల్ రవీంద్రబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

### పీఎంశ్రీ పాఠశాలలను రిజిస్ట్రేషన్ చేయాలి

ఒంగోలు(విద్య),ఆగస్టు 5 : జిల్లాలో పీఎంశ్రీ పథకం కింద ఎంపికైన 48 పాఠశాలలను స్కూలు ఇన్నోవేషన్ కౌన్సిల్‌లో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి డి. సుభద్ర ఒక ప్రకటనలో తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసిన తర్వాత సర్టిఫికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. అలాగే ఈ నెల 7న నిర్వహిస్తున్న ఆన్‌లైన్ ఓరియంటేషన్ కార్యక్రమంలో ఫేజ్-1,ఫేజ్-2 దశల్లో ఎంపికైన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తప్పని సరిగా పాల్గొనాలని డీఈవో కోరారు.

### మోటార్ సైకిల్ అదుపుతప్పి గాయాలు

మద్దిపాడు,ఆగస్టు 5:మోటార్ సైకిల్ అదుపుతప్పిన సంఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. సోమవారం గుండ్లాపల్లి ఫ్లైఓవర్‌పై అద్దంకి నుంచి ఒంగోలు వెళ్తున్న ద్విచక్రవాహనం కారును అధిగమించబోయి అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ సంఘటనలో అద్దంకికి చెందిన పి.రమేష్, ఆర్.శ్రీనివాసరావులకు గాయాలు కాగా చికిత్స కోసం ఒంగోలు తరలించారు.

### శ్మశాన వాటిక అభివృద్ధికి చర్యలు


జంగిల్ క్లియరెన్స్ చేయిస్తున్న సర్పంచ్

మద్దిపాడు, ఆగస్టు 5:వెల్లంపల్లి శ్మశాన వాటిక అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు పంచాయతీ సెక్రెటరీ మాదవి తెలిపారు. సోమవారం శ్మశాన వాటికలో జంగిల్ క్లియరెన్స్ పనులకు శ్రీకారం చుట్టారు. అభివృద్ధికి ప్రతి ఒక్కరు తోడ్పాటు నందించాలని ఆవె కోరారు. సర్పంచి చిట్టిబోయిన అనిల్‌కుమార్ యాదవ్ నేతృత్వంలో చిల్లచెట్లు తొలగించి పనులు ప్రారంభించారు.

### స్కీం వర్కర్ల తొలగింపులను ఆపాలి


ధర్నాలో మాట్లాడుతున్న కాలం సుబ్బారావు

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 5 : ప్రభుత్వశాఖల్లో పనిచేస్తున్న స్కీం వర్కర్ల తొలగింపును వెంటనే నిలుపుదల చేయాలని సీఐటీయూ జిల్లాఅధ్యక్షుడు కాలం సుబ్బారావు డిమాండ్‌చేశారు. ఆ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకులు జీవీ కొండారెడ్డి, జి. శ్రీనివాసులు, పి. కల్పన, టి. రాము, పి ఆంజనేయులు, డి మహేష్, సుబ్బారావు, సుబ్బమ్మ, బసవ పున్నయ్య, అన్వర్, ఆర్‌మాలకొండయ్య, ఆనంద్, తంబి శ్రీనివాసులు ఉన్నారు.


మిరప నర్సరీని పరిశీలిస్తున్న ఉద్యానవనశాఖ అధికారి ప్రత్యూష

# అమృత్ పథకంపై కదలిక

**అన్ని ప్రాంతాలకూ నీటిని అందించలేకపోతున్న దర్శి ఎన్‌ఏపీ**

**ఏడాదిన్నర క్రితం రూ.121 కోట్లు మంజూరు చేసిన కేంద్రం**

**వైసీపీ ప్రభుత్వ హయాంలో పట్టించుకోని పాలకులు**

**తాజాగా టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి**

**గొట్టిపాటి లక్ష్మి చొరవతో కార్యాచరణ**

దర్శి, ఆగస్టు 5 : దర్శి నగర పంచాయతీలోని ప్రజలకు రక్షిత మంచి నీరు అందించే బృహత్తరమైన అమృత్ పథకం అమలుకు శ్రీకారం చుట్టారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అమృత్ పథకానికి ఏడాదిన్నర క్రితం రూ.121 కోట్లు మంజూరైన విషయం తెలిసిందే. వైసీపీ పాలకుల నిర్లక్ష్యం వలన ఆ పథకం అడుగు ముందుకు పడలేదు. ఎన్నికల ముందు అప్పటి వైసీపీ పాలకులు హడావుడిగా శిలాఫలకం వేశారు. కానీ పనుల నిర్వహణ గురించి పట్టించుకోలేదు.

**పులిపాడు చెరువు నుంచి పథకం అమలు**

టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమృత్ పథకం నిర్మాణంపై అధికారులు దృష్టి సారించారు. పులిపాడు చెరువును మంచినీటి సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుగా అభివృద్ధి చేసి సాగర్ వాటర్ నింపుతారు. పైపులైన్ల ద్వారా దర్శి పట్టణంలోని ప్రజలకు తాగునీరు అందిస్తారు. అందులో భాగంగా పట్టణంలోని అన్నీ కుటుంబాలకు ఇంటింటికి కొళాయి ఏర్పాటు చేస్తారు.

**దర్శితోపాటు 120 గ్రామాల ప్రజలకు మేలు**

అమృత్ పథకం నిర్మాణం పూర్తయితే దర్శి ప్రాంతంలోని ప్రజలకు తాగునీటి సమస్య పూర్తిగా తొలగిపోనుంది. ఒక్క దర్శి పట్టణంలోనే సుమారు 14వేల కుటుంబాలు ఉన్నాయి. మొత్తం 88 వేల మంది జనాభా ఉన్నారు. ఇప్పటి వరకు దర్శి ఎన్‌ఏపీ రక్షిత మంచినీటి పథకం ద్వారా 120 గ్రామాలతో పాటు దర్శి పట్టణానికి మంచినీటి సరఫరా చేస్తున్నారు. ఎన్‌ఏపీ చెరువు పూడిపోవటంతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయింది. దీంతో అన్నీ గ్రామాలకు మంచినీరు సక్రమంగా అందించలేకపోతున్నారు. ఒక్కోసారి దర్శి పట్టణంలోని శివారు ప్రాంతాలకు కూడా తాగునీరు సక్రమంగా అందటం లేదు. అమృత్ పథకం నిర్మాణం పూర్తయితే నూతనంగా నిర్మించే చెరువు ద్వారా పట్టణ ప్రజలకు సమృద్ధిగా నీరు అందించే అవకాశం ఉంటుంది. దీంతో ఎన్‌ఏపీ స్కీం ద్వారా గ్రామీణ ప్రాంతాలకు కూడా సమృద్ధిగా మంచినీరు అందించే వీలు కలుగుతుంది. బహుళ ప్రయోజనాలు కలుగుతున్న అమృత్ పథకాన్ని వైసీపీ పాలకులు పక్కన పడేయటం పట్ల పట్టణ ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి ఆ పథకం అమలుపై ప్రత్యేక దృష్టి సారించారు. అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు చెప్పారు. దీంతో దర్శి పట్టణ ప్రజలకు తాగునీటి సమస్య పూర్తిగా తొలగుతుంది.


దర్శి పట్టణం

## లైసెన్స్ లేకుండా నారు విక్రయిస్తే చర్యలు

**ఉద్యానశాఖ అధికారి ప్రత్యూష హెచ్చరిక**

జరుగుమల్లి (కొండపి), ఆగస్టు 5 : లైసెన్స్ లేకుండా నారు విక్రయించే నర్సరీలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఉద్యానశాఖాధికారి డి.ప్రత్యూష హెచ్చరించారు. యజమానులు నర్సరీలను తప్పనిసరిగా రిజిస్టర్ చేయించుకోవాలని సూచించారు. సోమవారం ఆమె మండలంలోని వర్ధినేనివారిపాలెంలో మిరప నారు నర్సరీలను పరిశీలించారు. ఈసందర్భంగా నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. నర్సరీల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దానివల్ల చీడపీడలు ఆశించవన్నారు. నారు విక్రయించేటప్పుడు రైతులకు విధిగా రశీదులు ఇవ్వాలని కోరారు. నర్సరీ పేరు, మొక్కల ధరలు కనిపించేలా ప్రత్యేక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. తమశాఖ ద్వారా పండ్ల, పూలతోటలు, కూరగాయల సాగుకు రాయితీలు అందిస్తున్నామని, ఆసక్తి ఉన్న రైతులు ఆర్‌బీకేల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ప్రత్యూష కోరారు.

## ప్రజలకు నీటి సమస్య తలెత్తకుండా చూడాలి

**ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి**


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

కనిగిరి, ఆగస్టు 5 : పట్టణంలోని ప్రజలకు నీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసిహారెడ్డి చెప్పారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం రాత్రి మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు, సచివాలయం సిబ్బందితో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలో చాలా చోట్ల నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నట్లు ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. అధికారులు, కౌన్సిలర్లు భవిష్యత్తు కార్యాచరణతో నీటి సమస్య పరిష్కారానికి ముందడుగు వేయాలని చెప్పారు. ప్రత్యేకంగా నీటి ఎద్దడి, భూగర్భ జలాలు అడుగంటిన ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో నీటిని సరఫరా చేయాలని సూచించారు. అదేవిధంగా శివారు కాలనీల్లో నివసించే పేద, గిరిజన వర్గాలకు నీటిని సక్రమంగా అందించాలన్నారు. నీటి సమస్య పరిష్కారంలో టీడీపీ నేతలు చొరవ వహించి అధికారులకు ప్రజలకు వారధిగా పనిచేయాలని చెప్పారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు, మున్సిపల్ చైర్మన్ గఫార్, కౌన్సిలర్లు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

## ఒమ్మెవరానికి బస్సు సౌకర్యం కల్పించాలి

నాగులుప్పలపాడు, ఆగస్టు 5: తమ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని ఒమ్మెవరం సర్పంచ్ పాలపర్తి బాలకోటి, గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొమ్మాలపాటి సురేష్ కోరారు. సోమవారం వారు మాట్లాడుతూ ఒమ్మెవరం గ్రామానికి ఎన్నో ఏళ్ల నుంచి ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తమ గ్రామం నుంచి ఒంగోలు, చీరాల ఇతర ప్రాంతాలకు ప్రయాణించాలంటే ఉప్పుగుండూరు లేదా కండ్లగుంట రోడ్డు వరకు రెండు కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్ళి అక్కడి నుంచి ఆర్టీసీ బస్సులో వెళ్ళాల్సి వస్తుందన్నారు. ఒంగోలు నుంచి ఉప్పుగుండూరు- రాచపూడి మీదుగా ఇంకొల్లు వెళ్లే ఆర్టీసీ బస్సు సర్వీసు తమ గ్రామం నుండి వెళ్లేలా అధికారులు చొరవ తీసుకోవాలని వారు కోరారు. గతంలో అద్దంకి నుంచి ఒమ్మెవరం గ్రామం మీదుగా రాపర్ల రైల్వేస్టేషన్ వరకు అద్దంకి డిపో ఆర్టీసీ బస్సు నడిచిందన్నారు. కొద్ది రోజుల నుంచి ఆ సర్వీసును ఆర్టీసీ అధికారులు నిలిపి వేశారన్నారు. ఆ సర్వీసును పునరుద్ధరించి రాపర్ల రైల్వేస్టేషన్ కు బదులు తమ గ్రామం మీదుగా పెదగంజాం బీచ్ వరకు కొనసాగిస్తే పర్యాటకులకు, ఉప్పుగుండూరు, అద్దంకి ప్రాంతాలలో వ్యాపార లావాదేవీలు నిర్వహించే వారికి, సామాన్య ప్రజలకు సైతం అనుకూలంగా ఉంటుందన్నారు. ఇదే విషయాన్ని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి దృష్టికి కూడా తీసుకువెళ్లామని వారు వివరించారు. ఆర్టీసీ అధికారులు స్పందించి తమ గ్రామానికి బస్సు సర్వీసు కొనసాగేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు.


తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన మధుసూదనరావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న మండలంలోని వీఆర్వోలు

## తహసీల్దార్ మధుసూదనరావు బాధ్యతల స్వీకరణ

కొత్తపట్నం(ఒంగోలు నగరం), ఆగస్టు 5: కొత్తపట్నం మండల తహసీల్దార్‌గా పిన్నిక మధుసూదనరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో జిల్లాలో ఆయన చీమకుర్తి, సంతనూతలపాడుతో పాటు పలు మండలాల్లో తహసీల్దార్‌గా పనిచేసిన అనుభవం ఉంది. పనిచేసిన ప్రతి చోటా సమర్థవంతుడిగా ఆయన పేరుతెచ్చుకున్నారు. కొత్తపట్నం మండలంలో రెవెన్యూ సంబంధమైన సమస్యలు కోకొల్లలుగా ఉన్నాయి. తమ సమస్యల పరిష్కారం కోసం నిత్యం రెవెన్యూకార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. ఈ పరిస్థితుల్లో తహసీల్దార్‌గా మధుసూదనరావు బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు చేపట్టిన ఆయన్ను మండలంలోని పలువురు వీఆర్వోలు, రాజకీయ నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రశాంతతకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు

**దర్శి సీఐ షేక్ షమీముల్లా**


కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ షేక్ షమీముల్లా

ముండ్లమూరు, ఆగస్టు 5 : మండలంలోని శంకరాపురంలో గత నెలలో ఇరు వర్గాలు ఘర్షణ పడటంతో ఒక వర్గానికి చెందిన వారిపై పోలీసులు కేసు నమోదు చేయగా రిమాండ్‌కు వెళ్లి వచ్చారు. ఈ సందర్భంగా దర్శి సీఐ షేక్ షమీముల్లా, ముండ్లమూరు పోలీసు సిబ్బంది సోమవారం శంకరాపురం వెళ్లి ఇరు వర్గాలకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామంలో ప్రశాంతతకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆవేశాలకు లోనై గొడవల్లో తలదూర్చి జైలు పాలు కావద్దన్నారు. చదువుకున్న యువతీ యువకులు గొడవల్లో తలదూర్చి వారి జీవితాలను నాశనం చేసుకోవద్దని చెప్పారు. ఒకసారి కేసు నమోదైన తరువాత ప్రభుత్వ ఉద్యోగాలు సైతం కోల్పోతారన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ వీ నాగమల్లేశ్వరరావు, సిబ్బంది ఉన్నారు.

**మందుబాబులకు పోలీస్ కౌన్సెలింగ్**

మండలంలోని బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న మందుబాబులకు ఎస్‌ఐ వీ నాగమల్లేశ్వరరావు సోమవారం సాయంత్రం తనదైన శైలిలో కౌన్సెలింగ్ ఇచ్చారు. మద్యం తాగి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో పేకాట, కోడి పందాలు లాంటివి ప్రోత్సహించినా, ఆడినా చర్యలు తీవ్రంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది మహేష్, ప్రేమానిధి ఉన్నారు.

## డీఎస్సీ ఉచిత కోచింగ్‌కు దరఖాస్తు చేసుకోవాలి

ఒంగోలు నగరం, ఆగస్టు 5: జిల్లాలోని అర్హులైన ఎస్టీ నిరుద్యోగ అభ్యర్థులకు డీఎస్సీపై ఉచిత కోచింగ్ ఇవ్వనున్నట్లు జిల్లా గిరిజనసంక్షేమశాఖాధికారి జగన్నాథరావు ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ, బీఈడీ, ఇంటర్, డీఈడీ ఉత్తీర్ణతతో పాటు టెట్‌లో ఉత్తీర్ణులైన ఎస్టీ అభ్యర్థులకు ఉచిత కోచింగ్ ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న వారిలో మెరిట్ ఆధారంగా కోచింగ్‌కు అభ్యర్థుల ఎంపిక జరుగుతుందని ఆయన తెలిపారు. కోచింగ్ తీసుకునేందుకు ఆసక్తి కలిగిన వారు పదవ తరగతి ఉత్తీర్ణత, ఇంటర్, డీఈడీ, డిగ్రీ , బీఈడీ , టెట్‌లో ఉత్తీర్ణత సాధించిన సర్టిఫికెట్‌లతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వీటితో పాటు ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ సర్టిఫికెట్, రేషన్ కార్డు జిరాక్స్ కాపీలతో మూడు పాస్‌ఫోటోలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 11వ తేదీలోగా తమ దరఖాస్తులను దక్షిణ బైపాస్‌లోని ప్రగతి భవన్‌లో ఉన్న జిల్లా గిరిజన సంక్షేమశాఖ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

## స్కూలు కాంప్లెక్స్ సమావేశాల తేదీలు ఖరారు

ఒంగోలు(విద్య), ఆగస్టు 5 : ప్రస్తుత విద్యాసంవత్సరంలో స్కూలు కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించే తేదీలను ఖరారు చేశారు. ఈ మేరకు పాఠశాల విద్యాకమిషనర్ విజయరామరాజు ఉత్తర్వులు జారీ చేశారు. స్కూలు కాంప్లెక్స్ సమావేశాల నిర్వహణపై స్పష్టమైన మార్గదర్శకాలు జారీచేశారు. ఆగస్టులో 17,19, సెప్టెంబరులో 17,18 , అక్టోబరులో 16,17, నవంబరు 18,19 , డిసెంబర్ 16,17, 2025 జనవరిలో 22,23, ఫిబ్రవరి 21,22 , మార్చి 21,22 తేదీల్లో పాఠశాల కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించాలని కమిషనర్ ఆదేశించారు. స్కూలు కాంప్లెక్స్‌లో నిర్వహించాల్సిన సమగ్ర కార్యకలాపాలన్నీ అమలు పట్ల ఆర్‌జేడీలు, డీఈవోలు, ఏపీసీలు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## కంటి పరీక్షా శిబిరానికి విశేష స్పందన

మద్దిపాడు, ఆగస్టు 5: మద్దిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉద్యానాధికారులు డాక్టర్ శ్రవణ్‌కుమార్, జగదీష్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన కంటి పరీక్షా శిబిరానికి విశేష స్పందన లభించింది. పీహెచ్‌సీ కంటి వైద్యులు సీహెచ్ జయరాజు మాట్లాడుతూ నేత్ర ఆరోగ్యాన్ని దెబ్బతీయటంలో కంటి శుక్లాలు ప్రధాన పాత్ర పోషిస్తాయన్నారు. 50 సంవత్సరాలు దాటిన వారిలో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తుందని, దాన్ని నిర్లక్ష్యం చేస్తే అంధత్వం వచ్చే ప్రమాదం ఉందన్నారు. తొలిదశలో గుర్తించి తగు జాగ్రత్తలు తీసుకోవటం అవసరమని, శుక్లాల లక్షణాలు కనిపిస్తే తప్పనిసరిగా వైద్యులను సంప్రదించాలన్నారు. మొత్తం 190 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా వారిలో 62 మందికి శుక్లాలు ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. వీరిని పెదకాకాని శంకర్ నేత్రాలయానికి పంపిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## పేదలకు నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యం

- ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి
- ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ కేంద్రం ప్రారంభం


డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభించి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, ఆగస్టు 5: పేదప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. సోమవారం గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలలో ఏర్పాటుచేసిన డయాలసిస్ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం డయాలసిస్ సెంటర్‌ను పరిశీలించి చికిత్స పొందుతున్న రోగులతో ముచ్చటించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే అశోక్ రెడ్డి మాట్లాడుతూ గిద్దలూరు ప్రాంతంలో మెరుగైన వైద్యసౌకర్యాలు లేకపోవడాన్ని గుర్తించి డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటుచేసినట్లు చెప్పారు. గతంలో డయాలసిస్ చేయించుకోవాలంటే నంద్యాల, మార్కాపురం వెళ్ళాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. దీనిని గమనించి గిద్దలూరు ప్రాంతంలో డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రిని వంద పడకలుగా తీర్చిదిద్దుతామన్నారు. నియోజకవర్గ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళి అభివృద్ధి చేస్తానని తెలిపారు.

కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, జడ్పీటీసీ మధుసూదన్‌యాదవ్, టీడీపీ పట్టణ, మండల అధ్యక్షులు సయ్యద్ షానేషావలి, మార్తాల సుబ్బారెడ్డి, వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సూరిబాబు, డాక్టర్ ఆదామ్, డాక్టర్ రమణారెడ్డి పాల్గొన్నారు.

అలాగే, బీజేపీ నాయకుడు పిడతల రమేష్‌రెడ్డి, కౌన్సిలర్లు గడ్డం భాస్కరరెడ్డి, లొక్కు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## తల్లిపాలతో బిడ్డకు ఆరోగ్యం

కొండపి, ఆగస్టు 5 : తల్లిపాలతో బిడ్డలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విక్టోరియారాణి అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం నిర్వహించిన కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. చోడవరం, పెరిదేపి, కొండపిలోని ఎస్సీ కాలనీ, కుమ్మరిపాలెం, మూగచింతలలో తల్లులకు అవగాహన కల్పించారు.

**మంగమూరులో తల్లిపాల వారోత్సవాల ర్యాలీ**

సంతనూతలపాడు: మండలపరిధిలోని మంగమూరు గ్రామంలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అంగనవాడీ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. తల్లి పాలు బిడ్డకు వ్యాధి నిరోధకశక్తిని ఇస్తాయన్నారు. బిడ్డ జన్మించిన తర్వాత ఆరు నెలల వరకు తల్లిపాలు తాపించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పద్మావతి, అంగనవాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

**నాగులుప్పలపాడులో..**

నాగులుప్పలపాడు : పుట్టిన బిడ్డకు తల్లి ముర్రుపాలు తాగించడం ఎంతో శ్రేష్టమని నాగులుప్పలపాడు ప్రభుత్వ వైద్యశాల వైద్యులు వనారియల్ సూచించారు. చదలవాడ గ్రామంలో సోమవారం నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల అవగాహన సదస్సు ర్యాలీలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ కె. ప్రమీల, వైద్య శాఖ, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులకు 9 గంటల కరెంట్

**ఈఈ మస్తాన్‌రావు**


రైతులతో మాట్లాడుతున్న అద్దంకి డీవిజన్ ఈఈ మస్తాన్‌రావు, డీఈఈ సురేంద్రబాబు

బల్లికురవ, ఆగస్టు 5 : పంటలు సాగు చేస్తున్న రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను 9 గంటల పాటు అందిస్తామని ఎక్కడైనా లోపాలుంటే వెంటనే తమ దృష్టికి తీసుకు రావాలని విద్యుత్ శాఖ అద్దంకి డివిజన్ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు తెలిపారు. సోమవారం బల్లికురవ సబ్‌స్టేషన్ ఆవరణలో మార్టూరు డీఈఈ ఎం.సురేంద్రబాబు, మండల ఏఈ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విద్యుత్ అదాలత్ కార్యక్రమం జరిగింది. పలు గ్రామాల నుంచి వచ్చిన రైతులు వ్యవసాయ విద్యుత్ లైన్ల సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చారు. కొన్ని చోట్ల తీగలు నేలజారి ఉన్నాయని కొన్ని చోట్ల ట్రాన్స్‌ఫార్మర్‌లు చోరీ కాగా, కొత్తవి రాలేదని, కొన్ని చోట్ల డీడీలు కట్టి నెలలు గడుస్తున్నా కొత్త లైన్లు ఏర్పాటు చేయలేదని కొందరు వ్యవసాయ విద్యుత్ లైన్లు మర్మతులకు గరవుతున్నాయని ఫిర్యాదులు చేశారు. ఈ సందర్భంగా ఈఈ మస్తాన్‌రావు మాట్లాడుతూ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సహకారంతో గ్రామాలలో విద్యుత్ లైన్లను పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపడతామన్నారు. రైతులు కూడా తమకు సహకరించాలన్నారు. కొన్ని గ్రామాలలో ఇప్పటికే ప్రత్యేక త్రిఫేజ్ విద్యుత్ లైన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. రైతులు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం సిబ్బందికి ఎవరూ నగదు ఇవ్వాల్సిన పని లేదన్నారు. వరుస క్రమంలో డీడీలు చెల్లించిన రైతులకు వ్యవసాయ లైన్లు ఏర్పాటు చేయిస్తామన్నారు. పొలాల్లో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలు ఎక్కువయ్యాయని, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పలు గ్రామాల రైతులు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

సంతనూతలపాడు, ఆగస్టు 5: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని బీజేపీ మండల అధ్యక్షుడు తెల్లమేకల శ్రీనివాసరావు అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఇచ్చిన పిలుపుమేరకు అమ్మకోసం ఒక చెట్టు కార్యక్రమంలో భాగంగా సోమవారం సంతనూతలపాడులోని స్థానిక జడ్పీహైస్కూల్లో మొక్కలను నాటారు. అదేవిధంగా మండలంలోని పి.గుడిపాడు గ్రామంలో గ్రామఅధ్యక్షుడు బాలినేని కళ్యాణ్‌రెడ్డి ఆధ్వర్యంలో బాపట్లజిల్లా నాయకులు ఎం.రామకృష్ణ, కృష్ణారెడ్డిలు మొక్కలు నాటారు. కార్యక్రమంలో సూదనగుంట కృష్ణమూర్తి, బీజేపీ నాయకులు, ఎంఈవో, హెచ్‌ఎం తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో కూలీ మృతి

**మరొకరికి తీవ్ర గాయాలు**


చిట్టిబాబు మృతదేహం

అద్దంకి, ఆగస్టు 5 : రోడ్డు ప్రమాదంలో రాజమండ్రి ప్రాంతానికి చెందిన కూలీ మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం రఘుదేవపురానికి చెందిన జె.చిట్టిబాబు (32), హరిబాబు అద్దంకి మండలం చక్రాయపాలెం వద్ద పొగనారు మళ్ల వద్ద పనిచేసేందుకు వచ్చారు. సోమవారం సాయంత్రం చ క్రాయపాలెం నుంచి అద్దంకి వచ్చేందుకు మోపెడ్‌పై నామ్ రోడ్డులో హైస్కూల్ వద్ద మలుపు తిరుగుతుండగా పిడుగురాళ్ల వైపు నుంచి అద్దంకి వైపు వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చిట్టిబాబు అక్కడికక్కడే మృతి చెందగా, హరిబాబుకు తీవ్ర గాయాలయ్యాయి.

## క్విట్‌కార్పొరేట్ ఉద్యమాన్ని విజయవంతం చేయాలి

**సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు**

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 5 : దేశ సంపద సృష్టికర్తలైన రైతులు, వ్యవసాయకూలీల శ్రమను దోపిడీ చేస్తూ కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతున్న కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈనెల 9న జరిగే క్విట్‌కార్పొరేట్ ఉద్యమాన్ని విజయవంతం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లాకన్వీనర్ చుండూరి రంగారావు పిలుపునిచ్చారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి సమావేశం సోమవారం జరిగింది. ఈ సమావేశంలో రంగారావు మాట్లాడుతూ రెండో సారి అధికారంలోకి వచ్చాక మోదీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక పాలన కఠినంగా అమలు చేస్తుందన్నారు.

9న జరిగే కార్యక్రమంలో రైతులు, రైతుకూలీలు, మేధావులు, సామాజిక వేత్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు కే వీరారెడ్డి, జయంతి బాబు, పమిడి వెంకట్రావు, నాగరాజు, కంకణాల ఆంజనేయులు, ఎస్‌కేబాబు, కొత్తకోట వెంకటేశ్వర్లు, పీవీఆర్‌చౌదరి, జి. శ్రీనివాసులు, ఎంఎస్ సాయి, మండవ శ్రీనివాసరావు, వి. బాలకోటయ్య, పెంట్యాల హనుమంతరావు తదితరులు ఉన్నారు.

# బ్యాంకులో అగ్ని ప్రమాదం

**» సకాలంలో మంటలను అదుపుచేసిన అగ్నిమాపక సిబ్బంది**

మార్కాపురం, ఆగస్టు 5: స్థానిక రాజాజీవీధిలోని ఓ బ్యాంక్‌లో సోమవారం ఉదయం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఫైర్, బ్యాంకు సిబ్బంది సకాలంలో స్పందించడంతో పెద్ద ప్రమాదం తప్పింది. బ్యాంకులోని ఏసీ వద్ద వైర్లు షార్ట్ సర్క్యూట్‌కు గురి కావడంతో కొద్దిపాటి మంటలు లేచాయి. వెంటనే అప్రమత్తమైన బ్యాంకు సిబ్బంది విషయాన్ని ఫైర్ ఆఫీస్‌కు తెలిపారు. వారు వచ్చేలోపు బ్యాంకులో కరెంట్ ఆపేశారు.

సకాలంలో అక్కడకు చేరుకున్న మార్కాపురం ఫైర్ ఆఫీసర్ రామకృష్ణ వెంటనే చిన్నపాటి మంటలను బ్యాంకులో ఉన్న ఫైర్‌సేఫ్టీ పరికరాలతో ఆపేశారు. అనంతరం బ్యాంకు సిబ్బందికి ఫైర్‌సేఫ్టీ పరికరాలను ఎలా ఉపయోగించాలో క్షుణ్ణంగా వివరించారు. ఆయన వెంట ఫైర్ సిబ్బంది ఉన్నారు.

## చెక్‌బౌన్స్ కేసులో ఆరు నెలల జైలు

మార్కాపురం, ఆగస్టు 5: చెక్‌బౌన్స్ కేసులో జైలుశిక్ష, జరిమానా విధిస్తూ కింది కోర్టు ఇచ్చిన తీర్పునే అమలుచేయాలని మార్కాపురం ఆరవ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం.శుభవాణి సోమవారం తీర్పు చెప్పారు. కోర్టు కార్యాలయం వివరాల మేరకు.. త్రిపురాంతకం మండల కేంద్రానికి చెందిన రైల్వే ఉద్యోగి కట్టెంపుడి జాన్ బరాక్ మార్కాపురంకు చెందిన పాముల సూర్యనారాయణకు బాకీకి సంబంధించి 2013లో రూ.1.80 లక్షలకు చెక్ ఇచ్చారు.

సూర్యనారాయణ ఆ చెక్‌ను బ్యాంకులో వేయగా బౌన్స్ అయింది. ఈమేరకు స్థానిక ఏజేఎఫ్‌సీఎం కోర్టులో కేసు వేశాడు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన అప్పటి ఏజేఎఫ్‌సీఎం కోర్టు న్యాయమూర్తి జాన్ బరాక్‌కు ఆరునెలల జైలుశిక్ష, రూ.1.85 లక్షలు చెల్లించాలని తీర్పునిచ్చారు. అప్పట్లో తీర్పును సవాలు చేస్తూ జాన్ బరాక్ ఆరవ అదనపు జిల్లా న్యాయస్థానంలో అప్పీల్‌కు వెళ్లాడు. ఈ కేసులో కింది కోర్టు తీర్పును అమలుచేయాలని న్యాయమూర్తి ఆదేశించారు. తీర్పు రోజున కోర్టుకు హాజరుకాని జాన్ బరాక్‌పై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేయాలని సూచించారు. బాధితుని తరపున న్యాయవాది పైడిమర్రి రామ చంద్ర వాదించారు.

## విధులు బహిష్కరించిన న్యాయవాదులు

పొదిలి, ఆగస్టు 5: పొదిలి జూనియర్ సివిల్ కోర్టులో న్యాయవాదులు సోమవారం విధులు బహిష్కరించినట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమణ కిషోర్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంటూరు, మంగళగిరి న్యాయవాదులు బి.నాగరాజు, జి.గవాస్కర్లపై పోలీసులు అక్రమ కేసులు బనాయించినందుకు నిరసనగా విధులు బహిష్కరించినట్లు తెలిపారు.

కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి షేక్ షబ్బీర్, న్యాయవాదులు లక్ష్మీరెడ్డి, బి.సురేష్‌కుమార్, టి.రామ్మోహన్‌రావ్, జి.శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, ఏ.సురేష్ కుమార్, సుజాత, సలీమ్, కిషోర్, గౌతమి, మహేష్‌బాబు, శ్రీహర్ష తదితరులు పాల్గొన్నారు.





# పేదలకు నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యం

**» ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి**

**» ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ కేంద్రం ప్రారంభం**



డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభించి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, ఆగస్టు 5: పేదప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. సోమవారం గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలలో ఏర్పాటుచేసిన డయాలసిస్ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం డయాలసిస్ సెంటర్‌ను పరిశీలించి చికిత్స పొందుతున్న రోగులతో ముచ్చటించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే అశోక్ రెడ్డి మాట్లాడుతూ గిద్దలూరు ప్రాంతంలో మెరుగైన వైద్యసౌకర్యాలు లేకపోవడాన్ని గుర్తించి డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటుచేసినట్లు చెప్పారు. గతంలో డయాలసిస్ చేయించుకోవాలంటే నంద్యాల, మార్కాపురం వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. దీనిని గమనించి గిద్దలూరు ప్రాంతంలో డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రిని వంద పడకలుగా తీర్చిదిద్దుతామన్నారు. నియోజకవర్గ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి అభివృద్ధి చేస్తానని తెలిపారు.

కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, జడ్పీటీసీ మధుసూదన్‌యాదవ్, టీడీపీ పట్టణ, మండల అధ్యక్షులు సయ్యద్ షానేషావలి, మార్తాల సుబ్బారెడ్డి, వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సూరిబాబు, డాక్టర్ ఆదామ్, డాక్టర్ రమణారెడ్డి పాల్గొన్నారు.

అలాగే, బీజేపీ నాయకుడు పిడతల రమేష్‌రెడ్డి, కౌన్సిలర్లు గడ్డం భాస్కర్‌రెడ్డి, లొక్కు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# తల్లిపాలు బిడ్డకు శ్రేష్ఠం



దోర్నాల: వారోత్సవాల్లో పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకర్తలు

పెద్దదోర్నాల, ఆగస్టు 5: తల్లిపాలు బిడ్డకు శ్రేష్ఠమని చింతల వైద్యాధికారి యాగ్నిక్ అన్నారు. సోమవారం స్థానిక ఇందిరానగర్, మండలంలోని తిమ్మాపురం అంగన్‌వాడీ కేంద్రాలలో తల్లిపాల వారోత్సవాలు సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా యాగ్నిక్ మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టించడం చాలా ప్రయోజనాలు ఉంటాయన్నారు. కార్యక్రమాల్లో కమ్యూనిటీ హెల్త్ అధికారిణి సౌజన్య అంగన్‌వాడీ కార్యకర్తలు కుమారి, సుహాసిని, రాణి, షేక్ బీబీ, ఆశావర్కర్లు పాల్గొన్నారు. అలాగే, మండలంలోని కడపరాజుపల్లె గ్రామం అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన తల్లిపాల వారోత్సవాల్లో సూపర్‌వైజర్ అంజమ్మ మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు ముర్రుపాలు పట్టించడం ద్వారా వ్యాధి నిరోధకశక్తి పెంపొందుతుందని అన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు జడ్డా ప్రిస్కిల్లా, అనూషాబాయి, సునీత, లక్ష్మీకుమారి తదితరులు పాల్గొన్నారు.

**ముర్రుపాలతో అధిక ప్రయోజనాలు..** కంభం, ఆగస్టు 5: కంభం, అర్ధవీడు మండలాల్లో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. సోమవారం అర్ధవీడు మండలం పెద్దకందుకూరు అంగన్‌వాడీ సెంటర్‌లో జరిగిన తల్లిపాల వారోత్సవాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ, సర్పంచ్ రాజేశ్వరి, ఏఎన్ఎం రాజమ్మ, సరిత, తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా సూపర్‌వైజర్ రమణమ్మ మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టించడం వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. బాల సంజీవిని కిట్లను అందజేశారు.

కంభంలోని అంగన్‌వాడీ 8లో కూడా తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ చెంచులక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

**ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ**

త్రిపురాంతకం, ఆగస్టు 5: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా త్రిపురాంతకం సెక్టారులోని అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది తల్లిపాల వారోత్సవాల పోస్టర్‌ను ప్రదర్శించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీవో వరప్రసాద్ మాట్లాడుతూ తల్లిపాలలో వ్యాధి నిరోధకశక్తి ఎక్కువగా ఉంటుందని అన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ హైమావతి, కుమారి, సీహెచ్‌వో మోహన్, తదితరులు పాల్గొన్నారు.

**తల్లిపాలు అమృతంతో సమానం**

బేస్తవారపేట, ఆగస్టు 5: స్థానిక ఇస్లాంపేట అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. సీడీపీవో నాగమణి, సూపర్‌వైజర్ నీలోఫర్‌బేగం పాల్గొని ర్యాలీ నిర్వహించారు. తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని అన్నారు. కార్యక్రమంలో షంషాబీ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

**కల్తీ లేనివి తల్లిపాలు..**

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 5: ప్రపంచంలో కల్తీ లేనివి తల్లిపాలేనని సీడీపీవో సుశీల అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాలలో భాగంగా పట్టణంలోని 42, 43, 44 అంగన్‌వాడీ కేంద్రాలలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఏఎన్ఎం నాగమణి మాట్లాడుతూ పుట్టిన వెంటనే బిడ్డకు ముర్రుపాలు తాపించాలన్నారు. రెండేళ్ల వరకు తప్పనిసరిగా పిల్లలకు తల్లిపాలు పట్టించాలన్నారు. కార్యక్రమంలో కార్యకర్తలు వెంకటరత్నం, పద్మావతి, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసేందుకు కుయుక్తులు

**» టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎరిక్షన్‌బాబు**



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం, ఆగస్టు 5: ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసేందుకు కుయుక్తులు పన్నుతున్నారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎరిక్షన్‌బాబు ధ్వజమెత్తారు. సోమవారం స్థానిక గురుకుల బాలుర పాఠశాలను ఆయన పరిశీలించారు. పత్రికల్లో వచ్చిన కథనాలపై ఆరా తీశారు. ఈ రిపోర్టరే విద్యార్థులను హాస్టల్ వంట రూములో పనిచేయమని వీడియోలు తీశారని పేర్కొన్నారు. ఆదివారం కావడంతో స్వచ్ఛందంగా 9 వతరగతి విద్యార్థులు వంట మనుషులకు సహాయం చేసినట్లు తెలిపారు. వైసీపీ ఎమ్మెల్యే చంద్రశేఖర్ ప్రభుత్వంపై బురద జల్లేందుకు ఇటువంటి ప్రచారాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు.

విద్యార్థులతో ఎలాంటి పనులు చేయించవద్దని, మంచి విద్యను బోధించాలని ప్రిన్సిపాల్ సురేష్‌ను కోరారు. విద్యార్థులతో పనులు చేయిస్తే చర్యలు తప్పవని వార్డెన్ జిత్యానాయక్‌ను హెచ్చరించారు. వంట త్వరగా కావాలని తామే స్వచ్ఛందంగా సహాయం చేశామని 9వ తరగతి విద్యార్థులు పేర్కొన్నారు.

ఎర్రగొండపాలెం మండలం గుర్రపుసాల గ్రామంలో వైసీపీ కార్యకర్త ద్విచక్రవాహనం నుంచి పడి గాయపడ్డారని ఎరిక్షన్‌బాబు అన్నారు. అయితే, టీడీపీ కార్యకర్తలు దాడిచేశారని ఎమ్మెల్యే చంద్రశేఖర్ ప్రచారం చేశారని ఆయన పేర్కొన్నారు.

**వార్డెన్‌కు మెమో**

ఎర్రగొండపాలెం, ఆగస్టు 5: ఎర్రగొండపాలెం బాలుర గురుకుల పాఠశాలను ఐటీడీఏ పీవో రవీంద్రారెడ్డి సోమవారం తనిఖీ చేశారు. పాఠశాల హాస్టల్ గదుల్లో వంటలను పరిశీలించారు. విద్యార్థులతో వంటగదుల్లో ఎందుకు పని చేయించావని వార్డెన్ జిత్యానాయక్‌ను ప్రశ్నించారు. విద్యార్థులే వచ్చి పని చేశారని చెప్పడంతో అక్కడే మెమో ఇచ్చారు. విద్యార్థులు వంటగదుల్లో కన్పిస్తే చర్యలు తప్పవని వార్డెన్‌ను హెచ్చరించారు. ప్రిన్సిపాల్ సురేష్‌బాబు, వార్డెన్ జిత్యానాయక్ విధులు సక్రమంగా నిర్వహించాలని సూచనలు చేశారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకోవాలని పీవో కోరారు.

## రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి



తహసీల్దార్ కృష్ణారెడ్డిని అభినందిస్తున్న సిబ్బంది

పొదిలి, ఆగస్టు 5: పొదిలి నూతన తహసీల్దార్‌గా ఎంవీ కృష్ణారెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రెవెన్యూ కార్యాలయంలో సమస్యలపై ప్రత్యేక దృష్టిపెట్టి సమస్యలు సత్వరమే పరిష్కరించే విధంగా కృషి చేస్తానన్నారు. అనంతరం కార్యాలయ సిబ్బంది ఆయనను ఘనంగా సత్కరించారు.

## తహసీల్దార్‌గా శైలేంద్రకుమార్ బాధ్యతల స్వీకరణ



పెద్దారవీడు, ఆగస్టు 5: పెద్దారవీడు తహసీల్దార్‌గా పులి శైలేంద్రకుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. డిప్యూటీ తహసీల్దార్ రాజేష్, సిబ్బంది ఆంజనేయుడు, కాశయ్య, వీఆర్వోలు తహసీల్దార్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు.

## ప్రభుత్వ సేవలు సకాలంలో అందిస్తాం..



తహసీల్దార్ చిరంజీవిని అభినందిస్తున్న సిబ్బంది

మార్కాపురం రూరల్, ఆగస్టు 5: ప్రభుత్వ సేవలను ప్రజలకు అందించేందుకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తహసీల్దార్ కె.చిరంజీవి అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సేవలను సకాలంలో అందించేందుకు రెవెన్యూ శాఖ సిబ్బంది పనిచేస్తుందని తెలిపారు. ఈసందర్భంగా ఇన్‌చార్జ్ తహసీల్దార్ భాగ్యలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు, వీఆర్వోలు చలమారెడ్డి, గురవయ్య, సంజీవరెడ్డి, రమణారెడ్డి, గాలీబు, సర్వేయర్ సురేష్, తదితరులు సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

**కంభం తహసీల్దార్‌గా కిరణ్**

కంభం, ఆగస్టు 5: కంభం తహసీల్దార్‌గా టి.కిరణ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల సార్వత్రిక ఎన్నికల సందర్భంగా తహసీల్దార్లను బదిలీ చేసిన విషయం విదితమే. ఇక్కడ పనిచేస్తున్న రామయ్య తిరిగి తిరుపతి జిల్లాకు బదిలీ అయ్యారు. నెల్లూరు జిల్లా నుంచి బదిలీపై వచ్చిన కిరణ్ బాధ్యతలు స్వీకరించారు.

## భూసమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం



హరిబాబు

ఎర్రగొండపాలెం, ఆగస్టు 5: ఎర్రగొండపాలెం మండలంలో భూసమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తహసీల్దార్ ఎం.హరిబాబు అన్నారు. సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా కార్యాలయం సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రభుత్వ కార్యాలయాలకు చిత్రపటాలు అందజేత

గిద్దలూరు, ఆగస్టు 5: జనసేన పార్టీ ఆధ్వర్యంలో రాచర్ల మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు చిత్రపటాలు అందజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి చిత్రపటాలను రాచర్లలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి అధికారులకు అందజేశారు. రాష్ట్రాభివృద్ధి కోసం, నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషి చేస్తున్న వీరి చిత్రపటాలను కార్యాలయాలలో తగిలించాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో జనసేన ప్రతినిధులు నాయుడు, వెంకటేశ్వర్లు, వెంకటరావు, రామక్రిష్ణచారి, జనార్దన్, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## ఈపంట నమోదు చేయాలి

పెద్దదోర్నాల, ఆగస్టు 5: రైతులు సాగు చేసిన ప్రతిపైరును ఈపంట నమోదు చేయాలని మండల వ్యవసాయాధికారి డి.జవహర్‌లాల్ నాయక్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌వోలు, గ్రామ వ్యవసాయ సహాయకులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ సాలమ్మ మాట్లాడుతూ కౌలు రైతులకు పంట సాగు హక్కు పత్రాలు (సీసీఆర్‌సీ)త్వరితగతిన అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌వో ప్రియాంకదీప్తి, తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బేస్తవారపేట, ఆగస్టు 5: బేస్తవారపేట మండలంలోని అక్కపల్లె ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా సింగరపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని సింగరపల్లె, చెన్నుపల్లె, కోనపల్లె, హనుమాయపల్లె, బార్లకుంట గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ఎస్ఎస్ రావు తెలిపారు. మంగళవారం ఉదయం 9.30 నుంచి 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

## దోమల నివారణకు ఫాగింగ్

కంభం, ఆగస్టు 5: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా కంభం పంచాయతీలో సోమవారం సాయంత్రం ఫాగింగ్ చేశారు. శనివారం కంభంలో డెంగ్యూ వ్యాధితో అలంపల్లి భరద్వాజ్ (14) మృతిచెందిన విషయం విదితమే. దీంతో పంచాయతీ అధికారులు మురుగు కాలువలను శుభ్రం చేయించారు. బ్లీచింగ్ పౌడర్ చల్లి ఫాగింగ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో మస్తాన్‌వలి, ఈవోఆర్డీ విజయలక్ష్మి, కార్యదర్శి బ్రహ్మయ్య, సర్పంచ్ బోడయ్య, ఉపసర్పంచ్ కాశీంవలి తదితరులు పాల్గొన్నారు.

## సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి




మాట్లాడుతున్న అన్నా కృష్ణచైతన్య

పెద్దారవీడు, ఆగస్టు 5: మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులు అందిపుచ్చుకోవాలని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ అన్నా కృష్ణచైతన్య అన్నారు. స్థానిక కిట్స్ కళాశాలలో సోమవారం మొదటి సంవత్సరం విద్యార్థులకు ఓరియంటేషన్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కృష్ణచైతన్య మాట్లాడుతూ కళాశాలలో అత్యున్నతమైన సాంకేతికతో కూడిన విద్యను అందిస్తున్నట్టు చెప్పారు. విద్యార్థులలో సామాజిక విలువలను పెంపొందించడానికి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి, ఏవో బి.ప్రభాకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వక్ఫ్ చట్టాన్ని నిర్వీర్యం చేస్తే సహించం

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 5: వక్ఫ్ చట్టాన్ని నిర్వీర్యం చేస్తే సహించేది లేదని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకులు సయ్యద్ జావీద్ అన్వర్ సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. వక్ఫ్ చట్టాన్ని దాదాపు 40 మార్పులతో సవరించాలని, ఎన్డీఏ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మైనార్టీల హక్కులు కాలరాయడమేనన్నారు. వక్ఫ్ బోర్డు స్వయంప్రతిపత్తిని హరించేందుకు మోదీ కుట్ర చేస్తున్నారన్నారు. వక్ఫ్ బోర్డుల ఆస్తుల విషయంలో ఎన్డీఏ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వెనక్కి తీసుకోకపోతే రాబోయే రోజుల్లో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

## యథేచ్ఛగా క్యాట్ ఫిష్ అమ్మకాలు



చేపల మార్కెట్‌లో అమ్ముతున్న క్యాట్ ఫిష్

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 5: మార్కాపురం పట్టణంలోని చేపల మార్కెట్‌లో ప్రభుత్వం నిషేధించిన క్యాట్ ఫిష్‌లను యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. ఈ చేపను ఆరోగ్య రీత్యా ప్రభుత్వాలు నిషేధించాయి. ఈ చేపను తింటే అనేక రోగాలు వ్యాపిస్తాయని రుజువుకావటంతో వీటి పెంపకం, అమ్మకాలపై నిషేధం విధించారు. అయితే, కొంత మంది వీటిని దొంగచాటుగా పెంచుతూ చేపల మార్కెట్లలో విక్రయిస్తున్నారు. ఈ చేపలకు ఆహారంగా కోళ్ల ప్రేగులు, వ్యర్థాలు, వివిధ జంతువుల వ్యర్థాలు వేస్తారు. నీటిలో నుంచి బయటకు తీసిన కొన్ని గంటలసేపు కూడా ఈ చేప బతికే ఉంటుంది. ముక్కలుగా నరికినా ఈ చేప ముక్కలు ఎగిరెగిరి పడుతుంటాయి. ప్రజల ఆరోగ్యానికి హానికరమైన ఈ చేపల అమ్మకాలు జరగకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

## నకిలీ విత్తనాలను అరికట్టాలి

గిద్దలూరు టౌన్, ఆగస్టు 5: నకిలీ విత్తనాలు, పురుగు మందులను అరికట్టేందుకు ప్రత్యేక చొరవ చూపాలని సోమవారం బీజేపీ నాయకులు వ్యవసాయాధికారికి వినతిపత్రం అందజేశారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు భవనాశి వెంకటరామాంజనేయులు ఆధ్వర్యంలో జిల్లా కార్యవర్గసభ్యుడు ముప్పూరి శ్రీనివాసులు, పట్టణ ప్రధానకార్యదర్శి మునగనూరి రామకృష్ణ, పట్టణ ఉపాధ్యక్షుడు కొప్పరపు నాగేశ్వరరావు ఆమేరకు వ్యవసాయాధికారి విజయభాస్కర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. రైతులకు సబ్సిడీ విత్తనాలు అందించాలని విజ్ఞప్తి చేశారు.

## 800 లీటర్ల బెల్లంఊట ధ్వంసం



నాటుసారా బట్టీలపై దాడులు చేస్తున్న ఎస్ఈబీ అధికారులు

గిద్దలూరు టౌన్, ఆగస్టు 5: నాటుసారా తయారీ స్థావరంపై ఎస్ఈబీ అధికారులు దాడులు నిర్వహించారు. 800 లీటర్ల బెల్లంఊట ధ్వంసం చేశారు. పది లీటర్ల నాటుసారా, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఈబీ సీఐ కొండారెడ్డి ఆధ్వర్యంలో గిద్దలూరు మండలం ఓబులాపురంతాండా సమీపంలోని అటవీ ప్రాంతంలో నాటుసారా తయారీపై సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి దాడి చేశారు. అక్కడ నాటుసారా తయారీకి ఉపయోగించిన బెల్లంఊటను ధ్వంసం చేశారు. పది లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని అక్కడే ఉన్న ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నాటుసారా తయారు చేస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకోగా, మరో వ్యక్తి పరారైనట్లు సీఐ కొండారెడ్డి తెలిపారు.

## ముగ్గురు మోటార్ సైకిళ్ల దొంగల అరెస్టు



స్వాధీనం చేసుకున్న మోటార్ సైకిళ్ళతో పోలీసులు

గిద్దలూరు టౌన్, ఆగస్టు 5: మోటార్ సైకిల్ దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్దఉన్న ఆరు మోటార్ సైకిళ్ళను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం వారిని కోర్టులో హాజరుపరచగా న్యాయాధికారి రిమాండ్ విధించారు. పోలీసుల కథనం ప్రకారం.. గిద్దలూరు మండలం కొంగళవీడు ఎరుకల కాలనీకి చెందిన ఆవుల నవీన్‌కుమార్, ఆవుల రాజక్రిష్ణ, మోహన్‌నగర్‌కు చెందిన గొల్లపల్లి రంగప్రసాద్ గత కొంతకాలంగా గిద్దలూరు పట్టణంలో మోటార్ సైకిళ్ళ దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఆరు మోటార్ సైకిళ్ళను దొంగతనం చేయగా అర్బన్ సీఐ సోమయ్య ఆధ్వర్యంలో అదుపులోకి తీసుకుని విచారించారు. దొంగతనానికి పాల్పడినట్లు నిర్ధారించి, వారి నుంచి ఆరు మోటార్ సైకిళ్ళను స్వాధీనం చేసుకున్నారు.

దొంగతనానికి పాల్పడినవారిని సోమవారం కోర్టులో హాజరుపరచగా న్యాయాధికారి రిమాండ్ విధించారు. ఈ కేసును ఛేదించడంలో కీలకపాత్ర వహించిన ఏఎస్సై జిలా నిసాహెబ్, హెడ్‌కానిస్టేబుల్ శివారెడ్డి, కానిస్టేబుల్ నాయబ్‌రసూల్, అబ్దుల్‌వాహబ్, రామయ్య, మధుసూదన్‌రావులను అధికారులు అభినందించారు.

## ఐదుగురు జూదరుల అరెస్టు

గిద్దలూరు టౌన్, ఆగస్టు 5: పేకాట ఆడుతున్న ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సోమవారం గిద్దలూరు మండలం దొడ్డంపల్లి గ్రామంలో పేకాట ఆడుతున్నట్టు సమాచారం తెలుసుకున్న అర్బన్ సీఐ సోమయ్య పేకాట శిబిరంపై దాడిచేశారు. పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని రూ.5700 నగదు ను స్వాధీనం చేసుకున్నారు.

## దొంగతనం కేసులో ఇద్దరు అరెస్టు

పుల్లలచెరువు, ఆగస్టు 5: మండలంలోని మల్లాపాలెం పెద్దమ్మతల్లి దేవాలయంలో గత నెల 20న చోరీకి పాల్పడిన ఇద్దరు దొంగలను అరెస్టు చేసినట్టు ఎస్ఐ ఎండీ ఫిరోజ్ ఫాతిమా సోమవారం రాత్రి తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. మల్లాపాలెంలో ఉన్న పెద్దమ్మ తల్లి దేవాలయంలో హుండీని పగులగొట్టి అందులో ఉన్న నగదును అపహరించారు. ఈమేరకు గ్రామస్థుల ఫిర్యాదుచేశారు.

చోరీకి పాల్పడిన పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం దావుపల్లికి చెందిన కుడుముల వీరయ్య, కుడుముల అంకులును ఈనెల 4న మల్లా పాలెం వద్ద అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు ఆమె తెలిపారు. కోర్టు వారికి రిమాండ్ విధిం చినట్టు ఎస్ఐ తెలిపారు.

# అమృత పథకంపై కదలిక

**అన్ని ప్రాంతాలకూ నీటిని అందించలేకపోతున్న దర్శి ఎన్‌ఏపీ**

**ఏడాదిన్నర క్రితం రూ.121 కోట్లు మంజూరు చేసిన కేంద్రం**

**వైసీపీ ప్రభుత్వ హయాంలో పట్టించుకోని పాలకులు**

**తాజాగా నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి చొరవతో కార్యాచరణ**


దర్శి, ఆగస్టు 5 : దర్శి నగర పంచాయతీలోని ప్రజలకు రక్షిత మంచి నీరు అందించే బృహత్తరమైన అమృత పథకం అమలుకు శ్రీకారం చుట్టారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అమృత పథకానికి ఏడాదిన్నర క్రితం రూ.121 కోట్లు మంజూరైన విషయం తెలిసిందే. వైసీపీ పాలకుల నిర్లక్ష్యం వలన ఆ పథకం అడుగు ముందుకు పడలేదు. ఎన్నికల ముందు అప్పటి వైసీపీ పాలకులు హడావుడిగా శిలాఫలకం వేశారు. కానీ పనుల నిర్వహణ గురించి పట్టించుకోలేదు.

**పులిపాడు చెరువు నుంచి పథకం అమలు**

టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమృత పథకం నిర్మాణంపై అధికారులు దృష్టి సారించారు. పులిపాడు చెరువును మంచినీటి సమ్మర్ స్టోరేజీ ట్యాంకుగా అభివృద్ధి చేసి సాగర్ వాటర్ నింపుతారు. పైపులైన్లు ద్వారా దర్శి పట్టణంలోని ప్రజలకు తాగునీరు అందిస్తారు. అందులో భాగంగా పట్టణంలోని అన్నీ కుటుంబాలకు ఇంటింటికి కొళాయి ఏర్పాటు చేస్తారు.

**దర్శితోపాటు 120 గ్రామాల ప్రజలకు మేలు**

అమృత పథకం నిర్మాణం పూర్తయితే దర్శి ప్రాంతంలోని ప్రజలకు తాగునీటి సమస్య పూర్తిగా తొలగిపోనుంది. ఒక్క దర్శి పట్టణంలోనే సుమారు 14వేల కుటుంబాలు ఉన్నాయి. మొత్తం 88 వేల మంది జనాభా ఉన్నారు. ఇప్పటి వరకు దర్శి ఎన్‌ఏపీ రక్షిత మంచినీటి పథకం ద్వారా 120 గ్రామాలతో పాటు దర్శి పట్టణానికి మంచినీటి సరఫరా చేస్తున్నారు. ఎన్‌ఏపీ చెరువు పూడిపోవటంతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయింది. దీంతో అన్నీ గ్రామాలకు మంచినీరు సక్రమంగా అందించలేకపోతున్నారు. ఒక్కోసారి దర్శి పట్టణంలోని శివారు ప్రాంతాలకు కూడా తాగునీరు సక్రమంగా అందటం లేదు. అమృత పథకం నిర్మాణం పూర్తయితే నూతనంగా నిర్మించే చెరువు ద్వారా పట్టణ ప్రజలకు సమృద్ధిగా నీరు అందించే అవకాశం ఉంటుంది. దీంతో ఎన్‌ఏపీ స్కీం ద్వారా గ్రామీణ ప్రాంతాలకు కూడా సమృద్ధిగా మంచినీరు అందించే వీలు కలుగుతుంది. బహుళ ప్రయోజనాలు కలుగుతున్న అమృత పథకాన్ని వైసీపీ పాలకులు పక్కన పడేయటం పట్ల పట్టణ ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి ఆ పథకం అమలుపై ప్రత్యేక దృష్టి సారించారు. అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు చెప్పారు. దీంతో దర్శి పట్టణ ప్రజలకు తాగునీటి సమస్య పూర్తిగా తొలుగుతుంది.



దర్శి పట్టణం

## ప్రజలకు నీటి సమస్య తలెత్తకుండా చూడాలి

**ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి**

కనిగిరి, ఆగస్టు 5 : పట్టణంలోని ప్రజలకు నీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసిహారెడ్డి చెప్పారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం రాత్రి మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు, సచివాలయం సిబ్బందితో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలో చాలా చోట్ల నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నట్లు ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. అధికారులు, కౌన్సిలర్లు భవిష్యత్తు కార్యాచరణతో నీటి సమస్య పరిష్కారానికి ముందడుగు వేయాలని చెప్పారు. ప్రత్యేకంగా నీటి ఎద్దడి, భూగర్భ జలాలు అడుగంటిన ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో నీటిని సరఫరా చేయాలని సూచించారు. అదేవిధంగా శివారు కాలనీల్లో నివసించే పేద, గిరిజన వర్గాలకు నీటిని సక్రమంగా అందించాలన్నారు. నీటి సమస్య పరిష్కారంలో టీడీపీ నేతలు చొరవ వహించి అధికారులకు ప్రజలకు వారధిగా పనిచేయాలని చెప్పారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు, మున్సిపల్ చైర్మన్ గఫార్, కౌన్సిలర్లు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

## ప్రశాంతతకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు

**దర్శి సీఐ షేక్ షమీముల్లా**

ముండ్లమూరు, ఆగస్టు 5 : మండలంలోని శంకరాపురంలో గత నెలలో ఇరు వర్గాలు ఘర్షణ పడటంతో ఒక వర్గానికి చెందిన వారిపై పోలీసులు కేసు నమోదు చేయగా రిమాండ్‌కు వెళ్లి వచ్చారు. ఈ సందర్భంగా దర్శి సీఐ షేక్ షమీముల్లా, ముండ్లమూరు పోలీసు సిబ్బంది సోమవారం శంకరాపురం వెళ్లి ఇరు వర్గాలకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామంలో ప్రశాంతతకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆవేశాలకు లోనై గొడవల్లో తలదూర్చి జైలు పాలు కావద్దన్నారు. చదువుకున్న యువతీ యువకులు గొడవల్లో తలదూర్చి వారి జీవితాలను నాశనం చేసుకోవద్దని చెప్పారు. ఒకసారి కేసు నమోదైన తరువాత ప్రభుత్వ ఉద్యోగాలు సైతం కోల్పోతారన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ వీ నాగమల్లేశ్వరరావు, సిబ్బంది ఉన్నారు.

**మందుబాబులకు పోలీస్ కౌన్సెలింగ్**

మండలంలోని బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న మందుబాబులకు ఎస్‌ఐ వీ నాగమల్లేశ్వరరావు సోమవారం సాయంత్రం తనదైన శైలిలో కౌన్సెలింగ్ ఇచ్చారు. మద్యం తాగి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో పేకాట, కోడి పందాలు లాంటివి ప్రోత్సహించినా, ఆడినా చర్యలు తీవ్రంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది మహేష్, ప్రేమానిధి ఉన్నారు.



కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ షేక్ షమీముల్లా

## సౌభాగ్య కొత్త కందిపంట సాగుకు బాదాపురం ఎంపిక

**గుంటూరు లాంఫార్మ్ శాస్త్రవేత్త డాక్టర్ సాంబశివరావు**

దొనకొండ, ఆగస్టు 5 : ఎల్‌ఆర్‌జీ 133-33 సౌభాగ్య అనే కొత్త కంది పంట రకాన్ని సాగు చేసేందుకు మండలంలోని బాదాపురం గ్రామాన్ని ఎంపికైందని లాంఫార్మ్ శాస్త్రవేత్త డాక్టర్ సాంబశివరావు చెప్పారు. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో వ్యవసాయాధికారి లక్ష్మీనారాయణ అధ్యక్షతన కంది ప్రథమశ్రేణి ప్రదర్శన క్షేత్రం సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాదాపురం గ్రామంలో 20 మంది రైతులతో 20 ఎకరాల్లో ఎల్‌ఆర్‌జీ 133-33(సౌభాగ్య) అనే కొత్త కంది రకాన్ని సాగుచేస్తున్నట్లు తెలిపారు. ఈ రకం భారత పప్పుదినుసుల పరిశోధన కేంద్రం లక్నో వారిచే 2021 సంవత్సరంలో విడుదలైందని చెప్పారు. మొక్క కింద నుంచే కొమ్మలు వస్తాయని, పసుపుపచ్చ పూతతో ఎకరాకు, 7, 8 క్వింటాళ్ల దిగుబడి వస్తుందన్నారు. మంచి యాజమాన్య పద్ధతులు పాటిస్తే ఇంకా మంచి దిగుబడులు వచ్చేందుకు అవకాశం ఉందన్నారు. లాంఫార్మ్ శాస్త్రవేత్త డాక్టర్ రాజేష్‌చౌదరి మాట్లాడుతూ ఈ రకం వెర్రి తెగుళ్ళను కొంతమేరకు తట్టుకుంటుందని చెప్పారు. ఈ సందర్భంగా 20 మంది రైతులకు నాలుగు కేజీలు చొప్పున ఒక ఎకరాకు సరిపడా విత్తనాల ప్యాకెట్లు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దర్శి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ రమేష్, వ్యవసాయాధికారి లక్ష్మీనారాయణ, సహాయకులు రవితేజ, విన్నీబాబు పాల్గొన్నారు.



కంది విత్తనాల ప్యాకెట్లు అందిస్తున్న శాస్త్రవేత్తలు

## తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానం

తాళ్లూరు, ఆగస్టు 5 : తల్లిపాలు అమృతం లాంటివని దర్శి ఐసీడీఎస్ సీడీపీవో సీహెచ్ భారతి చెప్పారు. తాళ్లూరులోని ఐసీడీఎస్ కార్యాలయం వద్ద మండల స్థాయి తల్లి పాల వారోత్సవాల సభ సీడీపీవో భారతి అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ తల్లిపాలు స్వరోగఔషధంగా పని చేస్తుందన్నారు. బిడ్డకు జన్మనిచ్చిన గంటలోపు ముర్రుపాలు తాగించాలని చెప్పారు. పీహెచ్‌సీ వైద్యురాలు షేక్ ఖాదర్‌మస్తాన్‌బీ మాట్లాడుతూ బిడ్డకు పాలివ్వటం ద్వారా పాలిచ్చే తల్లి మూడు రకాల క్యాన్సర వ్యాధుల నుంచి కాపాడుతుందన్నారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ జ్యోతి, ఉపాధ్యాయురాలు దేవీప్రియ, మండలంలోని అన్నిగ్రామాల అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. ఆరోగ్యవంతంగా ఉన్న శిశువులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.



వెల్‌బేబీలకు బహుమతులుఅందజేస్తున్న వైద్యాధికారి మస్తాన్‌బీ

**ఐసీడీఎస్ అధికారుల పై ఎంపీపీ ఆగ్రహం**

తల్లిపాల వారోత్సవ కార్యక్రమాలకు మగవారికి ఆహ్వానం లేదంటూ ఐసీడీఎస్ అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వకుండా నిర్వహించారు. విషయం తెలుసుకున్న అధికారపార్టీ ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు ఐసీడీఎస్ అధికారుల తీరుపై ఆగ్రహంవ్యక్తం చేశారు. గతంలో తల్లిపాలవారోత్సవాల కార్యక్రమాలను ప్రజాప్రతినిధులను పిలిచి హుందాగా నిర్వహించేవారన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధుల్ని ఆహ్వానించాలని స్పష్టమైన ఆదేశాలున్నా తల్లిపాల గురించి వివరించేటప్పుడు మగవారు ఉండకూడదంటూ స్థానిక ఐసీడీఎస్ అధికారుల కొత్త నిర్వచనం చెబుతుండడంపై అసహనం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులుగా తాము తల్లులకు నాలుగు మంచి మాటలు చెప్పటం మీకు ఇష్టంలేదా అని ప్రశ్నించారు. దీంతో సూపర్‌వైజర్ మళ్లీ ఎలాంటి పొరపాటు లేకుండా చూసుకుంటామని ఎంపీపీకి సంజాయిషీ ఇచ్చారు.

**పామూరులో...**

పామూరు, ఆగస్టు 5 : పుట్టిన శిశువుకు తల్లి ముర్రుపాలు పట్టిస్తే అమృతంతో సమానమని కనిగిరి ఐసీడీఎస్ ప్రాజెక్టు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎంవీఎస్ పార్వతి చెప్పారు. మండలంలోని వగ్గంపల్లి మెయిన్ అంగన్‌వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా తల్లులు, బాలింతలు, గర్భిణులు, కిశోర బాలికలకు తల్లి పాల ప్రాముఖ్యతపై సోమవారం అవగాహన కార్యక్రమంతోపాటు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త మహాలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు దేవిశ్రీ, సువార్తమ్మ, నారాయణమ్మ, విజయలక్ష్మీ, ఆశా కార్యకర్త కేజీయా, ఎంఎల్‌హెచ్‌పీ మౌనిక పాల్గొన్నారు.

## ఉపాధి పెండింగ్ బిల్లులు చెల్లించాలి



పామూరు, ఆగస్టు 5 : ఉపాధి హామీ పథకం కింద పనిచేసిన కూలీలకు సక్రమంగా నగదు పడటం లేదంటూ తూర్పువీధికి చెందిన పలువురు కూలీలు స్థానిక ఉపాధి హామీ కార్యాలయం వద్ద సోమవారం నిరసన తెలిపారు. తాము గతంతో చేసిన 14 వారాలకు సంబంధించిన బిల్లులు చెల్లించలేదని, నెల రోజుల నుంచి పనులు చూపించడంలేదని చెప్పారు. ఈ విసయంపై ఏపీవో మాల్యాద్రిని వివరణ కోరగా ఈ ఏడాది మే 22 నుంచి ఉపాది బిల్లుల పేమెంట్లు పడటం లేదన్నారు. బిల్లులు మంజూరు కాగానే వారి బ్యాంక్ అకౌంట్‌కే జమ అవుతాయనిచెప్పారు. నిరసన కార్యక్రమంలో పిక్కిలి మాలకొండయ్య, గడ్డి నాగమ్మ, ఐతమ్మ, కనకమ్మ, వి లక్ష్మీ, జి కుమారి, శీలమ్మ, వెంగమ్మ పాల్గొన్నారు.

ఉపాధి కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న కూలీలు

### ప్రభుత్వ బోరు ప్రైవేటు వ్యక్తుల చేతిలోకి..



బీసీకాలనీలో ప్రభుత్వ బోరుకు బిగించిన మోటార్

పీసీపల్లి, ఆగస్టు 5 : గ్రామ ప్రజలందరికీ తాగునీరు అందించేందుకు ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేసిన బోరును ఒకవ్యక్తి సొంతంగా వాడుకుంటున్నారు. దీంతో గ్రామంలోని మిగిలినవారికి తాగునీరు ఇక్కట్లు తలెత్తాయి. వివరాల్లోకి వెళితే.. మండలంలోని కమ్మవారిపల్లి బీసీ కాలనీలో ప్రభుత్వం బోరును ఏర్పాటు చేశారు. ప్రభుత్వ నిధులతో చేతిపంపును కూడా బిగించారు. అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఇటీవల చేతిపంపును తీసివేసి మోటార్‌ను బిగించి తన ఇంటి అవసరాలకు వాడుకుంటున్నాడు. గ్రామం మొత్తానికి నీరు అందించాల్సిన బోరును ఒక్కరే వాడుకుంటుండటంతో గ్రామస్థులు నీరు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని పలుమార్లు పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని గ్రామానికి చెందిన దేవళ్ల బ్రహ్మయ్య ఆరోపిస్తున్నారు.

### దర్శి తహసీల్దార్‌గా శ్రావణ్‌కుమార్ బాధ్యతల స్వీకరణ



తహసీల్దార్ శ్రావణ్‌కుమార్‌ను అభినందిస్తున్న అధికారులు, నాయకులు

దర్శి, ఆగస్టు 5 : దర్శి నూతన తహసీల్దార్‌గా ఎం శ్రావణ్‌కుమార్ సోమవారం సాయంత్రం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ ఏవీ రవిశంకర్ ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ దేవప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ నరసింహారావు, వీఆర్వోలు, సిబ్బంది ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. అధికారులు, నాయకులు ఆయన్ను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు అధికారులు, సిబ్బంది సహకారంతో శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు.

### తాళ్లూరు తహసీల్దార్‌గా శింగారావు



బొకే ఇచ్చి అభినందనలు తెలుపుతున్న సిబ్బంది

తాళ్లూరు, ఆగస్టు 5 : తాళ్లూరు తహసీల్దార్‌గా పి.శింగారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కార్యాలయసిబ్బంది, వీఆర్‌వోలు, విలేజ్ సర్వేయర్‌లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజలకు, రైతుల సమస్యల పరిష్కారానికి వేగవంతమైన చర్యలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ సంబంధ సమస్యల పరిష్కారంలో జిల్లాలోనే మొదటి 5 స్థానాల్లో మండలం ఉండేలా సిబ్బంది పనితీరును మెరుగు పరుచుకోవాలని చెప్పారు. సమావేశంలో సీనియర్ అసిస్టెంట్ పీఎస్‌ఆర్ మూర్తి, మండల సర్వేయర్ బాబూరావు, వీఆర్‌వోలు, తదితరులు ఉన్నారు. అనంతరం బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ శింగారావును పలువురు అభినందించారు.

### ముండ్లమూరు తహసీల్దార్‌గా లక్ష్మీనారాయణ



తహసీల్దార్ లక్ష్మీనారాయణను అభినందిస్తున్న వీఆర్‌వోలు, సర్వేయర్లు

ముండ్లమూరు, ఆగస్టు 5 : ముండ్లమూరు మండల నూతన తహసీల్దార్‌గా ఎల్ లక్ష్మీనారాయణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల బదిలీల్లో భాగంగా పల్నాడు జిల్లా నకరికల్లు మండల తహసీల్దార్‌గా పనిచేస్తూ తిరిగి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రిపోర్టు చేశారు. నాలుగు రోజుల క్రితం జరిగిన బదిలీల్లో ముండ్లమూరు తహసీల్దార్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో భూ సమస్యలు పరిష్కరించటంతో పాటు పెండింగ్ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌ను డిప్యూటీ తహసీల్దార్ పుల్లారెడ్డి, సీనియర్ అసిస్టెంట్ శేషగిరిరావు, మండల వీఆర్‌వోల సంఘం అధ్యక్షుడు కావూరి దయానందం, వీఆర్‌వోలు, సర్వేయర్లు, మండల టీడీపీ అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, మాజీ అధ్యక్షుడు సోమేపల్లి శ్రీనివాసరావు, మాజీ జెడ్పీటీసీ వరగాని పౌలు, మాజీ సర్పంచ్‌లు మేదరమెట్ల వెంకటరావు, నిడమానూరి శ్రీనివాసరావు, బద్రి గోపాలరెడ్డి, కాటూరి ఏడుకొండలు, కట్టా చిన వెంకం బొట్లు అభినందించారు.

### దొనకొండ తహసీల్దార్‌గా రమాదేవి



తహసీల్దార్‌ను అభినందిస్తున్న టీడీపీ నేతలు

దొనకొండ, ఆగస్టు 5 : దొనకొండ మండల తహసీల్దార్‌గా రమాదేవి సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మండల టీడీపీ అధ్యక్షుడు నాగులపాటి శివ కోటేశ్వరరావు, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు మోడి వెంకటేశ్వర్లు, నాయకులు శృంగారపు నాగసుబ్బారెడ్డి, యరగొర్ల బసవయ్య, కొమ్మతోటి సుబ్బారావు, మన్నెం గాలెయ్య, దుగ్గెంపూడి చెంచయ్య, తోటా వెంకటేశ్వర్లు, విప్పర్ల లక్ష్మీరావు, పెమ్మసాని లక్ష్మీనారాయణ ఆమెకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ఎటువంటి సమస్య ఉన్నా ప్రజలు నేరుగా వచ్చి అర్జీ అందిస్తే విచారించి పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు.

### కేరళ వరద బాధితులకు విరాళాలు వసూలు




విరాళాలు వసూలు చేస్తున్న సీపీఎం నాయకులు

ముండ్లమూరు, ఆగస్టు 5 : ఇటీవల కేరళ రాష్ట్రంలోని వరదల్లో చిక్కుకొని ప్రాణ, ఆస్తినష్టం సంభవించిన నేపథ్యంలో వారి కుటుంబాలను ఆదుకొనేందుకు మండల సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం విరాళాల సేకరణ చేపట్టారు. మొత్తం రూ.12వేలు వసూలు చేశారు. అందులో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ సిబ్బంది రూ. 4300 అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు వెల్లంపల్లి ఆంజనేయులు, పంటా ఏడుకొండలు, యర్రయ్య, గంగినేని సత్యం, మీరావలి పాల్గొన్నారు.

### బధిర విద్యార్థులకు ఫిజియోథెరపీ అవసరం

**ఎంఈవో నారాయణరెడ్డి**

కనిగిరి, ఆగస్టు 5 : బధిర విద్యార్థులకు తప్పనిసరిగా ప్రతిరోజూ ఫిజియోథెరపీ చేయించాలని ఎంఈవో యూవీ నారాయణరెడ్డి చెప్పారు. స్థానిక ఎమ్మార్సీ భవనంలోని బధిరుల పాఠశాలలోని విద్యార్థులకు చేస్తున్న ఫిజియోథెరపీ విధానాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిత కేంద్రంలో బధిర విద్యార్థులకు విద్యతోపాటు ఫిజియోథెరపీ చేయిస్తున్నట్లు చెప్పారు. అదేవిధంగా మానసిక దివ్యాంగులను గుర్తించి వారిని పాఠశాలలో చేర్పించి విద్యార్థుల సంఖ్యను పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం హాజరు రిజిస్టరు, రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఐఆర్‌పీలు గోపాలకృష్ణ, సైమన్, ఫిజియోథెరపిస్ట్ జీ పుల్లయ్య పాల్గొన్నారు.



ఫిజియోథెరపీ చేస్తున్న వైద్యులు

### యోగాలో పీసీపల్లి విద్యార్థుల ప్రతిభ

పీసీపల్లి, ఆగస్టు 5 : యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఒంగోలులో నిర్వహించిన జిల్లా స్థాయి యోగా పోటీలలో పీసీపల్లి విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పెదవరిమడుగు పాఠశాలకు చెందిన జి.బద్రీనాథ్ 8-10బాలుర విభాగంలో రెండో స్థానం, నిహాల్ మూడో స్థానంలో నిలిచారు. అండర్-10, -12 బాలికల విభాగాల్లో యషశ్విని మూడోస్థానం, అండర్-8,-10 బాలికల విభాగాల్లో వడ్డెంపూడి హర్షిణి ప్రథమ స్థానంలో నిలిచారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన వరుణ్, సాయిసంజయ్‌లు అండర్-14, 16 విభాగాల్లో ప్రథమస్థానంలో నిలిచారు. అలాగే ఏడుకొండలు అండర్-10,-12 విభాగంతో తృతీయస్థానంలో నిలిచారు. విజేతలను ఎంఈవోలు ఎర్.శ్రీనివాసులు, సంజీవిలతో పాటు యోగా గురువు రమణయ్య, ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు అభినందించారు.




యోగాసనం వేస్తున్న బాలుడు



కలెక్టర్ల సదస్సుకు హాజరైన ఉమ్మడి గుంటూరు జిల్లా కలెక్టర్లు వెంకటమురళీ, అరుణ్‌బాబు, నాగలక్ష్మి

# ప్రణాళికతో లక్ష్యాలు సాధించండి

- కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు

గుంటూరు, బాపట్ల, నరసరావుపేట ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ప్రతీ కలెక్టర్ ఒక విజన్ 2047ని తయారు చేసుకోవాలని సీఎం చంద్రబాబు సూచించారు. అలాగే ప్రతీ 100 రోజులకు ఒక కార్యచరణ ప్రణాళిక రూపొందించుకొని ఆ దిశగా లక్ష్యాలను సాధించాలన్నారు. ప్రైవేటు ప్రభుత్వ భాగస్వామ్యానికి హద్దు లేదన్నారు. ఏ విషయంలోనైనా ఈ విధానాన్ని అమలు చేయవచ్చని సూచించారు. కొత్త ఆలోచనలు చేసి పీపీపీ విధానాన్ని అమలు చేయాలన్నారు. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు జరిగిన కలెక్టర్ల సదస్సులో ఉమ్మడి జిల్లాలకు సంబంధించిన కొన్ని అంశాలపై సీఎం, వివిధ శాఖల ఉన్నతాధికారులు పలు సూచనలు చేశారు.

వెనకబడిన వర్గాలకు ఇళ్ల నిర్మాణం అనేది నిరంతర ప్రక్రియ. దీనిని కొనసాగించాలి. అలానే అర్హత ఉండి ఇంకా ఎవరైనా మిగిలిపోయి వుంటే వారిని కేంద్రం అమలు చేయబోతోన్న కొత్త పథకం కింద అర్హులుగా చేయాలని గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మికి సూచించారు. ఇళ్ల నిర్మాణానికి గ్రీన్‌ఛానెల్ ఏర్పాటు చేసుకొని అందుకు అవసరమైన ఇసుక, ఇనుము తదితర సామాగ్రి అంతా ప్రాధాన్యత క్రమంలో సరఫరా చేయాలన్నారు. ప్రధానంగా రాబోయే 11 నెలలు ఇళ్ల నిర్మాణంపై దృష్టి పెట్టాలన్నారు. గుంటూరు జిల్లాకు పీఎంఏవై అర్బన్, గ్రామీణ్ కింద 1,00,540 ఇళ్లు మంజూరైతే గత ఐదేళ్లలో కేవలం 23,176 మాత్రమే పూర్తి చేశారు. అసలు నిర్మాణమే ప్రారంభం కాని ఇళ్లు 36,404 ఉన్నాయి. పురోగతిలో మరో 40,958 ఉన్నాయి. గ్రౌండింగ్, స్టేజ్ కన్వర్షన్‌లో గుంటూరు జిల్లా బాగా వెనకబడి వుందన్నారు. అలానే మౌలిక సదుపాయాల కల్పనలోనూ వెనకంజలో ఉందని చెప్పారు. ఎవరైతే అనర్హులు, లబ్ధిదారుల జాబితాలో ఉన్నారో వారందరిని తీసేయాలన్నారు. ఇళ్ల నిర్మాణానికి ముందుకు రాని వారిని పిలిచి మాట్లాడి ఒకవేళ ఇల్లు కట్టుకోకపోతే భవిష్యత్తులో ఆ అవకాశాన్ని కోల్పోతారని చెప్పాలన్నారు. కేంద్ర ప్రభుత్వం త్వరలో కొత్త స్కీమ్ తీసుకు రాబోతోన్నదని, దీనికి రూ.4.30 లక్షలు యూనిట్ ధరగా నిర్ణయించారన్నారు. అర్బన్‌లో రెండు సెంట్లు, రూరల్‌లో మూడు సెంట్లు ఇస్తామన్నారు. ఇప్పటి నుంచి వచ్చే దరఖాస్తులకు ఆ స్కీమ్ ద్వారానే లబ్ధి చేకూరుస్తామన్నారు.

కేంద్ర ప్రభుత్వ స్వదేశీ దర్శన్‌లో ఉప కార్యక్రమమైన ఛాలెంజ్ బేస్డ్ డెస్టిని డెవలప్‌మెంట్(సీబీడీడీ) కింద నాగార్జునసాగర్‌లో పర్యాటక ప్రదేశాల అభివృద్ధికి రూ. 25 కోట్లు మంజూరయ్యాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతీ జిల్లాలో ఒక ఆర్‌టీజీఎస్ సెంటర్‌ని 60 రోజుల వ్యవధిలో ఏర్పాటు చేయాలన్నారు. పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టమ్‌కు ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయని, దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గుంటూరు-బాపట్ల 42 కిలో మీటర్లు, మంగళగిరి - తెనాలి - నారాకోడూరు 40 కిలో మీటర్ల రహదారులను పీపీపీ విధానంలో అభివృద్ధి చే సేందుకు ప్రతిపాదించామన్నారు. గుంటూరు కార్పొరేషన్ పరిధిలో ఉన్న 50 ఎకరాల ఖాళీ స్థలాన్ని పీపీపీ విధా నంలో ఎమ్యూజ్‌మెంట్ పార్కు వంటి వాటికి ఇవ్వాలని ఆదేశించారు. సమావేశం ముగింపులో కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్‌తో సీఎం సమావేశం నిర్వహించారు. సంపద సృష్టి జరగాలంటే తొలుత శాంతి భద్రతలు ముఖ్యమని సీఎం స్పష్టం చేశారు. ఈ విషయంలో కలెక్టర్, ఎస్పీలు సమన్వయంగా ముందుకుపోవాలి. నేను స్వతంత్రం అన్న ఆలోచన ఇద్దరిలోనూ కలగరాదని స్పష్టం చేశారు. బహిరంగ ప్రదేశాల్లో సీసీ టీవీలు అమర్చాలి. అలానే ప్రైవేటు ప్రదేశాల్లో వాటి యజమానులతో సీసీ టీవీలు ఏర్పాటు చేయించి వాటిని ప్రభుత్వ సిస్టమ్‌తో అనుసంధానం చేయాలని సూచించారు. గంజాయిని పూర్తిగా అదుపు చేయాల్సి ఉన్నది. ఇళ్లల్లోనూ వాటిని పెంచుతున్నారు. డ్రోన్ కెమెరాలను ఉపయోగించి వాటిని పసిగట్టి ముందు ఉత్పత్తిని నియంత్రిస్తే ఆటోమేటిక్‌గా వాడకం అదుపులోకి వస్తుందన్నారు. సోషల్ మీడియాలో జరుగుతోన్న ఫేక్ ప్రచారాలను అరికట్టాల్సి ఉందన్నారు. ఇందుకోసం ప్రతి జిల్లాకు ఒక ఐటీ నిపుణుడిని పంపిస్తామన్నారు.


**అసైన్డ్ భూముల అన్యాక్రాంతంపై కూడా...**

జిల్లాలో పెద్ద సంఖ్యలో అసైన్డ్ భూములు ఉండడంతో గడచిన ఐదేళ్లలో వాటి విషయంలో జరిగిన అవకతవకలపై సీఎంతో సమావేశంలో చర్చకు రాగా వాటన్నింటిపై పూర్తి వివరాలతో అధికారులు సిద్ధంగా ఉండాలని సూచించినట్లు తెలిసింది. భూముల విషయంలో అక్రమాలకు పాల్పడిన వారెవరు ఎంత వారైనా చట్టపరంగా వారిపై చర్యలు తీసుకోవడానికి వెనకాడవద్దని సీఎం చంద్రబాబు ఆదేశించినట్లు సమాచారం.

**ఫేక్ ప్రచారంపై చర్చ**

ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేయడానికి కొంతమంది దుష్ప్రచారం చేస్తున్నారని దానికి ఉదాహరణగా తాజాగా బాపట్ల జిల్లా భట్టిప్రోలులో జరిగిన ఉదంతాన్ని సీఎం చంద్రబాబు నాయుడు ప్రస్తావించినట్లు సమాచారం. భట్టిప్రోలు ఘటనలో టీడీపీ కార్యకర్త ఒకరు ఎస్ఐ చొక్కా పట్టుకున్నట్లు జరిగిన ఫేక్ ప్రచారం చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. దీనిపై మరుసటి రోజే ఆ తప్పుడు ప్రచారాన్ని ఖండిస్తూ రేపల్లె డీఎస్పీ మీడియా సమావేశం ఏర్పాటు చేసిన విషయాన్ని కలెక్టర్ వెంకట మురళి, ఎస్పీ తుషార్ డూడీ సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. సరైన ఆధారాల్లే కుండా తప్పుడు ప్రచారం చేస్తే కఠిన చర్యలు తప్పవనే సంకేతాన్ని ఇచ్చినట్లు జిల్లా అధి కారులు సీఎంకి వివరించినట్లు తెలుస్తోంది. బాపట్ల, రేపల్లెలో తాగునీటి సమస్యలను నివా రించడంతో పాటు బాపట్లలోని మెడికల్ కళాశాల నిర్మాణం ప్రస్తుత పరిస్థితి, నిధుల లభ్యత పెండింగ్ తదితర అంశాలు కలెక్టర్ల సమావేశంలో చర్చకు వచ్చినట్లు తెలిసింది

# ఇన్‌చార్జిల పాలనలో.. ఆర్టీసీ



- బాపట్ల ఇన్‌ఛార్జ్ డీపీటీవోగా గుంటూరు డీపీటీవో రవికాంత్
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో నాలుగు డిపోల్లోనూ ఇదే పరిస్థితి...
- ప్రభుత్వ పెద్దలు దృష్టిసారించాలంటోన్న ఉద్యోగ సంఘాలు

గుంటూరు, ఆగస్టు 5: ఆర్టీసీ ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఇన్‌చార్జ్‌ల పాలనలో నడుస్తోంది. కొన్ని రోజులుగా నాలుగు డిపోలకు వేరొక డిపోల డిఎమ్‌లే ఇన్‌చార్జ్‌లుగా వ్యవహరిస్తున్నారు. తద్వారా పాలన కుంటుపడటంతో పాటు అధికారులు రాకపోకలతోనే సరిపోతుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అసలే నష్టాలతో కొట్టుమిట్టాడుతోన్న ఆర్టీసీ, ఇన్‌చార్జ్‌ల పాలనతో మరింత దిగజారే పరిస్థితి నెలకొందని ఆర్టీసీ ఉద్యోగ సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం విభజిత గుంటూరు జిల్లా ప్రజా రవాణాధికారి (డీపీటీవో)గా వ్యవహరిస్తున్న ఎమ్ రవికాంత్ బాపట్ల జిల్లాకు ఇన్‌చార్జ్ డీపీటీవోగా వ్యవహరిస్తున్నారు. ఆర్టీసీ బాపట్ల జిల్లా పరిధిలో బాపట్లతో పాటు చీరాల, పర్చూరు, అద్దంకి డిపోలున్నాయి. గుంటూరు నుంచి బాపట్ల రాకపోకలు సాగించటంతో పాటు సమీక్షా సమావేశాలు నిర్వహించటం కూడా ఆయనకు తలకు మించిన భారంగా మారుతోంది. మరో వైపు గుంటూరు ఎన్‌టీఆర్ బస్టాండ్ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్(ఏటీఎమ్)గా వ్యవహ రిస్తున్న కె సత్యనారాయణను మంగళగిరి డిపో ఇన్‌చార్జ్‌గా నియమించారు. ఏటీఎమ్ మంగళగిరి డిపో ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరిస్తుం డటంతో బస్టాండ్‌లో పర్యవేక్షణ లేకపోవటంతో కొందరు సిబ్బంది ఆడిందే ఆట పాడిందే పాటగా మారుతోంది. జిల్లా కేంద్రం గుంటూరు బస్టాండ్‌లో ఏటీఎమ్ పోస్టు ఎంతో కీలకమైనది. బస్సుల పర్యవేక్షణతో పాటు వాణిజ్య సంబంధమైన పర్యవేక్షణ, ఫిర్యాదుల స్వీకరణ, సమస్యల పరిష్కారంలో కీలకంగా వ్యవహరించాల్సి ఉంటుంది. ఆయన ఇన్‌ఛార్జ్‌గా అక్కడే ఎక్కువ సమయం కేటాయించటంతో పాటు ఇక్కడ సిబ్బందిపై పర్యవేక్షణ లేకపోవటంతో వారు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక తెనాలి డిపో మేనేజర్ ఏ రాజశేఖరనాయక్ రేపల్లె డిపో ఇన్‌చార్జ్ డీఎమ్‌గా వ్యవహరిస్తున్నారు. పొన్నూరు డిపో మేనేజర్ అజితకుమారి బాపట్ల డిపోకు ఇన్‌చార్జ్ డీఎమ్‌గా పనిచేస్తున్నారు. సత్తెనపల్లి డిపో మేనేజర్ జీవీఎస్ కుమార్ పిడుగురాళ్ళ డిపో ఇన్‌చార్జ్ మేనేజర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ విధంగా ఇన్‌ఛార్జ్ మేనేజర్లతో డిపోలలో పాలన కూడా కుంటు పడుతుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. డిపోలలో నిత్యం సిబ్బంది విధులతో పాటు పాలనా వ్యవహారాలు, రోజువారీ గ్రీవెన్స్ కూడా ఇబ్బందులు పడుతున్నట్లు ఆ శాఖ ఉద్యోగుల నుంచే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఆయా డిపోలలో మేనేజర్లు పదవీ విరమణ చేయటంతో ఖాళీ అయిన పోస్టుల్లో కొన్ని రోజులుగా ఇన్‌చార్జ్‌లతోనే నెట్టుకొస్తుండటం ఆర్టీసీలో చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం డీజీపీగా ఉన్న ద్వారకా తిరుమలరావు ఆర్టీసీ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. ఇలా ఆర్టీసీ ఇన్‌చార్జ్‌ల పాలనతో మరింత కుంటు పడుతుందని ఆర్టీసీ ఉద్యోగ సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. త్వరలో ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి హామీ నెరవేరాలంటే ఇన్‌చార్జ్‌ల పాలన లేకుండా పూర్తిస్థాయిలో అధికారులను నియమించాలన్న డిమాండ్ సర్వత్రా వ్యక్తమవుతోంది.





నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

# తెరుచుకున్న సాగర్ గేట్లు

- 16 గేట్ల ద్వారా దిగువకు నీటి విడుదల
- సాగర్‌కు కొనసాగుతున్న వరద ఉధృతి
- ఇన్‌ఫ్లో 3,23,331.. ఔట్‌ఫ్లో 1,63,220 క్యూసెక్కులు
- డ్యాం వద్ద పర్యాటకుల సందడి

నరసరావుపేట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : నాగార్జున సాగర్ నిండు కుండలా ఉంది. జలాశయానికి వరద ఉధృతి కొనసాగుతోంది. డ్యాంలో నీటి మట్టం పూర్తిస్థాయికి చేరడంతో 16 గేట్లు ఎత్తి దిగువకు 1.63 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తెలంగాణ కలెక్టర్ నారాయణ రెడ్డి, జలవనరుల శాఖ సీఈ నాగేశ్వరరావు గేట్లను ఎత్తి నీటిని విడుదల చేశారు. సోమవారం ఉదయం 10 గంటలకు జలాశయం రెండు గేట్లు ఎత్తి నీటిని విడుదల చేశారు. సాయంత్రానికి మొత్తం 16 గేట్లను ఐదు అడుగుల మేర ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. రాత్రి 7 గంటలకు 3,23,610 క్యూసెక్కుల వరద నీరు చేరింది. జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు కాగా 584.20 అడుగులకు నీటి మట్టం చేరింది. డ్యాం పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312.05 టీఎంసీలకు గాను 295.12 టీఎంసీలకు నీటి నిల్వ చేరింది. సాగర్ నుంచి క్రస్ట్ గేట్ల ద్వారా 1,63,332 క్యూసెక్కులు విద్యుత్ ఉత్పత్తి ద్వారా 40,516 క్యూసెక్కులు మొత్తం 2,03,848 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. భారీగా నీటిని విడుదల చేయడంతో జలాశయం దిగువ ప్రాంత వాసులను అప్రమత్తం చేశారు. నదీ తీరం వైపు వెళ్లకుండా పోలీసు, రెవెన్యూ శాఖలు చర్యలు తీసుకున్నాయి. సాగర్ నుంచి నీటి విడుదల మంగళవారానికి మరింత పెరుగుతుందని అధికారులు తెలిపారు.



స్విచ్ఛాన్ చేసి క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదలను ప్రారంభిస్తున్న సీఈ నాగేశ్వరరావు

**పులిచింతలకు కృష్ణమ్మ పరవళ్లు**

కెఎల్‌రావు పులిచింతల ప్రాజెక్టుకు కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. సాగర్ నుంచి విడుదల చేస్తున్న వరద పులిచింతలకు చేరుతోంది. మంగళవారం కల్లా పులిచింతలకు 2.03 లక్షల క్యూసెక్కుల వరద చేరనుంది. ఇక్కడ నుంచి విజయవాడ ప్రకాశం బ్యారేజ్‌కు 26,083 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. పులిచింతల పూర్తిస్థాయి నీటి మట్టం 175 అడుగులు కాగా 130.15 అడుగులకు నీటి మట్టం చేరింది. పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 45.77 టీఎంసీలకు గాను 6.68 టీఎంసీల నీటి నిల్వ ఉంది. రెండు రోజుల్లో పులిచింతల ప్రాజెక్టు కూడా నిండుతుందని జలవనరుల శాఖ అధికారులు తెలిపారు.



# నేతన్న కోసం.. చంద్రన్న

- రేపే చీరాలకు చంద్రబాబు రాక
- చేనేత దినోత్సవ కార్యక్రమానికి హాజరు

చీరాల, ఆగస్టు 5 : జాతీయ చేనేత దినోత్సవంలో పాల్గొనేందుకు సీఎం చంద్రబాబు రేపు చీరాల వస్తున్నారు. దీనికి కావలసిన ఏర్పాట్లను అధికారులు పూర్తి చేస్తున్నారు. ఐదు సంవత్సరాల వైసీపీ ప్రభుత్వం చేనేతను పట్టించుకోక పోవడంతో నిర్వీర్యం అయింది. సీఎం రాకతో అయిన తమ దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం దొరుకుతుందనే ఆశాభావాన్ని నేతన్నలు వ్యక్తపరుస్తున్నారు.

వేటపాలెం మండలం నాయినిపల్లి వద్ద 2005లో టెక్స్‌టైల్ పార్కు కోసం సుమారు 50 ఎకరాలు స్థలం కేటాయించారు. అప్పటి మంత్రి కొణిజేటి రోశయ్య శంకుస్థాపన చేశారు. అయితే టెక్స్‌టైల్ పార్కు కన్నా చేనేత పార్కు అయితేనే ఉపయోగమని పలువురు చేనేత రంగ ప్రతినిధులు తెలిపిన అభ్యంతరాలతో దాన్ని 2008లో చేనేత పార్కుగా మార్చారు. ఇదిలా ఉంటే కేటాయించిన స్థలంలో సుమారు 23 ఎకరాల స్థలం ఇతర అవసరాలకు కేటాయించారు. ప్రస్తుతం 26.81 ఎకరాలు స్థలం ఉంది. అందులో చేనేత పార్కు కోసం రూ.9 కోట్లు అంచనా వ్యయంతో కేంద్ర ప్రభుత్వానికి ఎంఎస్ఎంఇ( మైక్రో, స్మాల్, మీడియం, ఎంటర్‌ప్రైజెస్)కింద డీపీఆర్(డీటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు)ను స్థానిక హాండ్లూమ్ ఏడీ కార్యాలయం నుంచి పంపారు. ప్రస్తుతం అది ఆమోదం పొందాల్సి ఉంది. దీంతో పాటు కోర్టు వివాదం కూడా కొంత ఉంది. అది కూడా పూర్తి పరిష్కారం కావాల్సిన అవసరం ఉంది. తొలివిడతగా మంజూరు చేసిన నిధులను అప్పటి ఏడీ సత్యన్నారాయణరాజు దుర్వినియోగం చేశాడు. విచారణ కొనసాగుతోంది. రికవరీ జరగలేదు.

**కాగితాలకు పరిమితమైన క్లస్టర్లు**

నేతన్నల అభ్యున్నతికి, వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించేందుకు నిర్మించిన క్లస్టర్ల ప్రయోజనం కాగితాలకే పరిమితం అయ్యింది. నియోజకవర్గ పరిధిలో గతంలో నిర్మించిన మెగా క్లస్టర్ నేడు నిరుపయోగంగా ఉంది. ఆ తరువాత ఇంటిగ్రేటెడ్ క్లస్టర్లు పేరుతో నిర్మించిన క్లస్టర్లు లక్ష్యానికి దూరంగానే ఉన్నాయి.

**11 రకాల రిజర్వేషన్ అమలు శూన్యం**

నేతన్నలు మాత్రమే తయారు చేయాలని 11 రకాల చేనేత ఉత్పత్తులకు ప్రత్యేక చట్టం ఉంది. అయితే అది అమలు కావటం లేదు. పవర్‌లూమ్ వస్త్రాలు చేనేత వస్త్రాలుగా చెలామణి అవుతున్నాయి. వారిని అరికట్టాల్సిన విజిలెన్స్ అధికారులు కన్నులకు కనిపించరు.

**సహకార సంఘాల్లో లోపించిన సహకారం**

చేనేత సహకార సంఘాల్లో సగటు కార్మికులకు సహకారం లభించటం లేదు. సంఘాల పాలకవర్గాలకు చెందిన వ్యక్తులు, వారి కనుసన్నల్లో ఉండే వారి పేర్లు మాత్రమే రికార్డుల్లో ఉంటాయి. ఇతర మగ్గాలపై నేసిన వస్త్రాలను పలువురు సంఘాల్లో నేసినట్లు ఆప్కోకు విక్రయిస్తూ వచ్చే ఆదాయం పక్కతోవ పట్టిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.



**పేరుకు పోయిన నిల్వలు**

చేనేత వస్త్రాలను ఎప్పుడు కూడా వినియోగదారుల అభిరుచిమేరకు తయారు చేయాలి. అప్పుడే మార్కెట్ ఉంటుంది. చేనేత రంగం సంక్షోభానికి కరోనా కూడా ఓ కారణం. తరువాత రంగులు, రసాయనాలు, నూలు ధరలు ఇబ్బడి ముబ్బడిగా పెరిగాయి. అయినా వ్యయప్రయాలసల కోర్చి వస్త్రాలు తయారు చేసిన వారి నుంచి కొనుగోళ్లు నిలిచి పోయాయి. దీంతో భారీగా నిల్వలు పేరుకుపో యాయి. వాటిని వెంటనే కొనుగోలు చేయించాల్సిన అవసరం ఉంది.

**కుప్పడంకు భౌగోళిక గుర్తింపు**

2018లో చంద్రబాబు జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చీరాల వచ్చారు. ఆసందర్భంగా సెయింట్‌ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన కార్యక్రమ సభలో చంద్రబాబును కలిసిన పలువురు నేతన్న ప్రతినిధులు కుప్పడంకు భౌగోళిక గుర్తింపు ఇవ్వాలని కోరారు. అందుకు తగిన చర్యలు చేపడతామని చెప్పారు. అది కార్యరూపం దాల్చాల్సి ఉంది. మొత్తం మీద అన్ని సమస్య లకు సీఎం చంద్రబాబు ప్రాధాన్య క్రమంలో పరిష్కారం చూపగలరని నేతన్నలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

**హెలిప్యాడ్‌కు స్థల పరిశీలన**

సీఎం చంద్రబాబు పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను సోమవారం అధికారులు పరిశీలిం చారు. చీరాల వీఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కళాశాల ప్రాంగణంలో హెలీప్యాడ్ ఏర్పాటు ప్రదేశాన్ని జాయింట్ కలెక్టర్ సుబ్బారావు, ఆర్డీఓ సూర్యనారాయణరెడ్డి తదిత రులు పరిశీలించారు. స్థానిక అధికారులకు పలు సూచనలు చేశారు.



వీఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కళాశాల ప్రాంగణంలో హెలిప్యాడ్ ఏర్పాటు ప్రదేశాన్ని పరిశీలిస్తున్న జేసీ సుబ్బారావు, ఆర్డీఓ సూర్యనారాయణరెడ్డి తదితరులు

## వరద ప్రభావిత గ్రామాల్లో

# ముందస్తు జాగ్రత్త చర్యలు

- గ్రామాల వారీగా కుటుంబ వివరాలు నమోదు చేయాలి
- కృష్ణానదికి పెరగనున్నవరదనీరు
- ఆర్డీవో హేలా షారోన్

కొల్లూరు, ఆగస్టు 5: వరద ప్రభావిత గ్రామాల్లో అధికారులు ముం దస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్డీవో హేలాషారోన్ సూచించారు. సోమవారం ఆర్డీవో కొల్లూరు మండలంలోని లంక గ్రామాల్లో పర్యటించి ప్రజలతో మాట్లాడారు. పొంచి ఉన్న వరద ముంపు గురించి వారికి వివరించారు. గ్రామాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, వృద్ధులు ముందస్తుగా సురక్షిత ప్రాంతాలు లేదా అధికారులు ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలి వెళ్లాలన్నారు. పునరావాస కేంద్రాల్లో అన్ని సౌకర్యాలను కల్పిస్తారన్నారు. వైద్య సేవలు కూడా అందుబాటులో ఉంచుతున్నట్లు చెప్పారు. వరద నీటి ఉధృతికి రోడ్లు, వంతెనలు దెబ్బ తింటాయని, ఆ సమయంలో ప్రజలు వాటిని దాటే ప్రయత్నాలను పోలీసులు దగ్గరుండి నిరోధించాలన్నారు. వరద వల్ల ఎటువంటి ప్రాణ నష్టం వాటిల్ల కూడదని, అందుకు సంబంధించిన జాగ్రత్తలు ముందుగా నే చూసుకోవాలన్నారు. గ్రామస్థులను తరలించేందుకు వాహనాలను సిద్ధం చేయాలని, మర పడవలు ఏర్పాటు చేసుకోవాలని అధికారులకు సూచించారు. ఐసీడీఎస్, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది తమ దగ్గర ఉన్న సమాచారం మేరకు గర్భిణులు, చిన్నారులు, మంచంలో ఉన్న వారు, 70 ఏళ్ల దాటిన వృద్ధులను ముందుగానే పునరావాస కేంద్రాలకు తీసుకు రావాలన్నారు. వరద ప్రభావిత గ్రామాల్లో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యం లో ఏర్పాటు చేసిన శిబిరాల్లో సాధారణ మందులతో పాటు పాము కాటునివారణకు వినియోగించే మందులు, ఇంజక్షన్లు కూడా అందుబాటులో ఉంచు కోవాలని చెప్పారు. మూగజీవాల ప్రాణాలు కూడా కాపాడాల్సిన బాధ్యత తీసుకోవాలన్నారు.

**మత్స్యకారులతో సమావేశం..**

వరద సమయంలో గ్రామాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు చేరవేసేందుకు మత్స్యకారులతో తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎఫ్‌టీవో హిమజలు సమావేశం నిర్వహించారు. వరద విపత్తు నుంచి ప్రజలను రక్షించేందుకు అవసరమైన పడవలు మత్స్యకారులు ఏర్పాటు చేయాలని చెప్పారు. మొత్తం వారి వద్ద పడవల గురించి ఆరా తీశారు. ఆయా వివరాలను ఆర్డీవోకు సమర్పించి మీకు కావాల్సినవి కల్పిస్తామని, ఒక్కొక్క గ్రామానికి రెండు పడవలు చొప్పున ఏర్పాటు చేయాలని తహసీల్దార్ మత్స్యకారులకు సూచించారు.



పెదలంక గ్రామస్థులతో మాట్లాడుతున్న ఆర్డీవో హేలాషారోన్

## వాట్సప్ గ్రూపులు తొలగించాలి

### ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 5: గ్రామ, వార్డు వలంటీర్లు ఏర్పరిచిన వాట్సప్, టెలిగ్రామ్ గ్రూపులను వెంటనే తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. ఆ గ్రూపుల నుంచి వైదొలిగేలా ప్రజలకు కూడా అవగాహన కల్పించాలని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించింది. ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు లేకుండానే ఆ గ్రూపులు పెట్టినట్లు తమ దృష్టికి వచ్చిందని, అందువల్ల వాటిని తొలగించి నివేదికను పంపాలని కలెక్టర్లను ఆదేశించింది.

## జలజీవన్ మిషన్ పనితీరుపై పల్స్ సర్వే

### ఈనెల 8నుంచి 14 వరకు సర్వే

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 5: గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్యం(ఆర్‌డబ్ల్యూఎస్) విభాగం ఆధ్వర్యంలో గ్రామపంచాయతీల్లో నిర్వహిస్తున్న జలజీవన్ మిషన్ పథకం అమలు తీరుపై పల్స్ సర్వేకు ప్రభుత్వం ఆదేశించింది. ఈనెల 8నుంచి 14 వరకు సర్వే నిర్వహించి ఫలితాలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో ఈ సర్వే నిర్వహించనున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 95,44,599 కుటుంబాలు ఉన్నాయి. జలజీవన్ మిషన్ వెబ్‌సైట్‌లో పేర్కొన్న వివరాల ప్రకారం 70,13,580 గృహాలకు తాగునీటి కుళాయిలు ఉన్నాయి. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు ఈనెల 9 నుంచి 14 వరకు ఇంటింటికి వెళ్లి అసలు కుళాయిలు ఉన్నాయా లేవా, నీరు వస్తుందా, లేదా అన్న వివరాలు సేకరించి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. సర్వే నిర్వహణపై ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లకు ఈనెల 8న శిక్షణ ఇస్తారు. గ్రామపంచాయతీల్లో పల్స్ సర్వేను సంబంధిత ఆర్‌డబ్ల్యూఎస్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు పర్యవేక్షించాలి. ఈ మేరకు ఆర్‌డబ్ల్యూఎస్ చీఫ్ ఇంజనీర్ టి.గాయత్రిదేవి ఉత్తర్వులు జారీచేశారు. సర్వేను పక్కాగా నిర్వహించాలని ఎస్ఈ, ఈఈలను ఆదేశించారు.

## అన్ని గ్రేడ్లకూ మంచి ధరలు ఇవ్వాలి

### పొగాకు వ్యాపారులకు బోర్డు ఆర్ఎం సూచన



వ్యాపారులు, రైతులకు సూచనలిస్తున్న బోర్డు ఆర్ఎం

టంగుటూరు, ఆగస్టు 5 : పొగాకులో అన్ని గేడ్లకు మంచి ధరలు ఇవ్వాలని వ్యాపారులకు బోర్డు ఒంగోలు ప్రాంతీయ అధికారి ఎం.లక్ష్మణరావు సూచించారు. సోమవారం ఆయన స్థానిక వేలం కేంద్రాన్ని సందర్శించారు. వేలానికి వచ్చిన వివిధ రకాల బేళ్లు, వాటికి వ్యాపారులిస్తున్న ధరలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన కొనుగోలుదారులనుద్దేశించి మాట్లాడుతూ మీరిచ్చే ధరలు రైతులకు లాభదాయకంగా ఉండాలన్నారు. పొగాకు వేయడానికి ముందు పచ్చిరొట్ట ఎరువులైన జనుము, జీలుగ, నువ్వు సాగుచేయడం వలన ఎంతో ప్రయోజనం ఉంటుందని రైతులకు సూచించారు. ఇది లాభాలు తెచ్చిపెడుతుందన్నారు. అనధికారంగా బారన్లు నిర్మించవద్దని, అది చట్టరీత్యా నేరమన్నారు. వచ్చే సీజన్‌లో పొగాకు సాగుకు పొలాలు, బారన్‌లు అధిక కౌళ్లు చెల్లించి తీసుకోవద్దన్నారు. మున్ముందు మార్కెట్ ఎలా ఉంటుందో ఎవ్వరికీ తెలియదన్నారు. ఇప్పుడు లభిస్తున్న ధరలు ఏటా ఉంటాయన్న నమ్మకం లేదన్నారు. బోర్డు అనుమతికి మించి పంట సాగు చేయవద్దని కోరారు. కార్యక్రమంలో రైతు నాయకులు పోతుల నరసింహారావు, పమిడి సుబ్బానాయుడు, మర్రిపూడి హరిబాబు పాల్గొన్నారు.

## లైసెన్స్ లేకుండా నారు విక్రయిస్తే చర్యలు

### ఉద్యానశాఖ అధికారి ప్రత్యూష హెచ్చరిక



మిరప నర్సరీని పరిశీలిస్తున్న ఉద్యానవనశాఖ అధికారి ప్రత్యూష

జరుగుమల్లి (కొండపి), ఆగస్టు 5 : లైసెన్స్ లేకుండా నారు విక్రయించే నర్సరీలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఉద్యానశాఖాధికారి డి.ప్రత్యూష హెచ్చరించారు. యజమానులు నర్సరీలను తప్పనిసరిగా రిజిస్టర్ చేయించుకోవాలని సూచించారు. సోమవారం ఆమె మండలంలోని వర్ధినేనివారిపాలెంలో మిరప నారు నర్సరీలను పరిశీలించారు. ఈసందర్భంగా నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. నర్సరీల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దానివల్ల చీడపీడలు ఆశించవన్నారు. నారు విక్రయించేటప్పుడు రైతులకు విధిగా రశీదులు ఇవ్వాలని కోరారు. నర్సరీ పేరు, మొక్కల ధరలు కనిపించేలా ప్రత్యేక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. తమశాఖ ద్వారా పండ్ల, పూలతోటలు, కూరగాయల సాగుకు రాయితీలు అందిస్తున్నామని, ఆసక్తి ఉన్న రైతులు ఆర్‌బీకేల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ప్రత్యూష కోరారు.

## అమృత పథకంపై కదలిక

### అన్ని ప్రాంతాలకూ నీటిని అందించలేకపోతున్న దర్శి ఎస్ఏపీ

### ఏడాదిన్నర క్రితం రూ.121 కోట్లు మంజూరు చేసిన కేంద్రం

### వైసీపీ ప్రభుత్వ హయాంలో పట్టించుకోని పాలకులు

### తాజాగా నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి చొరవతో కార్యాచరణ



దర్శి పట్టణం

దర్శి, ఆగస్టు 5 : దర్శి నగర పంచాయతీలోని ప్రజలకు రక్షిత మంచినీరు అందించే బృహత్తరమైన అమృత పథకం అమలుకు శ్రీకారం చుట్టారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అమృత పథకానికి ఏడాదిన్నర క్రితం రూ.121 కోట్లు మంజూరైన విషయం తెలిసిందే. వైసీపీ పాలకుల నిర్లక్ష్యం వలన ఆ పథకం అడుగు ముందుకు పడలేదు. ఎన్నికల ముందు అప్పటి వైసీపీ పాలకులు హడావుడిగా శిలాఫలకం వేశారు. కానీ పనుల నిర్వహణ గురించి పట్టించుకోలేదు.

### పులిపాడు చెరువు నుంచి పథకం అమలు

టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అమృత పథకం నిర్మాణంపై అధికారులు దృష్టి సారించారు. పులిపాడు చెరువును మంచినీటి సమ్మర్ స్టోరేజీ ట్యాంకుగా అభివృద్ధి చేసి సాగర్ వాటర్ నింపుతారు. పైపులైన్లు ద్వారా దర్శి పట్టణంలోని ప్రజలకు తాగునీరు అందిస్తారు. అందులో భాగంగా పట్టణంలోని అన్నీ కుటుంబాలకు ఇంటింటికి కొళాయి ఏర్పాటు చేస్తారు.

### దర్శితోపాటు 120 గ్రామాల ప్రజలకు మేలు

అమృత పథకం నిర్మాణం పూర్తయితే దర్శి ప్రాంతంలోని ప్రజలకు తాగునీటి సమస్య పూర్తిగా తొలగిపోనుంది. ఒక్క దర్శి పట్టణంలోనే సుమారు 14వేల కుటుంబాలు ఉన్నాయి. మొత్తం 88 వేల మంది జనాభా ఉన్నారు. ఇప్పటి వరకు దర్శి ఎస్ఏపీ రక్షిత మంచినీటి పథకం ద్వారా 120 గ్రామాలతోపాటు దర్శి పట్టణానికి మంచినీటి సరఫరా చేస్తున్నారు. ఎస్ఏపీ చెరువు పూడిపోవటంతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయింది. దీంతో అన్నీ గ్రామాలకు మంచినీరు సక్రమంగా అందించలేకపోతున్నారు. ఒక్కోసారి దర్శి పట్టణంలోని శివారు ప్రాంతాలకు కూడా తాగునీరు సక్రమంగా అందటం లేదు. అమృత పథకం నిర్మాణం పూర్తయితే నూతనంగా నిర్మించే చెరువు ద్వారా పట్టణ ప్రజలకు సమృద్ధిగా నీరు అందించే అవకాశం ఉంటుంది. దీంతో ఎస్ఏపీ స్కీం ద్వారా గ్రామీణ ప్రాంతాలకు కూడా సమృద్ధిగా మంచినీరు అందించే వీలు కలుగుతుంది. బహుళ ప్రయోజనాలు కలుగుతున్న అమృత పథకాన్ని వైసీపీ పాలకులు పక్కన పడేయటం పట్ల పట్టణ ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి ఆ పథకం అమలుపై ప్రత్యేక దృష్టి సారించారు. అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు చెప్పారు. దీంతో దర్శి పట్టణ ప్రజలకు తాగునీటి సమస్య పూర్తిగా తొలుగుతుంది.

# సర్టిఫికేట్లు

### నకిలీ ధ్రువపత్రాలకు కేరాఫ్ మార్కాపురం మున్సిపాలిటీ

### జేబులు నింపుకొంటున్న జనన, మరణ ధ్రువీకరణ విభాగం

### పుష్కలంగా వైసీపీ నేతల అండదండలు

### ఫిర్యాదు అందినా పట్టించుకోని ఉన్నతాధికారులు

### భారీగా కూడబెట్టిన అక్రమార్కులు

**మార్కాపురంలో చేయి తడిపితే క్షణాల్లో మంజూరు**

మార్కాపురం, ఆగస్టు 5: మార్కాపురం మున్సిపాలిటీలోని జనన, మరణ ధ్రువపత్రాలు జారీచేసే విభాగం అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. రూ.లక్షల్లో వసూలు చేస్తూ ఇష్టారీతిన నకిలీ సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారు. రాజకీయ నాయకుల అండదండలు పుష్కలంగా ఉండటం, అన్నిస్థాయిల అధికారుల సహకారం తోడవడంతో మున్సిపాలిటీ నకిలీ ధ్రువపత్రాలకు కేంద్ర బిందువుగా మారింది. చివరికి మరీ బరితెగించి మార్కాపురంతో సంబంధంలేని ప్రాంతాల వారికి కూడా జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తున్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో వందల సంఖ్యలో ఇలా నకిలీ సర్టిఫికెట్లు జారీ చేసేశారు. అప్పట్లో ఫిర్యాదులు అందినా పట్టించుకున్న నాథుడే లేడు.

**ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే. ఇలా వందల సంఖ్యలో నకిలీ ధ్రువీకరణ పత్రాలు జారీచేసి రూ.లక్షల్లో సంబంధిత ఉద్యోగులు గడించారు.. ఇంకా ఇస్తునే ఉన్నారు కూడా. ఇందుకోసం పెద్ద ఎత్తున వ్యవహారాలు నడుస్తున్నాయి. అక్రమార్కులకు రాజకీయ పలుకుబడి ఉంది. దీంతో వారు ఆడిందే ఆట.. పాడిందే పాట అన్నట్లు మున్సిపాలిటీలో నడుస్తోంది. ఎన్ని ఫిర్యాదు వచ్చినా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోవడమే వారికి కలిసొచ్చింది.**

### ఇతరుల ఆస్తులు కొట్టేసేందుకే..

మార్కాపురం మున్సిపాలిటీలో ఇలా ఇష్టారీతిన జారీచేసిన జనన, మరణ ధ్రువపత్రాలు పొందిన వాళ్లు ఇతరుల ఆస్తులు కొట్టేసేందుకే ఉపయోగిస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో ఎన్నడూలేని విధంగా వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల కాలంలోనే మార్కెట్లో రూ.వందల కోట్ల ఆస్తులను నకిలీ ధ్రువీకరణ పత్రాలను అడ్డుపెట్టుకుని వైసీపీ నాయకులు కొల్లగొట్టినట్లు తెలుస్తోంది. ఇలా విచ్చలవిడిగా ధ్రువపత్రాలు జారీ కావడానికి ప్రధాన కారణం అప్పటి నియోజకవర్గ ప్రజాప్రతినిధి సోదరుని ప్రమేయమేనని స్పష్టమవుతోంది. ఆయన సాగించిన భూదందాలు అన్నీ ఇన్నీ కావు. భూవివాదాలు, విలువైన స్థలాలు ఉండి మార్కాపురంలో లేనివారిని లక్ష్యంగా చేసుకుని ఇలా తప్పుడు పత్రాలు సృష్టించి రూ.కోట్లు కొల్లగొట్టినట్లు తెలుస్తోంది.






తప్పుడు ధ్రువీకరణ పత్రం, మార్కాపురం మునిసిపాలిటీ కార్యాలయం

మద్దెల వెంకటరత్నం వ్యక్తిది పూర్వం మార్కాపురం పట్టణమే. ఆయనకు భార్య మినహా పిల్లలు ఎవరూ లేరు. 1970 ప్రాంతంలో మార్కాపురం నుంచి వెళ్లిపోయాడు. ఎక్కడ ఉన్నారో కూడా బంధువులతోపాటు ఎవరికీ తెలియదు. కానీ ఈయన పేరున మార్కాపురం పట్టణంలోని ఎస్‌వీకేపీ కళాశాల ఎదురుగా సర్వే నెంబర్ 889లో సుమారు 25సెంట్ల భూమి ఉంది. ప్రస్తుత మార్కెట్ ధరల ప్రకారం ఎంతలేదన్నా రూ.10కోట్ల విలువ చేస్తుంది. ఆ 25 సెంట్లు మినహా చుట్టూ ఉన్న మొత్తం భూమిని ఓ వైసీపీ ముఖ్య నాయకుడు ఆయన అనుచరులు కొన్నారు. పనిలో పనిగా వెంకటరత్నం భూమిని ఆక్రమించారు. ఆక్రమణ అయితే చేశాం కానీ ఓ దొంగ రిజిస్టర్ కూడా చేయించుకుంటే లీగల్‌గా ఉంటుందని ప్రణాళిక రచించారు. ఈక్రమంలో అదే ఇంటిపేరు కలిగిన మద్దెల ప్రసాద్ అనే వ్యక్తిని మాట్లాడుకున్నారు. ప్రసాద్ తండ్రి అంపయ్య అయితే వెంకటరత్నంగా ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌లో మార్పించారు. అంతేకాక వెంకటరత్నం పేరున ఓ దొంగ మరణ ధ్రువీకరణ పత్రాన్ని కూడా సృష్టించారు. ఎలాంటి ఆధారాలు లేకపోయినా 10-345 అనే ఇంటి చిరునామాతో వెంకటరత్నం 1987 మే 25న మరణించినట్లు 2020 డిసెంబర్ 26న సర్టిఫికెట్ పొందారు. అందుకు భారీ మొత్తంలో చేతులు మారినట్లు తెలుస్తోంది.

తమ్మిరెడ్డి పెద్దిరెడ్డి అనే వ్యక్తిది కనిగిరి పట్టణం. ఈయన 1975లో మరణించారు. ఆయనకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆయన బతికుండగానే ఆస్తులు అమ్మేశాడు. కానీ ఆయన పేరును ఉపయోగించుకుని వారి బంధువులకు సంబంధించిన ఓ ఆస్తిని కొట్టేయాలని కనిగిరికి చెందిన ఓ వైసీపీ నాయకుడు యోచించాడు. అనుకున్నదే తడవుగా పెద్దిరెడ్డి కుటుంబ సభ్యులకు కొంతమేర ముట్టజెప్పాడు. నకిలీ ధ్రువీకరణ పత్రాలు సృష్టించేందుకు కొందరు అధికారులతో సంప్రదించాడు. మరణ ధ్రువీకరణ పత్రం కావాలంటే మార్కాపురంలో చిటికెలో లభిస్తుందని తెలుసుకున్నాడు. జనన, మరణ ధ్రువపత్రాలు జారీచేసే అధికారితో మాట్లాడాడు. పెద్దమొత్తంలో డబ్బులు ఇచ్చేందుకు ఒప్పందం చేసుకున్నాడు. ఇంకేముంది 1981 జూన్ 10న మరణించినట్లు 2023 నవంబర్ 15న ధ్రువీకరణపత్రం తయారైంది. కానీ ఇక్కడే కొన్ని పొరపాట్లు చోటుచేసుకున్నాయి. డెత్ సర్టిఫికెట్‌లో నమోదు సంఖ్య 109 అని ఉండగా, జనన, మరణాలను నమోదు చేసే రికార్డులో మాత్రం 90 ఉంది. అంతేకాక అప్పట్లో మరణ సమాచారం ఇచ్చిన వ్యక్తిగా చెబుతున్న వి.వెంకటేశ్వరరెడ్డి మరణించిన వ్యక్తికి మనవడు. సమాచారం ఇచ్చారని చెబుతున్న 1981లో ఆయనకు నాలుగేళ్లు ఉంటాయి. ఈ విషయంపై పెద్దిరెడ్డి బంధువులు కొందరు సమాచారహక్కు చట్టం ద్వారా సాక్ష్యాధారాలు సేకరించి ఇప్పటికే కలెక్టర్, సబ్‌కలెక్టర్, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్‌లకు ఫిర్యాదు చేశారు.

### విచారణలతోనే సరి.. చర్యలు శూన్యం..

నకిలీ ధ్రువపత్రాల విషయంపై జిల్లాలోని అన్నిస్థాయిల అధికారులకు ఫిర్యాదులు అందాయి. కానీ నేటికీ విచారణలతోనే అందరూ సరిపెడుతున్నారు. ఈ వ్యవహారంలో బాధ్యులు ఎవరో తేల్చి వారిపై కఠినచర్యలు తీసుకోవాల్సి ఉంది. ప్రస్తుతం ఎన్ని ఫిర్యాదులు అందినా కేవలం విచారణలతోనే ఉన్నతాధికారులు సరిపెడుతున్నారు. కనిగిరికి చెందిన తమ్మినేని సాయినీలేష్‌రెడ్డి నకిలీ ధ్రువపత్రాలపై ఇప్పటికే కలెక్టర్, మార్కాపురం సబ్ కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌లకు అన్ని ఆధారాలతో ఫిర్యాదు చేశాడు. అయినా చర్యలపై మాత్రం చలనం లేదు.

# సింగరాయకొండలో అక్రమాలపై విచారణ

### రూ.40లక్షలకుపైగా నిధులు దారిమళ్లించినట్లు ఆరోపణలు

### ఏడాది క్రితం విచారణ చేసినా నివేదిక

### ఇవ్వకపోవడంపై ఇద్దరు డీఎల్‌పీఓలకు నోటీసులు

### సర్పంచ్ చెక్‌పవర్ తాత్కాలికంగా రద్దు

### డీఎల్‌పీఓ, పంచాయతీ కార్యదర్శికి జాయింట్ సిగ్నేచర్

### ఈనెల 9న విచారణకు హాజరుకావాలని

### పలువురికి నోటీసులు ఇచ్చిన విచారణాధికారి



సింగరాయకొండ పంచాయతీ కార్యాలయం

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 5 : మండలకేంద్రమైన సింగరాయకొండ గ్రామ పంచాయతీలో జరిగిన అవినీతి, అక్రమాలను నిగ్గుతేల్చేందుకు అధికార యంత్రాంగం సిద్ధమైంది. గతేడాది కాలంగా పంచాయతీలో నిధులు పెద్దఎత్తున నిధులను దారిమళ్లించినట్లు అనేక ఆరోపణలు వచ్చినా అప్పట్లో పట్టించుకున్న పరిస్థితి లేదు. గ్రామపంచాయతీకి సంబంధించిన నిధులను కార్యదర్శులతో కుమ్మక్కై రూ.46లక్షలకుపైగా దారిమళ్లించారని సింగరాయకొండ జనసేన పార్టీ అధ్యక్షుడు రాజేష్ ఫిర్యాదులు చేస్తూ వచ్చారు. అయితే వైసీపీ ప్రభుత్వంలో పట్టించుకున్న పరిస్థితి లేకుండాపోయింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇటీవల మరోసారి రాజేష్ మీకోసం కార్యక్రమంలో కలెక్టర్ తమీమ్ అన్సారియాకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ అందుకు సంబంధించిన విచారణ నివేదికలను అందజేయాలని ఆదేశించారు. అయితే సింగరాయకొండ గ్రామపంచాయతీ నిధుల దుర్వినియోగంపై విచారణకు ఒంగోలు, కనిగిరి డివిజనల్ పంచాయతీ అధికారులను విచారణాధికారులుగా నియమించారు. అయితే వారు విచారణ చేసినా ఏడాది కాలంగా ఆ నివేదికను అందజేయకపోవడంతో మరోసారి వారి ఇరువురికి నోటీసులను ఇచ్చారు.

### సర్పంచ్‌పై చర్యలు

మరోవైపు పంచాయతీ నిధుల దుర్వినియోగంపై సర్పంచ్ టి.వనజకు తాత్కాలికంగా చెక్‌పవర్‌ను వారంరోజులపాటు నిలుపుదల చేస్తూ సోమవారం డీపీఓ ఉషారాణి ఉత్తర్వులు జారీచేశారు. వారంరోజుల్లో వివరణ ఇవ్వకపోతే పూర్తిగా చెక్‌పవర్‌ను రద్దుచేయాల్సి వస్తోందని ఆ నోటీసుల్లో పేర్కొన్నారు. ఒకవైపు జిల్లా పంచాయతీ అధికారులు చర్యలకు ఉపక్రమించగా మరోవైపు కలెక్టర్ తమీమ్ అన్సారియా నిధుల దుర్వినియోగంపై నిగ్గుతేల్చేందుకు విచారణకు ఆదేశించారు. విజిలెన్స్ ప్రత్యేక అధికారిని విచారణాధికారిగా నియమించడంతో ఆయన విచారణ చేసేందుకు పంచాయతీ సర్పంచ్‌తోపాటు గతంలో పనిచేసిన ఈఓఆర్‌డీ, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందికి నోటీసులు జారీ చేశారు. ఈనెల 9వతేదీన ఉదయం 11 గంటలకు పంచాయతీ కార్యాలయంలో జరిగే విచారణకు హాజరుకావాలని నోటీసులు పంపారు. 2021 డిసెంబరు నుంచి జూన్ 2022 మధ్యకాలంలో పంచాయతీ కార్యదర్శులు ఎలాంటి వస్తువులు కొనుగోలు చేయకుండా సాధారణ నిధుల నుంచి రూ. 13లక్షలు బిల్లులు డ్రా చేశారని ఆ నోటీసులు పేర్కొన్నారు. పంచాయతీలో పనులు చేయకుండానే చేసినట్లుగా రికార్డులు సృష్టించి 15వ ఆర్థిక సంఘంనిధులు రూ.33లక్షలు స్వాహా చేసినట్లు ఫిర్యాదులు రావడంతో వాటిపై సమగ్ర సమాచారంతో విచారణకు హాజరు కావాలని నోటీసులు జారీచేయడంతో కలకలం రేగింది.

### ఉప్పుగుండూరు సర్పంచ్ చెక్‌పవర్ తాత్కాలికంగా రద్దు

నాగులుప్పలపాడు మండలం ఉప్పుగుండూరు సర్పంచ్ దేవరకొండ జయమ్మ చెక్‌పవర్‌ను తాత్కాలికంగా నిలుపుదల చేస్తూ డీపీఓ ఉషారాణి సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. గ్రామ పంచాయతీలో రూ.42,70,666 దుర్వినియోగమైనట్లు కె.శ్రీనివాసరావు అనే వ్యక్తి డీపీఓకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఒంగోలు డివిజనల్ పంచాయతీ అధికారిని విచారణాధికారిగా నియమించారు. అయితే ఆ విచారణ నివేదిక జాప్యం కావడంతో సోమవారం ఫిర్యాదుదారుడు జిల్లా పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. దీంతో స్పందించిన అధికారులు సర్పంచ్ జయమ్మ చెక్ డ్రాయింగ్ పవర్‌ను తాత్కాలికంగా నిలుపుదల చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. వారంరోజుల్లో సర్పంచ్ సంజాయిషీ ఇవ్వకపోతే పంచాయతీరాజ్ చట్టం ప్రకారం చెక్ పవర్‌ను పూర్తిగా తొలగిస్తామని ఆ ఉత్తర్వుల్లో హెచ్చరించారు. డీఎల్‌పీఓ నివేదికలోని సిఫార్సుల మేరకు పంచాయతీ కార్యదర్శి, జూనియర్ సహాయకులపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని డీపీఓ ఉషారాణి తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి



లింగంపల్లి గోపీ, గోలి వేణు

మంగళగిరి సిటీ, ఆగస్టు 5: మంగళగిరి పట్టణంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతిచెందారు. మంగళగిరి పట్టణ ఎస్ఐ బి.రవీంద్ర నాయక్ తెలిపిన వివరాల ప్రకారం... బాపట్ల జిల్లా చీరాల మండలం తోటవారిపల్లె గ్రామానికి చెందిన గోలి వేణు(23), లింగంపల్లి గోపీకృష్ణ(25) స్నేహితులు. గోపీకృష్ణ స్వర్ణకార వృత్తి నేర్చుకునే నిమిత్తం సుమారు ఇరవై రోజుల నుంచి మంగళగిరిలోని బంధువుల వద్ద వుంటున్నాడు. ఈ నేపథ్యంలో ఆదివారం స్నేహితుల దినోత్సవం కావడంతో గోపీకృష్ణను కలిసేందుకు వేణు తోటవారిపల్లె నుంచి వచ్చాడు. ఇద్దరూ కలిసి ద్విచక్ర వాహనంపై ఆదివారం సాయంత్రం చినకాకాని నుంచి మంగళగిరి పట్టణంలోకి వస్తున్నారు. ఎర్రచెరువు కాళీమాత ఆలయం ఎదురుగా వున్న మలుపు వద్దకు రాగానే రోడ్డుపై ఆవులు అడ్డుపడ్డాయి. వాటిని తప్పించబోయి బైకు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో తలకు బలమైన గాయాలు కావడంతో వేణు, గోపీకృష్ణ అక్కడికక్కడే మృతిచెందారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వేణు తండ్రి గోలి రమణయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పట్టణ పోలీసులు తెలిపారు.

### మృత్యువులోనూ వీడని స్నేహం

తోటవారిపాలెం(చీరాలటౌన్) : వారిద్దరిది ఒకేమాట. ఒకే బాట. అన్ని వేళల్లోనూ ఎంతో కలిసి మెలిసే ప్రయాణం. దేవుడు సైతం వారిద్దరినీ కానరాని లోకాలకు కలిసే పంపాడు. చీరాల మండలం తోటవారిపాలెం పంచాయతీ వీవర్స్ కాలనీకు చెందిన లింగంపల్లి గోపీ(23), గోలి వేణు ప్రాణ స్నేహితులు. వీరిద్దరికీ మంగళగిరిలో మరో మిత్రుడి వద్దకు ఫ్రెండ్‌షిప్ డే వేడుకలు వెళ్లి మృత్యువాతపడ్డారు. గోపి తల్లి కోవిడ్‌తో మృతి చెందింది. తండ్రి రంగారావు పుట్టు మూగ. మూగ తండ్రికి నాయనమ్మకు అండగా ఉంది. గోపీ మరణం ఆ కుటుంబానికి తీరని లోటు. వేణుకు తండ్రి లేరు. తల్లి రమాదేవి చేనేత కార్మికురాలు. వీరు ముగ్గురు అన్నదమ్ములు. కాగా వేణు పెద్దవాడు. పెయింట్ పని చేస్తూ తల్లికి అండగా ఉంటున్నాడు.

# ఆస్తి వివాదాలు.. ప్రైవేటు పంచాయితీలు

### అక్రమార్కులకు అండగా ఉండం

### ఎమ్మెల్యే కొండయ్య స్పష్టీకరణ



స్థల వివాదంలో తలపడుతున్న ఇరు వర్గాలు

చీరాల, ఆగస్టు 5 : ప్రశాంత వాతావరణం కల్పిస్తాం. అందరికీ అండగా ఉంటాం. అభివృద్ధిలో పోటీ పడదాం. అరాచక శక్తులపై ఉక్కుపాదమం మోపుదామంటూ ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పదేపదే చెప్తున్న మాటలు. ఆయన వరకు ఆ పద్ధతిని కొనసాగిస్తున్నారు. అయితే ఎమ్మెల్యే కొండయ్య పేరు చెప్పుకుని కొందరు వ్యక్తులు పైరవీలు, ప్రైవేటు పంచాయతీలను సాగిస్తున్నారు. తాము ఎమ్మెల్యే కొండయ్యకు అనధికారిక పీఏలమని చెప్పేవారు కొందరైతే.. ఆయన అంతరాత్మలమని చెప్పేవారు మరికొందరున్నారు. ఆయన సొంత మనుషులమని చెప్పేవారున్నట్లు అటు అధికారులు, ఇటు రాజకీయవర్గాలతో పాటు, ప్రజల్లో చర్చ సాగుతోంది. ఆ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కొండయ్య సదరు వ్యక్తుల పద్ధతి మార్చుకోమని హెచ్చరించినట్లు సమాచారం. ఇదిలావుంటే వేటపాలెం మండలం కొత్తపేట పంచాయతీ శ్రీనివాసకాలనీలో ఆదివారం ఓ స్థల వివాదంలో ఇరువర్గాలు ఘర్షణకు దిగాయి. ఓ స్థలంలో ఒకరు గోడ కట్టించగా, రెండో వర్గం ఆ గోడను తొలగించారు. దీంతో ఇరువర్గాల మధ్యా వాగ్వివాదంతోపాటు ఒకరి పైమ రొకరు చేయి చేసుకున్నారు. ఈ ఘటన వీడియో వైరల్ అయింది. ఆ వివాదంలో సస్పెండ్‌లో ఉన్న ఓ కానిస్టేబుల్ ఆ స్థలం తనపేరుపై ఉందని చెప్తుండగా, అవతలివారు తమదంటూ వాదనకు దిగారు. ఆ కానిస్టేబుల్ ఎమ్మెల్యే కొండయ్యకు సన్నిహితుడని ప్రచారం ఉంది. దీనిపై కొత్తపేట వీఆర్వోను వివరణ కోరగా.. సదరు వివాదం తన దృష్టికి రాలేదన్నారు. వైరల్ అవుతున్న వీడియోపై ఎమ్మెల్యే తీవ్రంగా స్పందించారు.

### నా పేరు చెప్పుకుని అరాచకాలకు పాల్పడితే ఉపేక్షించను

### - ఎమ్మెల్యే కొండయ్య

సేవ చేసేందుకే వచ్చా. చీరాల నియోజకవర్గంలో గతంలో జరిగిన పాలనకు భిన్నంగా ప్రజలకు మంచి చేయడమే నా లక్ష్యం. ఎన్నికలలో ఎంతోమంది నా కోసం పనిచేశారు. అందుకు వారికి ధన్యవాదాలు, కృతజ్ఞతలు. ఈ నేపథ్యంలో నా పేరు చెప్పి అరాచకాలకు, అన్యాయాలకు పాల్పడివారెవరైనా ఉపేక్షించేంది లేదు. ఆయా శాఖల అధికారులు తమ రూల్ పొజిషన్ ప్రకారం చర్యలు తీసుకోండి. వారిపై తనవైపు నుంచి ఎలాంటి ఒత్తిడి ఉండదు.



పర్చూరు - ఇంకొల్లు రోడ్డు భారీ గుంతల్లో నిలచి ఉన్న వర్షపు నీరు

## ప్రధాన రహదారిపై భారీ గుంతలు

» వాహనదారుల ఇక్కట్లు » తరచూ ప్రమాదాలు

పర్చూరు, ఆగస్టు 5 : నిత్యం వందల సంఖ్యలో రాకపోకలు సాగించే పర్చూరు - ఇంకొల్లు (పాతమద్రాసు రోడ్డు) అధ్వానంగా తయారైంది. ఎక్కడ చూసినా పెద్ద పెద్ద గుంతలే కన్పిస్తున్నాయి. రోడ్డు పూర్తి స్థాయిలో దెబ్బతిని గుంతలయినా పట్టించుకున్న దాఖలాలే లేవు. జగన్‌రెడ్డి పాలనలో ఐదేళ్లపాటు రోడ్ల నిర్వహణపై నిర్లక్ష్యం చూపారు. దీంతో రహదారులు ధ్వంసమయ్యాయి. కొద్దిపాటి వర్షం కురిసినా రోడ్డుమీద ఉన్న గుంతలు వర్షపు నీటితో నిండిపోవడంతో గుర్తించని వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. కనీసం మరమ్మతులైనా చేపట్టాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు. ఇంకొల్లు వెళ్లే రోడ్డు పరిస్థితి మరింత దారుణంగా మారింది. వెంటనే రోడ్లను బాగుచేయాలని వేడుకుంటున్నారు.

# తాగునీటి సమస్య తీరేనా..?

» గుండ్లకమ్మ నదికి వచ్చిన ప్రవాహం
» వారంరోజులుగా అరకొర సరఫరా



గుండ్లకమ్మ నదిలో అద్దంకి సమీపంలో ప్రవహిస్తున్న నీరు

అద్దంకి, ఆగస్టు 5 : అద్దంకి పట్టణవాసులు ఈ ఏడాదికి తాగునీటి కష్టాల నుంచి గట్టెక్కే పరిస్థితులు కనిపిస్తున్నాయి. వారంరోజులుగా అద్దంకి పట్టణంలో తాగునీటి సరఫరా అంతంత మాత్రంగా ఉంది. గుండ్లకమ్మ నదిలోని ఊటబావుల వద్ద నీటి లభ్యత లేకపోవడంతో ట్యాంక్‌లకు అరకొరగానే నీటి పంపింగ్ జరుగుతోంది. దీంతో పట్టణంలోని అత్యధిక ప్రాంతాలకు నీటి సరఫరా అంతంత మాత్రంగానే జరుగుతుంది. ఈ నేపథ్యంలో గుండ్లకమ్మ నది ఎగువ ప్రాంతాలలో కురిసిన వర్షాలకు తోడు సాగర్ నీరు తాగునీటి చెరువులు నింపేందుకు విడుదల కావడంతో ఆయా ప్రాంతాల నుంచి వస్తున్న సీపేజ్ వాటర్ గుండ్లకమ్మ నదికి చేరి సోమవారానికి కొద్దిమేర అద్దంకి వద్దకు నీటి ప్రవాహం వచ్చింది. దీంతో ఊటబావుల వద్దకు నీటి లభ్యత పెరిగింది. అయితే గుండ్లకమ్మ నదిలో నీరు సోమవారం రంగుమారి వస్తుండడంతో సోమవారం నీటి పంపింగ్ చేయలేదు. మంగళవారం నుంచి నీటి పంపింగ్ పూర్తి స్థాయిలో చేసి నీటి విడుదల చేయడం జరుగుతుందని మున్సిపల్ ఏఈ మరియదాసు తెలిపారు. సాగర్ డ్యామ్ కూడా పూర్తి స్థాయిలో నిండడంతో సాగర్ కాలువ లకు సాగునీటికి నీటి విడుదల జరుగుతుండడంతో గుండ్లకమ్మ నదిలో ఇక నీటి ప్రవాహానికి ఇబ్బందులు ఉండవు. దీంతో అద్దంకి పట్టణ ప్రజలకు కూడా తాగునీటి సరఫరా పూర్తి స్థాయిలో జరిగే అవకాశం ఉంది.



తహసీల్దార్‌ను అభినందిస్తున్న కార్యాలయ ఉద్యోగులు

## తహసీల్దార్‌గా కవిత బాధ్యతల స్వీకరణ

బల్లికురవ, ఆగస్టు 5 : బల్లికురవ తహసీల్దార్‌గా డీ కవిత సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బాపట్ల కలెక్టర్ కార్యాలయం నుంచి కవితను ఇక్కడకు బదిలీ చేశారు. డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్ నుంచి కవిత బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ ఉద్యోగులు, వీఆర్వోలతో తహసీల్దార్ కవిత మాట్లాడుతూ రెవెన్యూకు సంబంధించిన పెండింగ్ పనులు లేకుండా అందరూ సమన్వయంతో పూర్తి చేయాలన్నారు. బాధ్యతతో ఎక్కడా లోపాలు లేకుండా చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. అనంతరం నూతన తహసీల్దార్‌ను ఉద్యోగులు, సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో ఏఎస్‌వో అమరనాథ్, వీఆర్వోలు యార్లగడ్డ శ్రీనివాసరావు, అశోక్, వీరయ్య వాసు, వెంకటేశ్వర్లు, మీనా పాల్గొన్నారు.

## తహసీల్దార్‌గా విధులు చేపట్టిన నాగరాజారావు



నాగరాజారావుకు శుభాకాంక్షలు చెప్తున్న ఉద్యోగులు

పంగులూరు, ఆగస్టు 5 : పంగులూరు తహసీల్దార్‌గా డీ నాగరాజారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. తిరుపతి నుంచి జె.పంగులూరు తహసీల్దార్‌గా ఇక్కడకు బదిలీపై వచ్చారు. నాగరాజారావును కార్యాలయ డీటీ ఆదినారాయణ, వీఆర్వోలు, సిబ్బంది పుష్పగుచ్ఛమిచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

## పోలేరమ్మ గుడిలో వెండి తాళిబొట్టు చోరీ

బల్లికురవ, ఆగస్టు 5 : మండలంలోని గుంటుపల్లి పోలేరమ్మ గుడిలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని దొంగలు అమ్మవారి మెడలో ఉన్న వెండి తాళిబొట్టు తాడును చోరీ చేశారు. నెల రోజుల వ్యవధిలో ఈ గుడిలో ఇది రెండో దొంగతనమని ధర్మకర్త మాదాల వీరమ్మ తెలిపారు. గత నెలలో హుండీని పొలాల్లో పడవేసి వెళ్లారని ఆమె తెలిపారు. రోడ్డు ప్రక్కనే దేవాలయం ఉండడంతో దొంగలు రాత్రుల వేల చోరీకి పాల్పడుతున్నారని ప్రజలు తెలిపారు. సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ దొంగలు వస్తున్నారన్నారు. ఏడాది కిందట గ్యాస్ సిలిండర్లను దొంగిలించారని తెలిపారు. పోలీసులు గ్రామాలలో నైట్ బీట్ తిరిగి చోరీలను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

## కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులను ఇవ్వాలి

మార్టూరు, ఆగస్టు 5 : మండలంలోని కౌలు రైతులందరికీ గుర్తింపుకార్డులను ఇచ్చేవిధంగా కృషి చేయాలని రైతు సంఘాల నాయకులు సోమవారం తహసీల్దార్ టి.ప్రశాంతిని కలిసి వినతిపత్రం అందచేశారు. ఐదేళ్ల నుంచి వివిధ కారణాలతో కౌలు రైతులకు అధికారులు గుర్తింపుకార్డులను ఇవ్వలేదని తెలిపారు. తద్వారా పంట నష్టం జరిగినప్పుడు, రాయితీపై ఎరువులు పంపిణీ చేసినప్పుడు వారు ప్రయోజనం పొందలేకపోయారని తెలిపారు. భూయజమానులు కౌలుదారులకు అంగీకారపత్రాలు ఇవ్వకపోవడంతో కూడా కౌలు రైతులు నష్టపోతున్నారని అన్నారు. జంగమహేశ్వరపురం, లక్కవరం గ్రామాల పరిధిలో ఏళ్ల తరబడి సాగుచేసుకుంటున్న ఇనాం భూములపై రైతులకు హక్కులు వచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో కందిమళ్ల రామకోటేశ్వరరావు, బత్తుల హనుమంతరావు,వీరవల్లి కృష్ణమూర్తి, వెలగా మోహనరావు పాల్గొన్నారు.

## ఇటుక బట్టీల వద్ద చోరీలు

రూ.1.50 లక్షల విలువైన ట్రాక్టర్ ట్రాలీ, బ్యాటరీలు మాయం



చోరీకి గురైన ట్రాక్టర్ బ్యాటరీ.. ట్రాక్టర్ ట్రాలీ (ఫైల్)

అద్దంకి, ఆగస్టు 5 : ఇటుక బట్టీల వద్ద సుమారు 1.50 లక్షల రూపాయల విలువైన ట్రాక్టర్ ట్రాలీ, ట్రాక్టర్‌లకు ఉన్న రెండు బ్యాటరీలు చోరీకి గురయ్యాయి. బాధితుల కథనం మేరకు.. అద్దంకి పట్టణ పరిధిలో కలవకూరు రోడ్డులో ఉన్న దొప్పలపూడి ప్రసాద్‌కు చెందిన ఇటుక బట్టీల వద్ద నిలిపి ఉన్న ట్రాక్టర్ ట్రాలీని గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి ఆటో కు కట్టుకొని తీసుకుపోయారు. అదే సమయంలో ట్రాక్టర్‌కు ఉన్న రెండు బ్యాటరీలను కూడా దొంగలించారు. మూడు రోజుల కిందట మరో ఇటుక బట్టీ వద్ద కూడా మూడు బ్యాటరీలు చోరీ అయ్యాయి. ఇటుక బట్టీల వద్ద కూలీలు లేకపోవడంతో దొంగతనాలు పెరిగినట్లు తెలుస్తుంది. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు దొప్పలపూడి ప్రసాద్ తెలిపారు.

## పరస్పర కేసులు నమోదు

పర్చూరు, ఆగస్టు 5 : కారంచేడు పోలీసు స్టేషన్‌లో గ్రామ పంచాయతీకి సంబంధించి నెలకొన్న వివాదంలో ఇరు వర్గీయుల ఫిర్యాదుపై ఆదివారం రాత్రి పరస్పర కేసులు నమోదయ్యాయి. కారంచేడు సర్పంచ్ బాలిగ శివపార్వతి తనను కులంపేరుతో అసభ్యంగా వార్డు సభ్యులు పాతూరి ఆదిలక్ష్మి, ఉపసర్పంచ్ యార్లగడ్డ రత్తయ్యతోపాటు మరికొందరు దూషించారంటూ ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. పాతూరి ఆదిలక్ష్మి, ఉపసర్పంచ్ యార్లగడ్డ రత్తయ్య చౌదరిని సర్పంచ్ బాలిగ శివపార్వతి తోపాటు, మరికొంతమంది సర్పంచ్ వర్గీయులు అసభ్యంగా దూషించారంటూ ఫిర్యాదు చేయడంతో మరో కేసు నమోదైంది. దీంతో ఇరువర్గీయుల ఫిర్యాదుపై రెండు వేరువేరు కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## వివాహితపై ముగ్గురు యువకుల దాడి

చీరాల, ఆగస్టు 5 : మండల పరిధిలోని ఈపురుపాలెం పంచాయతీ బోయినవారిపాలెంకు చెందిన బోయిన పద్మ (38) అనే వివాహితపై అదే గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు దాడిచేసి గాయపరిచినట్లు బాధితురాలు పేర్కొన్నారు. ఈ ఘటన ఆదివారం జరగ్గా బాధితురాలు తెలపడంతో సోమవారం వెలుగులోకి వచ్చింది. కొన్ని సంవత్సరాల క్రితం ఆమె భర్త మరణించారు. ఈ క్రమంలో తన నడవడిక సరిగా లేదంటూ గ్రామానికి కోటి మోహన్, వెంకటేశ్వర్లు, గోపి అనే ముగ్గురు తనపై ఆదివారం దాడిచేసి గాయపరిచారు. ఈపురుపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, తనకు న్యాయం జరగలేదని, పోలీసులే తనను బెదిరించారని ఆమె ఆరోపించారు. ఈ విషయమై ఈపురుపాలెం ఎస్సై శివకుమార్‌ను వివరణ అడగ్గా బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం ఉదయం కేసు నమోదు చేశామన్నారు. సాయంత్రం బోయినవారిపాలెం వెళ్లి బాధితురాలు, వారి కుటుంబ సభ్యులతో మాట్లాడినట్లు చెప్పారు.



బాధితురాలిని విచారిస్తున్న ఈపురుపాలెం ఎస్సై శివకుమార్



విజేతలుగా నిలిచిన విద్యార్థులతో ఉపాధ్యాయులు, దాతలు

## యోగాలో చందులూరు విద్యార్థుల సత్తా

పంగులూరు, ఆగస్టు 5 : యోగాసన పోటీలలో చందలూరు ఉన్నత పాఠశాల బాల, బాలికలు సత్తాచాటి జిల్లా స్థాయిలో విజేతలుగా నిలిచారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయి యోగా పోటీలలో వివిధ విభాగాలలో చందలూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటి ప్రథములుగా నిలిచారు. ఈ నెల 4వ తేదీన ఒంగోలు పీవీఆర్ ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి యోగాసన పోటీలలో 10 నుంచి 12 సంవత్సరాల విభాగంలో అమ్మిశెట్టి లిఖిత ప్రతిభ చాటి ప్రథమ స్థానంలో నిలిచింది. 12 నుంచి 14 సంవత్సరాల యోగాసన పోటీలో బాలికల విభాగంలో నాయపాము శృతి ప్రథమ స్థానం దక్కించుకోగా, బాలుర విభాగంలో అమ్మిశెట్టి వెంకటేష్ జిల్లా స్థాయిలో విజేతగా నిలిచాడు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో హెచ్‌ఎం గిరిజ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గ్రామపెద్ద అడ్డగడ వెంకట సుబ్బయ్య, ఉపాధ్యాయులు ప్రతిభ చాటిన క్రీడాకారులతో పాటు వారికి యోగాలో శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయిని ప్రతిమను అభినందించారు.

## శ్రీ త్రివిక్రమ అగస్త్యేశ్వర స్వామికి పూజలు

దర్శించుకున్న న్యాయాధికారి శాంతి

చెరుకూరు(పర్చూరు), ఆగస్టు 5 : పర్చూరు మండలం చెరుకూరు గ్రామంలో వేంచేసిన శ్రీ త్రివిక్రమ ఆగస్త్యేశ్వర స్వామివారి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజ లు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రాలు చేపట్టారు. జూనియర్ న్యాయాధికారి బీ శాంతి కుటుంబ సభ్యులతో స్వామివార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ కార్యనిర్వాహక అధికారి కె.నాగయ్య నేతృత్వంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



పూజలు నిర్వహిస్తున్న న్యాయాధికారి శాంతి

## మినీ బైపాస్ కోసం ఆక్రమణలు తొలగించాలి

అద్దంకి, ఆగస్టు 5 : అద్దంకి పట్టణంలో మినీ బైపాస్ రోడ్డు నిర్మాణానికి ఆక్రమణలను తొలగించాలని పీడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ సందిరెడ్డి రమేష్ తహసీల్దార్ శ్రీచరణ్‌ను కోరారు. తహసీల్దార్‌గా శ్రీచరణ్ బాధ్యతలు చేపట్టగా సోమవారం పీడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ సందిరెడ్డి రమేష్, 19వ వార్డు కౌన్సిలర్ యేజెండ్ల నాగరాజు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అద్దంకి పట్టణంలోని పలు సమస్యల గురించి వివరించారు.



తహసీల్దార్ శ్రీచరణ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రమేష్, నాగరాజు

## సీఐగా శ్రీనివాసరావు బాధ్యతల స్వీకరణ

చీరాలటౌన్, ఆగస్టు 5 : చీరాల వన్‌టౌన్ సీఐగా మారీడు శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈక్రమంలో పలువురు స్టేషన్ సిబ్బంది సీఐకి శుభాకాంక్షలు తెలిపారు. ఇప్పటి వరకు ఇక్కడ సీఐగా ఉన్న శేషగిరిరావుకు ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. సీఐల బదిలీలు ఉన్నప్పటికీ ఆయన ఇక్కడే ఉంటారని అనుకున్నారు. ఆయన్ని వీఆర్‌కు పంపడంతో పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి. శ్రీనివాసరావు ముక్కు సూటిగా ఉంటారని, గతంలో శౌర్య పతాకం అందుకున్నట్లు సమాచారం.



బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాసరావు

## తల్లి పాలతో వ్యాధినిరోధక శక్తి

బల్లికురవ, ఆగస్టు 5 : తల్లి పాలు తాగిన బిడ్డల్లో వ్యాధినిరోధక శక్తి అధికంగా ఉంటుందని సంతమాగులూరు ఐసీడీఎస్ సీడీపీవో సుధ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కొప్పెరపాడు సెక్టార్ పరిధిలో ఉన్న 20 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో తల్లులకు తల్లి పాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. సీడీపీవో సుధ మాట్లాడుతూ ముర్రు పాలు బిడ్డకు మొదటి టీకా అన్నారు. క్రమం తప్పకుండా ఆరు మాసాల తల్లి పాలు తాగించడం వలన పిల్లలు ఆరోగ్యంగా జీవిస్తారన్నారు. అనంతరం పిల్లలకు పాలు పట్టిస్తామంటూ తల్లులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ సలోమి పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న తల్లులు

# రైతులకు 9 గంటల కరెంట్

ఈఈ మస్తాన్‌రావు



రైతులతో మాట్లాడుతున్న అద్దంకి డీవిజన్ ఈఈ మస్తాన్‌రావు, డీఈఈ సురేంద్రబాబు

బల్లికురవ, ఆగస్టు 5 : పంటలు సాగు చేస్తున్న రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను 9 గంటల పాటు అందిస్తామని ఎక్కడైనా లోపాలుంటే వెంటనే తమ దృష్టికి తీసుకు రావాలని విద్యుత్ శాఖ అద్దంకి డివిజన్ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు తెలిపారు. సోమవారం బల్లికురవ సబ్‌స్టేషన్ ఆవరణలో మార్టూరు డీఈఈ ఎం.సురేంద్రబాబు, మండల ఏఈ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విద్యుత్ అదాలత్ కార్యక్రమం జరిగింది. పలు గ్రామాల నుంచి వచ్చిన రైతులు వ్యవసాయ విద్యుత్ లైన్ల సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చారు. కొన్ని చోట్ల తీగలు నేలజారి ఉన్నాయని కొన్ని చోట్ల ట్రాన్స్‌ఫార్మర్‌లు చోరీ కాగా, కొత్తవి రాలేదని, కొన్ని చోట్ల డీడీలు కట్టి నెలలు గడుస్తున్నా కొత్త లైన్లు ఏర్పాటు చేయలేదని కొందరు వ్యవసాయ విద్యుత్ లైన్లు మర్మతులకు గరవుతున్నాయని ఫిర్యాదులు చేశారు. ఈ సందర్భంగా ఈఈ మస్తాన్‌రావు మాట్లాడుతూ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సహకారంతో గ్రామాలలో విద్యుత్ లైన్లను పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపడతామన్నారు. రైతులు కూడా తమకు సహకరించాలన్నారు. కొన్ని గ్రామాలలో ఇప్పటికే ప్రత్యేక త్రిఫేజ్ విద్యుత్ లైన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. రైతులు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం సిబ్బందికి ఎవరూ నగదు ఇవ్వాల్సిన పని లేదన్నారు. వరుస క్రమంలో డీడీలు చెల్లించిన రైతులకు వ్యవసాయ లైన్లు ఏర్పాటు చేయిస్తామన్నారు. పొలాల్లో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలు ఎక్కువయ్యాయని, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పలు గ్రామాల రైతులు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

# దుకాణాలకు ఇప్పటికే రెండు సార్లు వేలం

శింగరకొండ దేవస్థానం ఈవో సుభద్ర

అద్దంకి, ఆగస్టు 5 : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం వద్ద దాతల సహకారంతో నిర్మించిన దుకాణాలలో వ్యాపారాలు నిర్వహించుకునేందుకు ఇప్పటికే రెండు సార్లు టెండర్‌లు పిలిచి వేలంపాటలు నిర్వహించామని దేవస్థానం ఈవో, అసిస్టెంట్ కమిషనర్ సుభద్ర సోమవారం ప్రకటనలో తెలిపారు. ఆంధ్రజ్యోతిలో సోమవారం ప్రచురితమైన అధికారుల నిర్లక్ష్యం కథనంపై ఈవో సుభద్ర వివరణిచ్చారు. దేవాలయం పునఃనిర్మాణంలో ఉన్నందున దుకాణాలు అద్దెకు తీసుకునేందుకు వ్యాపారులు ఆసక్తి చూపడం లేదని, అయినప్పటికీ దేవస్థానం తరపున ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. దేవస్థానం ఎదురుగా అనధికారికంగా వ్యాపారం నిర్వహించే వ్యక్తులు, తోపుడు బండ్లు నిర్వహించే వారిని తొలగించాలని పోలీస్‌లకు ఫిర్యాదు చేసినప్పటికీ ఇంకా తొలగించలేదని తెలిపారు. దేవస్థానానికి సంబంధించిన షాపులలో పూజా సామగ్రి ఎక్కువ ధరలకు అమ్మకాలు చేయడంపై ఇంత వరకు ఎలాంటి లిఖిత పూర్వక ఫిర్యాదు చేయలేదని తెలిపారు.



హాలును పరిశీలిస్తున్న జేసీ సుబ్బారావు తదితరులు

## ఫంక్షన్ హాలును పరిశీలిస్తున్న జేసీ

చీరాల, ఆగస్టు 5 : జాతీయ చేనేత దినోత్సవం నేపథ్యంలో ఈనెల 7వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు చీరాలకు వస్తున్నారు. ఈ నేపథ్యంలో మండల పరిధిలోని జాండ్రపేట ఫంక్షన్ హాలును సోమవారం జాయింట్ కలెక్టర్ సుబ్బారావు, ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి, ఇన్‌చార్జి డీఎస్పీ జగదీష్‌నాయక్ తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ స్థానిక అధికారులకు పలు సూచనలు చేశారు.

## మెగా జాబ్‌మేళాను వినియోగించుకోవాలి

చీరాలటౌన్, ఆగస్టు 5 : చీరాల పట్టణంలోని వైఏ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి అధికారి కె.రఘు తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఇంటర్వ్యూలు జరుగుతాయని చెప్పారు. పీజీ, ఎంబీఏ, బీటెక్, డిగ్రీ, ఇంటర్, ఐటీఐ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. 18 నుంచి 35 సంవత్సరాల లోపు నిరుద్యోగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. అభ్యర్థులు నేరుగా జిరాక్స్ కాపీలతో హాజరు కావాలన్నారు. వివరాలకు 9866 822 697, 87907 90762 నంబర్‌లను సంప్రదించాలని కోరారు.



భగవద్గీతపై ప్రచారం చేస్తున్న ప్రబోధ ప్రతినిధులు

## శ్రీకృష్ణుడు అవతార పురుషుడు

పంగులూరు, ఆగస్టు 5 : దేవుడే మనిషిగా రూపంలో వచ్చిన అవతార పురుషుడు శ్రీకృష్ణ భగవానుడని త్రైత సిద్ధాంతం - ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక కమిటీ అధ్యక్షుడు మడియం పెద్దిరెడ్డి అన్నారు. త్రైత సిద్ధాంత భగవద్గీత, కృష్ణాష్టమి ప్రాధాన్యతలను వివరిస్తూ నరసరావుపేటకు చెందిన ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక ప్రతినిధులు సోమవారం మండలంలోని పంగులూరు, కొండమూరు, బైటమంజులూరు గ్రామాలలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎలిశెట్టి రమేష్, పగడాల రామయ్య, కాటం పోతురాజు, చల్లగుండ్ల భాస్కరరావు, కుంచాల చిన వెంకయ్య, కోవూరి వెంకటేశ్వర్లు, అశోక్, అమరలింగయ్య రాజశేఖర్ పాల్గొన్నారు.

## అమ్మ ఆశ్రమానికి విరాళం

మార్టూరు, ఆగస్టు 5 : అమ్మ ఆశ్రమ నూతన భవన నిర్మాణానికి విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావుల బాపయ్య రూ.25వేల విరాళాన్ని సోమవారం ఆశ్రమం అధ్యక్షుడు గుంటుపల్లి చందుకు అందచేశారు. అలాగే విశ్రాంత ఉపాధ్యాయుడు ఊర మస్తానయ్య సుబ్బాయమ్మ దంపతు ఆశ్రమంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

## జోరుగా చిత్తు బొమ్మ ఆట

వలపర్లలో అర్ధరాత్రి యువకులు పందేలు

మార్టూరు, ఆగస్టు 5 : వలపర్ల గ్రామంలో సినిమా హాలు సెంటర్ సమీపంలో రాత్రి సమయంలో యువకులు జోరుగా చిత్తు బొమ్మ ఆట (జూదం) ఆడుతున్నారు. పదులు, వందలు స్థాయిలో ఆటలో పందేలు కాస్తున్నారు. ఈ సెంటర్ సమీపంలో సాయిబాబా గుడికి వెళ్లే దారిలో రోడ్డుపైన ఉన్న ప్రధాన ముఖద్వారం వద్ద రాత్రి 10 గంటల నుంచి ఆట మొదలవుతుంది. గ్రామంలోని ముఖ్యంగా రెండు సామాజిక వర్గాలకు చెందిన, ఈ ప్రదేశానికి సమీపంలోని కొంతమంది యువకులు జోరుగా ఆటలో మునిగితేలుతున్నారు. 20 రోజులుగా అర్ధరాత్రి దాటే వరకూ ఆట సాగుతున్నట్లు తెలిసింది. ఈ జూదంలో ఆడి యువకులు డబ్బులు పోగొట్టుకుంటున్నారు. ఆటకు వచ్చేవారంతా పేద, మధ్య తరగతివారే. ఇల్లు గడవడానికి మహిళలు కష్టపడుతుంటే యువకులు ఈ ఆటకు ఆకర్షితులై ఇంటిని గుల్ల చేస్తున్నారు. వేల వరకు పోగొట్టుకున్నట్లు సమాచారం. చేనేత కుటుంబానికి చెందిన వైసీపీ చెందిన యువకుడు జగన్ సీఎం అవుతారని రూ.45వేలు బెట్టింగ్‌లో పోగొట్టుకోగా, చిత్తుబొమ్మ ఆటలో రూ.50వేలు పోగొట్టుకున్నాడని కుటుంబ సభ్యులు వాపోతున్నారు. కొందరు యువకులు తమ ద్విచక్రవాహనాలను, ఇంట్లో చిన్న చిన్న బంగారు, వెండి ఆభరణాలను తాకట్టు పెట్టి జూదం ఆడుతుండగా, ఇంట్లో గొడవలు జరుగుతున్నాయి. జూదాలకు అడుకట్ట వేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాలేజీకి వెళ్లే రోడ్‌లో చెట్టు నీడన అరుగుపై పట్టపగలు జూదం ఆడుతున్నారు. పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

అద్దంకి, ఆగస్టు 5 : బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఈబీ ఎస్సై వి.సైమన్ తెలిపారు. ఆంధ్రజ్యోతిలో సోమవారం ప్రచురితమైన విచ్చలవిడిగా మద్యం బెల్ట్‌షాపులు అనే కథనంపై స్పందించిన ఎస్సై సైమన్ వివరణ ఇచ్చారు. బెల్ట్ షాపుల నిర్వాహకులు పట్టుబడితే కేసులు నమోదు చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బెల్ట్‌షాపుల గురించి ప్రజలు సమాచారం ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ మద్యం దుకాణాలలో సేల్స్‌మేన్‌లు, సూపర్‌వైజర్‌లు బెల్ట్ షాపులకు మద్యం అమ్మకాలు చేస్తే ఎక్సైజ్ శాఖ అధికారులు, సిబ్బంది ద్వారా దాడులు చేస్తామని తెలిపారు.


## రోడ్డు ప్రమాదంలో కూలీ మృతి

మరొకరికి తీవ్ర గాయాలు



చిట్టిబాబు మృతదేహం

అద్దంకి, ఆగస్టు 5 : రోడ్డు ప్రమాదంలో రాజమండ్రి ప్రాంతానికి చెందిన కూలీ మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం రఘుదేవపురానికి చెందిన జె.చిట్టిబాబు (32), హరిబాబు అద్దంకి మండలం చక్రాయపాలెం వద్ద పొగనారు మళ్ల వద్ద పనిచేసేందుకు వచ్చారు. సోమవారం సాయంత్రం చ క్రాయపాలెం నుంచి అద్దంకి వచ్చేందుకు మోపెడ్‌పై నామ్ రోడ్డులో హైస్కూల్ వద్ద మలుపు తిరుగుతుండగా పిడుగురాళ్ల వైపు నుంచి అద్దంకి వైపు వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చిట్టిబాబు అక్కడికక్కడే మృతి చెందగా, హరిబాబుకు తీవ్ర గాయాలయ్యాయి. హరిబాబును 108లో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి అనంతరం మెరుగైన చికిత్స కోసం ప్రైవేటు వాహనంలో ఒంగోలు తరలించారు.




## నేటి నుంచి 'హర్ ఘర్ తిరంగ'

**నెల్లూరు (హరనాథపురం) :** ఆజాది కా అమృత్ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం నుంచి 13వ తేదీ వరకు జిల్లాలో హర్ ఘర్ తిరంగ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఆనంద్ ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఎగ్జిబిషన్, బుధవారం ర్యాలీలు, 8న డ్రాయింగ్, పెయింటింగ్, చర్చా వేదికలు, పోస్టర్ మ్యాకింగ్ తదితర అంశాలపై పోటీలు ఉంటాయని తెలిపారు. 9న సాంస్కృతిక కార్యక్రమాలు, 10న స్వాతంత్ర్య సమరయోధుడు వీవీ గిరి జయంతి నిర్వహణ, సాయంత్రం హారతులు, 11న వారసత్వ నడకలు, 12న క్రీడాపోటీలు, 13న జాతీయ పతాకంతో సెల్ఫీలు తీసుకోవడం వంటి కార్యక్రమాలు ఉంటాయని, ప్రతి ఇంటిపై మువ్వన్నెల జెండాను రెపరెపలాడించాలని ప్రజలను కోరారు.

# మేమూ మీ వాళ్లమే సార్!

- మళ్లీ మాకు అవకాశం ఇవ్వండి
- మంత్రులు, ఎమ్మెల్యేల చుట్టూ వివాదాస్పద అధికారులు
- జిల్లాలో తిష్ఠ వేసేందుకు వైసీపీ వీరభక్తుల ప్రయత్నాలు
- ఇప్పటికే పలువురికి లభించిన హామీ!
- జిల్లాస్థాయి అధికారుల బదిలీలపై కొలిక్కిరాని కసరత్తు

**'మేమంతా మీ వాళ్లమే సార్.. వైసీపీ ప్రభుత్వంలో అప్పటి మంత్రులు, ఎమ్మెల్యేలు మా గొంతుమీద కత్తిపెట్టి మాచేత తప్పులు చేయించారే తప్ప మేము ఉద్దేశపూర్వకంగా ఏమీ చేయలేదు. జిల్లాలోనే పని చేసేందుకు మళ్లీ మాకు అవకాశమివ్వండి.. మీరు చెప్పినట్లు వింటాం..' అంటూ పలువురు వివాదాస్పద అధికారులు, వైసీపీ వీరభక్త అధికారులు ప్రస్తుత మంత్రులు, ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల బదిలీలు పూర్తికావడంతో ఆర్డీవోలు, డీఎస్పీలు, జిల్లా స్థాయి పోస్టులపై కసరత్తులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో కొందరు జిల్లాలో పాగా వేసేందుకు ఆర్థిక, రాజకీయ బలాన్ని ఉపయోగిస్తున్నారు. కీలకమైన పోస్టులకైతే విపరీతమైన డిమాండ్ ఏర్పడింది.**




**నెల్లూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) :** గత ప్రభుత్వంలో వివక్షకు గురైన సమర్థవంతమైన అధికారులకంటే కీలక పోస్టుల్లో పనిచేసి వైసీపీ భక్తులుగా ముద్ర వేసుకున్న అధికారులే ఇప్పుడు ఎక్కువగా మంత్రులు, ఎమ్మెల్యేల ఇళ్ల వద్ద దర్శనమిస్తున్నారు. ఇప్పటికే రెండు దఫాలు జరిగిన జిల్లాలోని మంత్రులు, ఎమ్మెల్యేల ఉమ్మడి సమావేశంలో జిల్లాస్థాయి పోస్టుల వ్యవహారం చర్చకు వచ్చింది. కానీ అన్ని పోస్టులపై ఏకాభిప్రాయం కుదరలేదని సమాచారం. కీలకమైన జడ్పీ సీఈవో, డీఆర్డీఏ పీడీ, డీపీవో, డ్వామా పీడీ, సివిల్ సప్లయిస్ డీఎం వంటి పోస్టులకు సంబంధించి కొందరు అధికారులకు లెటర్లు ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. అయితేగత ప్రభుత్వంలో విచ్చలవిడిగా పనిచేసిన అధికారులు కూడా ఈ జాబితాలో ఉండడం గమనార్హం. ఈ కోవలోనే మరికొంత మంది నుడా వీసీ, ఆర్డీవో వంటి కీలక పోస్టుల కోసం తీవ్రంగా ప్రయత్నాలు సాగిస్తున్నారు. అలానే ఇంజనీరింగ్ శాఖలైన ఇరిగేషన్, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్‌లలో కీలక ఎస్ఈ, ఈఈ పోస్టులకూ గట్టి పోటీ నెలకొంది.

### ● వీరభక్తులకు పోస్టింగిస్తారా?

పంచాయతీల పాలనలో జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) పోస్టు చాలా కీలకమైనది. సచివాలయాల వ్యవస్థ కూడా ఈ శాఖ పరిధిలోనే నడుస్తోంది. గత ఐదేళ్లలో పంచాయతీలు నిర్వీర్యమైపోయాయి. ఇప్పుడు పంచాయతీల పాలనపై ఎన్డీయే ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. ఈ సమయంలో ఓ వివాదాస్పద వైసీపీ వీర భక్త అధికారికి డీపీవో పోస్టు కట్టబెట్టేందుకు ప్రయత్నాలు జరుగుతు న్నట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వంలో ప్రకాశం జిల్లా జడ్పీ సీఈవోగా పని చేసిన సదరు అధికారి జడ్పీటీసీ ఎన్నికల్లో వైసీపీ వైపు ఏకపక్షంగా వ్య వహరించి అన్ని స్థానాలూ ఏకగ్రీవమయ్యేందుకు కృషి చేశారు. అలానే అక్కడ భారీగా నిధులు దుర్వినియోగం చేశారు. సా ర్వత్రిక ఎన్నికల్లోనూ వైసీపీకి అనుకూలంగా పని చేసేందుకు కుట్రలు చేసిన నేపథ్యంలో ఒంగోలులోని టీడీపీ నేతలు హైకోర్టును ఆశ్ర యించారు. దీంతో సదరు అధికారి సెలవుపై వెళ్లారు. ఇప్పుడు ఆ అధికారి జిల్లాకు వచ్చేందుకు మార్గం సుగమం చేసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. అలానే ఇద్దరు డీఎల్‌డీవో స్థాయి అధికారులు కూడా కీలకమైన జడ్పీ సీఈవో, డీఆర్‌డీఏ పీడీ పోస్టులను రిజర్వు చేసుకున్నట్లు సమాచారం. ఈ ఇద్దరు నాడు విచ్చలవిడిగా వ్యవహరించారు. ఓ అధికారి తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తడంతో ఎన్నికలకు ముందు ఉన్నతాధికారులు బదిలీ చేశారు. ఇ ప్పుడు మళ్లీ వారు జిల్లాలో తిష్ఠ వేసేం దుకు ప్రయత్నాలు సాగిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో పనిచేస్తున్న మరో వివాదాస్పద వైసీపీ వీరభక్త అధికారి నుడా వీసీ పోస్టులో కూర్చునేందుకు గట్టిగా ప్రయత్నాలు సాగించారు. ఇద్దరు ఎమ్మెల్యేల మద్దతు కూడా సంపాదించినట్లు సమాచారం. అయితే ఉమ్మడి సమావేశంలో ఈ ప్రతిపాదనను మంత్రి పొంగూరు నారాయణ తోసిపుచ్చినట్లు తెలిసింది.

### ● భిన్నంగా ప్రభుత్వ ఆలోచన

ఆర్డీవో, డీఎస్పీ, జిల్లాస్థాయి వంటి కీలక పోస్టుల విషయంలో ప్రభుత్వ ఆలోచన భిన్నంగా ఉంది. గత ప్రభుత్వంలో వివక్షకు గురైన సమర్థవంతమైన అధికారులకే తొలి ప్రాధాన్యం ఇవ్వాలని ఇప్పటికే మంత్రులు, ఎమ్మెల్యేలకు సూచించింది. జిల్లా నుంచి మంత్రులు, ఎమ్మెల్యేలు ఉమ్మడిగా నిర్ణయించి కొందరి అధికారుల పేర్లు ప్రతిపాదించినా ప్రభుత్వ స్థాయిలో ఈ జాబితాపై స్క్రూటినీ జరుగుతోందని సమాచారం. డీఎస్పీ, సీఐల పోస్టింగ్‌లే ఇందుకు ఉదాహరణగా చెప్పుకుంటున్నారు. ప్రతి ఎమ్మెల్యే వారి పరిధిలోని పోస్టులకు సంబంధించి కొన్ని పేర్లను ప్రతిపాదించారు. కానీ ఇది జరిగి నెల రోజులు గడుస్తున్నా ఇంత వరకూ ప్రభుత్వ స్థాయిలో ఫైనల్ కాకపోవడం గమనార్హం. ఈ జాబితాలో కొందరు వైసీపీతో అంటకాగిన డీఎస్పీలు, సీఐలు కూడా ఉండడంతోనే పోస్టింగ్‌లు ఆలస్యమవుతున్నట్లు పోలీసు శాఖలో చర్చించుకుంటున్నారు. నాలుగు రోజుల క్రితం ఎటువంటి వివాదాలు లేని కొంత మందికి మాత్రమే పోస్టింగ్ ఇవ్వడం గమనార్హం.

---

## పోర్టు, రైల్వేలైన్‌కు

# భూసేకరణ వేగం పెంచండి

● ఫిషింగ్ హార్బర్ త్వరగా పూర్తి చేయాలి ● కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు ఆదేశం



కలెక్టర్ల సమావేశంలో దిశానిర్దేశం చేస్తున్న సీఎం, డిప్యూటీ సీఎం, పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఆనంద్


**నెల్లూరు (ఆంధ్రజ్యోతి), ఆగస్టు 5 :** జిల్లాలోని రామాయపట్నం పోర్టు, నడికుడి-శ్రీకాళహస్తి రైల్వేలైన్ నిర్మాణానికి భూసేకరణలో వేగం పెంచాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. రాష్ట్ర రాజధాని అమరావతిలో సీఎం అధ్యక్షతన సోమవారం జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌కు జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ హాజరయ్యారు. ఎన్డీఏ ప్రభుత్వ ప్రాధాన్యాలు, లక్ష్యాలను ఈ సందర్భంగా కలెక్టర్లకు ముఖ్యమంత్రి వివరించారు. పాలనలో వ్యవహరించాల్సిన తీరు, చేపట్టాల్సిన ప్రాధాన్య అంశాలపై దిశ నిర్దేశం చేశారు. కాగ ఈ కాన్ఫరెన్స్‌ను జిల్లాలో ఉన్నతాధికా రులంతా వీక్షించారు. నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వీడియోకాన్ఫరెన్స్‌కు అధికారులంతా హాజరై ముఖ్యమంత్రి సందేశాన్ని తిలకించారు. జిల్లాలోని పోర్టు, రైల్వేలైను భూసేకరణతోపాటు ఫిషింగ్ హార్బర్ నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 2047 నాటికి ప్రపంచంలో ఏపీ నెంబర్‌వన్‌గా ఉంటుందని సీఎం తెలిపినట్లు కలెక్టర్ వెల్లడించారు. అనంతరం శాంతిభద్రతలపై జరిగిన చర్చలో కలెక్టర్‌తోపాటు ఎస్పీ కృష్ణకాంత్ పాల్గొన్నారు.

---

# తల్లికి వందనం..

# పిల్లల్లో సంబరం!

**పేద విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులతో చదువు మానేయకూడదని ఉద్దేశంతో అమ్మఒడి పథకాన్ని అమలు చేస్తున్నామని గత వైసీపీ ప్రభుత్వం నమ్మబలికింది. పథకం ప్రారంభం నుంచి ఏటా కొత్త నిబంధనలు పెట్టి లబ్ధిదారుల సంఖ్యను కుదించుకుంటూ వచ్చింది. అర్హులకు సైతం పూర్తి స్థాయిలో నగదు విడుదల చేయకుండా కాలయాపన చేసింది. అయితే ప్రస్తుత ఎన్డీఏ కూటమి ప్రభుత్వం 'తల్లికి వందనం' పేరుతో ఈ పథకాన్ని అమలు చేసేందుకు రంగం సిద్ధం చేసింది. ఇచ్చిన హామీ మేరకు కుటుంబంలో చదువుకునే పిల్లలందరికీ పథకం వర్తింపచేయడంతోపాటు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదివేవారంతా అర్హులని ప్రకటించింది. దీంతో గతంలో కంటే లబ్ధిదారుల సంఖ్య గణనీయంగా పెరగనున్నదని విద్యాశాఖాధికారులు అంచనా వేస్తున్నారు.**




**నెల్లూరు (విద్య), ఆగస్టు 5 :** జిల్లాలో అన్ని మేనేజ్‌మెంట్‌లు కలిపి మొత్తం 4,531 పాఠశాలల్లో 4 లక్షల మంది విద్యార్థులు, అన్ని మేనేజ్‌మెంట్‌లకు సంబంధించిన 215 కళాశాలల్లో 50 వేల మంది ఇంటర్ విద్యార్థులు ఉన్నారు. గత ప్రభుత్వ హయాంలో అమ్మఒడి ప్రారంభించిన తొలి సంవత్సరం (2019-20)లో లబ్ధిదారుల ఎంపికకు తెల్లరేషన్‌కార్డు, ఆధార్ కార్డులనే ప్రామాణికంగా తీసుకున్నారు. ఎంపిక చేసిన 2,20,607 మందికి రూ.15వేల చొప్పున నగదు జమచేశారు. 2021-22లో మాత్రం జిల్లాలో 3,75,849 మందిని లబ్ధిదారులుగా గుర్తించగా, వీరిలో 81,561 మందిని అనర్హులుగా ప్రకటించారు. మరో 6,698 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని చెప్పారు. 2,43,497 మందిని అర్హులుగా ఎంపిక చేసి, పాఠశాలల్లో పారిశుధ్యం పేరుతో ఒక్కో లబ్ధిదారుడికి వెయ్యి రూపాయలను తగ్గించి రూ.14వేల చొప్పున నగదు జమచేశారు. 2022-23లో ఈ జాబితాను మరింతగా వడబోసి 2,00,366 మందిని ఎంపిక చేశారు.ఆ విద్యా సంవత్సరంలో మూడుసార్లుగా నగదును ఖాతాల్లో జమచేశారు. 2023-24లో అసలు ఈ పథకం అమలు చేస్తారా.. లేదా ? అన్న సందేహాలు వ్యక్తం కాగా, నిబంధనలను మరింత కఠినతరం చేశారు. లబ్ధిదారుల సంఖ్యను 1,94,842కి తగ్గించి నాలుగు విడతలే అమ్మఒడి నగదును అందచేశారు.

### ● మార్గదర్శకాలు ఇవిగో..

ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రకటించిన తల్లికి వందనం పథకాన్ని త్వరలోనే అమలు చేయనున్నారు. 2024-25 విద్యా సంవత్సరానికి ఈ పథకంతో పాటు స్టూడెంట్ కిట్ పొందడానికి ఆధార్ తప్పనిసరిగా ఉండాలని విద్యాశాఖ ప్రకటన జారీచేసింది. ఒకటి నుంచి ఇంటర్ వరకు చదివే విద్యార్థులంతా దరఖాస్తు చేసుకోవాలని అధికారులు తెలిపారు. విద్యార్థికి ఆధార్ లేకపోతే అది వచ్చే వరకు ఓటరు గుర్తింపుకార్డు, రేషన్‌కార్డు, పాస్‌పోర్టు, బ్యాంకు లేదా తపాలా పాస్‌బుక్, డ్రైవింగ్ లైసెన్స్ ఉపాధి పథకం కార్డు, కిసాన్ పాస్‌బుక్, వ్యక్తిని ధ్రువీకరిస్తూ గెజిటెడ్ అధికారి సంతకం చేసిన పత్రం, తహసీల్దారు ధ్రువీకరణ పత్రం.. ఇలా పదిరకాల పత్రాలను పరిగణలోకి తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఇప్పటికే స్టూడెంట్ కిట్ పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నామని, తల్లికివందనం పథకాన్ని కూడా ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తామని వారు పేర్కొన్నారు. విద్యార్థులంతా ఆధార్‌ను అప్‌డేట్ చేసుకోవాలన్నారు. ఎవరికైనా వేలిముద్రలు గుర్తించలేని స్థితిలో ఉంటే కనుపాపల ఆధారంగా గుర్తించనున్నామని విద్యాశాఖ అధికారులు పేర్కొన్నారు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈ పథకాన్ని వందశాతం అమలు చేసేలా చర్యలు చేపడుతున్నట్లు వారు తెలిపారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

### ● అనర్హులుగా 40 శాతం మంది

వైసీపీ ప్రభుత్వంలో పథకం అమలులో హాజరు కఠినతరం చేయడం, కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉన్నా ఒక్కరికే అమ్మఒడి ఇవ్వడం, ప్రభుత్వ శాఖల వద్ద ఉన్న సమాచారం ఆధారంగా సాంకేతికతను జోడించి జాబితాను వడపోసింది. దీంతో మొత్తానికి జిల్లాలో 40శాతం మంది విద్యార్థులపై అనర్హత వేటు వేసింది. జిల్లావ్యాప్తంగా సచివాలయాల్లోని అమ్మఒడి జాబితాల్లో తొలగింపులు, తిరస్కరణలు, బ్యాంకుల వద్ద పడిగాపులతో పథకం అంతా గందరగోళంగా మారింది. వీటికి తోడు అన్నీ అర్హతలు ఉన్నా కూడా చివరన అకౌంట్లు ఇన్‌యాక్టివ్ చేయడంతో తల్లిదండ్రులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

---

## మిర్చి రైతుకు

# నష్టాల ఘాటు!

**ఎర్ర బంగారం మంటూ రైతులు ముద్దుగా పిలుచుకునే మిర్చి ధర భారీగా పతనమైంది. దశాబ్ద కాలంలో ఎన్నడూ లేనిరీతిలో ధరలు పతనమై నష్టాల ఘాటు చూపుతుండటంతో రైతులు దిక్కుతోచని స్థితిని ఎదుర్కొంటున్నారు. తెగుళ్లు, వైరస్‌లు విపరీతంగా పెరిగిపోయినా రూ.లక్షలకు లక్షలు పెట్టుబడులు పెట్టి ప్రకృతికి ఎదురొడ్డి కొన్నేళ్లుగా మిర్చిని పండిస్తున్నారు. అయితే, రెండేళ్లుగా జెమినీ వైరస్, తామర పురుగుల దాడితో రైతులు మిర్చి సాగుకు మహాయజ్ఞమే చేస్తున్నారు. ఎకరానికి రూ.3-4 లక్షలు పెట్టుబడి పెట్టి రేయింబవళ్లు శ్రమించి మిర్చి పండిస్తున్నారు. అయినా ఎంతో కొంత లాభం వస్తుండటంతో నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో కొన్నేళ్లుగా మిర్చి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతూ వస్తోంది. మూడేళ్లుగా కేవలం కందుకూరు నియోజకవర్గంలోనే ఏటా సరాసరిన 4వేల ఎకరాలలో మిర్చి సాగవుతూ వస్తోందంటే ఏ స్థాయిలో మిర్చి సాగు విస్తీర్ణం పెరిగిందో అర్థం చేసుకోవచ్చు. మిర్చి సాగు విస్తీర్ణం పెరగడంతో కూలీలకు కూడా మంచి ఉపాధినిస్తోంది. అయితే అనూహ్యంగా ఈ ఏడాది మిర్చి ధర భారీగా పతనం కావటంతో రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ ప్రభావం రానున్న సీజన్‌లో మిర్చి సాగువిస్తీర్ణంపై పడే అవకాశం ఉండనుంది.**

- భారీగా పతనమైన ధర
- క్వింటం రూ.23వేల నుంచి 18వేలకు తగ్గుదల
- రానున్న సీజన్‌లో పంట సాగుపై ప్రభావం

**కందుకూరు, ఆగస్టు 5 :** కందుకూరు ప్రాంతంలో సాగయ్యే మిర్చిలో 90 శాతంపైగా తేజ రకం సాగవుతుండగా డీడీ, నెంబరు 5, సూపర్ 10, సింజెంటా తదితర రకాల మిర్చి కేవలం 10 శాతం విస్తీర్ణంలో సాగవుతోంది. కందుకూరు, కావలి ప్రాంత తేజ రకానికి గుంటూరు మిర్చి మార్కెట్‌లో కూడా ప్రత్యేక గుర్తింపు ఉండటం ఈ ప్రాంత సరుకు నాణ్యమైనది కావటంతో క్వింటాల్‌కు వెయ్యి రూపాయల వరకు అదనంగా కూడా చెల్లించేందుకు వ్యాపారులు ముందుకొచ్చి పోటీ పడుతుంటారు. ఈ పరిస్థితుల్లో గత పంట కాలంలో మార్చి, ఏప్రిల్, మే నెలల్లో క్వింటం రూ. 23వేలు వరకు పలికిన మిర్చిని రైతులు అమ్ముకునేందుకు ఇష్టపడక శీతల గిడ్డంగిలలో నిల్వ చేశారు. అంతకముందు సంవత్సరాలలో క్వింటం రూ.28వేల వరకు ధర పలికింది. అంతే ధర వస్తుందన్న ఆశతో రైతులు కోల్డ్ స్టోరేజీలలో నిల్వచేశారు. అయితే 2 నెలలుగా ధరలు పతనమై ప్రస్తుతం అత్యంత నాణ్యమైన మిర్చి క్వింటం రూ. 18వేలకు మించి కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ముందుకు రావటం లేదు. అధికశాతం రైతులు తమ ఉత్పత్తులతోపాటు సహచర రైతుల వద్ద అప్పట్లో ఉన్న ధర ప్రకారం కొనుగోలు చేసి మరీ కోల్డ్‌స్టోరేజీలలో నిల్వ చేశారు. కోల్డ్ స్టోరేజీలలో నిల్వచేసుకునే సమయంలో ఉన్న ధరతో పోలిస్తే క్వింటాంకు రూ.5వేలు, అంతక ముందు సంవత్సరం లభించిన ధరతో పోలిస్తే క్వింటంకు రూ.10వేలు ధర పతనమైంది. దీంతో నిల్వచేసిన రైతులు దిక్కుతోచని స్థితిని ఎదుర్కొంటున్నారు. కోల్డ్ స్టోరేజీల అద్దెలు, వడ్డీల రూపంలో క్వింటాల్‌కు మరో వెయ్యి రూపాయలు భారం తమపై పడిందని, ప్రస్తుతం అమ్మితే క్వింటంకు రూ.6-7 వేలు నష్టం వస్తుందని వాపోతున్నారు. తేజ రకం మిర్చి రైతుల పరిస్థితి ఇలా ఉంటే మిగిలిన రకాల ధరలు మరీ క్వింటం రూ. పదివేలు కూడా పలకని పరిస్థితి.



### ● సాగుపై ప్రభావం

మిర్చి ఎగుమతులతో డిమాండ్ ఏర్పడి ధరలు పెరగాల్సిన ఆగస్టు నెలలో కూడా ధరలు పతనమవుతుండటం, మరో ఏడాది అవసరాలకు తగినంత సరుకు కోల్డ్ స్టోరేజీలలో నిల్వ ఉందన్న అంచనాతో వచ్చే సీజన్‌లో రైతులు మిర్చి సాగుకు దూరంగా ఉండేందుకు సిద్ధపడుతున్నారు.

---

## ఎన్‌ఎంఎంఎస్‌కు దరఖాస్తుల ఆహ్వానం

**నెల్లూరు (విద్య), ఆగస్టు 5 :** 2024-25 విద్యా సంవత్సరానికి నేషనల్ మీన్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్)కు జిల్లాలోని 8వతరగతి చదువుతున్న విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, జడ్పీ, మున్సిపల్, ఎయిడెడ్, 8వ తరగతి నడపబడుతున్న ఎంపీపీ అప్పర్ ప్రైమరీ స్కూల్స్, వసతి సౌకర్యం లేని జిల్లా ఆదర్శ పాఠశాలల్లో 8వతరగతి చదువుతూ కుటుంబ ఆదాయం రూ.3.5 లక్షలలోపు ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. డిసెంబరు 8వ తేదీన జరిగే ఈ పరీక్షకు జనరల్, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50 చెల్లించి, సెప్టెంబరు 6వతేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో లేదా నగరంలోని దర్గామిట్ట జడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలోని పరీక్షల విభాగంలో సంప్రదించాలని కోరారు.

---

## ఇవన్నీ తుప్పుపాలేనా!?






అన్నదాత దరిచేరాల్సిన ట్రాక్టర్ పనిముట్లు ఇదిగో ఇలా పిచ్చిమొక్కల మధ్య తుప్పుపడుతున్నాయి. రైతులకు పంపిణీ చేసేందు కోసం ట్రాక్టర్, రోటావేటర్ తదితర వ్యవసాయ పనిముట్లను వింజమూరు సహకార సంఘం కార్యాలయ ఆవరణలో ఉంచారు. అయితే, లబ్ధిదారులకు పంపిణీ చేయకపోవడంతో రోజుల తరబడి ఇక్కడే ఉండిపోయాయి. ట్రాక్టర్ టైర్లను దొంగలు ఎత్తికెళ్లిపోయారు. ఇక ఉన్న అరకొర పనిముట్లను అలాగే వదిలేయడంతో ఎండకు ఎండి, వానకు తడిచి ఇదిగో ఇలా తుప్పుదుతున్నాయి. ఇప్పటికైనా వ్యవసాయ, సహకార సంఘ అధికారులు స్పందించి, ఉన్నవాటికి మరమ్మతులు చేయించి లబ్ధిదారులకు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

- వింజమూరు

# అధ్వానంగా గ్రామీణ రహదారులు

● రోడ్ల నిర్మాణాలు చేపట్టాలంటున్న వాహనదారులు, ప్రయాణికులు

**వరికుంటపాడు, ఆగస్టు 5:** మండలంలోని తిమ్మారెడ్డిపల్లి- గణేశ్వరాపురం, తొడుగుపల్లి- నార్త్ కొండాయపాళెం, జడదేవి- తూర్పు చెన్నంపల్లి, పెద్దిరెడ్డిపల్లి- పామూరుపల్లి ప్రధాన రహదారులతో పాటు జీ.కొత్తపల్లి, నల్లబోతుల వారిపల్లి, సాతువారిపల్లి, కొండ్రాజుపల్లి, జంగంరెడ్డిపల్లి, రామాపురం, కాకొల్లువారిపల్లి గ్రామాల అంతర్గత రహదారులు మరమ్మతులకు నోచుకోక అధ్వానంగా ఉన్నాయి. కొన్నేళ్ల కిందట నిర్మించిన రోడ్లు కావడంతో చిద్రమై పోయాయి. రాళ్లు, రప్పలు తేలడంతో వాహనదారులకు ప్రయాణం నరక ప్రాయంగా మారింది. కొన్నిగ్రామాల రోడ్లు ఇప్పటికీ తారురోడ్డుకు నోచుకోలేదు. చిన్నపాటి వర్షం కురిసినా రోడ్ల గుంతల్లో నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. అత్యవసర సమయాల్లో అద్దె వాహనదారులను గ్రామాలకు పిలిచినా వారు వచ్చేందుకు సముఖత చూపడం లేదు. రాత్రి సమయంలో అటువైపు వెళ్లే వాహనదారులు గమ్యం చేరేంత వరకు అడుగడుగునా అంతరాయం ఎదుర్కోవాల్సి వస్తుందని గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి రోడ్ల మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



తొడుగుపల్లికి వెళ్లే రోడ్డు దుస్థితి

## దరఖాస్తుల ఆహ్వానం

**ఏఎస్ పేట, ఆగస్టు 5:** హసనపురం ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో 2024-25 విద్యా ఏడాది ఎలక్ట్రీషన్, ఫిట్టర్ ట్రేడులలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ షేక్ గౌస్‌బాషా తెలిపారు. 10వ తరగతి పాస్ అయిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఈ నెల 27వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 29న కౌన్సెలింగ్‌కు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో హాజరుకావాలన్నారు.

## పాఠశాల తనిఖీ

**ఉదయగిరి రూరల్, ఆగస్టు 5:** దుర్గంపల్లి ప్రాథమిక ప్రాథమిక పాఠశాలను సోమవారం ఎంఈవో-2 తోట శ్రీనివాసులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరుగుతున్న మనబడి- మన భవిష్యత్తు పనులు పరిశీలించారు. అనంతరం విద్యార్థుల ప్రగతిని, రిజిస్టర్లు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జాఫర్‌అహ్మద్, ఉపాధ్యాయుడు వెంకటరెడ్డి పాల్గొన్నారు.

## వీరబ్రహ్మేంద్రస్వామికి పూజలు

**ఆత్మకూరు, ఆగస్టు 5:** స్థానిక హనుమాన్ జంక్షన్ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉభయ దాతలు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. .

## ముగిసిన గంధోత్సవం

**ఉదయగిరి రూరల్, ఆగస్టు 5:** స్థానిక సయ్యద్ అబ్దుల్ ఖాదర్‌ఖాన్ సాహెబ్ ఖాదరీ ఔలియా గంధోత్సవం సోమవారం తహలీల్ ఫాతెహా కార్యక్రమంతో ముగిసింది. స్వామివారికి మస్తఫాఅలీఖాన్ సాహెబ్ కుటుంబ సభ్యులు గలీఫ్ ఫాతెహా నిర్వహించి ప్రార్థనలు చేపట్టారు. పూజల్లో హిందూ, ముస్లింలు అధికసంఖ్యలో పాల్గొన్నారు. నిర్వాహకులు భక్తుల సౌకర్యార్థం అన్నదానం చేశారు.

## వాగుభూమి ఆక్రమణపై ఫిర్యాదు

**సీతారామపురం, ఆగస్టు 5:** గ్రామంలోని తమ ఇళ్ల సమీపంలో ఉన్న వాగు పోరంబోకు భూమిని గ్రామానికే చెందిన కొంతమంది వ్యక్తులు ఆక్రమించి అందులో జామాయిల్ మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కొయ్యలపాడు ఎస్సీకాలనీవాసులు తెలిపారు. ఈ విషయంపై సోమవారం వారు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ భూమి ఆక్రమణకు గురికాకుండా చూడాలని వారు వినతిలో పేర్కొన్నారు.

## ఉపాధి హామీ పనుల తనిఖీ

**సీతారామపురం, ఆగస్టు 5:** మండలకేంద్రంలో జరుగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనులను సోమవారం టెక్నికల్ అసిస్టెంట్ మురళీకృష్ణ పరిశీలించారు. కూలీలు చేయు పనులు, మస్టర్లను తనిఖీ చేశారు. అనంతరం ఎంత పనిచేయాలో కొలతలు వేసి చూపించారు. ఉదయం 6.30 నుంచి 11గంటల వరకు పనిచేస్తే రోజుకు రూ.300ల వేతనం వస్తుందన్నారు. అనంతరం మాస్టర్‌లోని పేర్లు చదువుతూ వచ్చిన వారికి హాజరు వేశారు.

## వరి పొలాల పరిశీలన

**చేజర్ల, ఆగస్టు 5:** పెరుమాకళ్లపాడు సమీపంలోని వరి పొలాలను సోమవారం మండల వ్యవసాయాధికారి శశిధర్ పరిశీలించారు. ఎడగారు సీజన్‌లో పండించిన వరిలో ఎక్కువగా నల్లి ఆశించిందన్నారు. నివారణకు ఒబేరియన్ అనే మందును ఎకరాకు 100ఎమ్ఎల్ చొప్పున పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో వెంకటేశ్వర్లు, వీపీఏ బ్రహ్మేంద్ర, రైతులు పాల్గొన్నారు.

## సాగునీటి వనరులపై ఆరా

**సంగం, ఆగస్టు 5:** మండలంలోని సాగునీటి వనరుల స్థితిగతులపై సోమవారం మండలస్థాయి ఫ్లడ్ బ్యాంక్ మేనేజ్‌మెంట్ టీమ్ సభ్యులు ఆరా తీశారు. అన్ని చెరువులు, కాలువల కట్టల పటిష్టత, తూములకు చేపట్టాల్సిన రక్షణ చర్యలు, ఆక్రమణలను పరిశీలించారు. నివేదికను తయారు చేసి కలెక్టర్‌కు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫ్లడ్ బ్యాంక్ మేనేజ్‌మెంట్ టీమ్ కన్వీనర్ ఏఈ బీవీ కృష్ణ, సభ్యులు డిప్యూటీ తహసీల్దారు సుభాషిణి, ఎస్ఐ నాగార్జునరెడ్డి, సర్వేయర్ పాల్గొన్నారు

## స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలపై అవగాహన

**సంగం, ఆగస్టు 5:** స్థానిక వెలుగు కార్యాలయంలో సోమవారం మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలపై ఎంఈవో జానికీరామ్ అవగాహన కల్పించారు. ఈ నెల 8న జరుగనున్న ఎస్‌ఎంసీ కమిటీ ఎన్నికపై విధివిధానాలను వివరించారు. కార్యక్రమంలో ఎంఈవో -2, జిల్లా రిసోర్స్‌పర్సన్ వెంకటేశ్వర్లు, హెచ్‌ఎం పాల్గొన్నారు.



## సమస్యలపై గిరిజనుల నిరసన

**చేజర్ల, ఆగస్టు 5:** తమ కాలనీల్లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని నూతక్కివారి కండ్రిక గ్రామపంచాయతీలోని గిరిజన కాలనీవాసులు డిమాండ్ చేశారు. ఈ విషయంపై సోమవారం వారు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎన్నికల్లో తాము తెలుగుదేశం పార్టీకి మద్దతు ఇచ్చామని వెలగని వీధి లైట్లకు సర్పంచ్ మరమ్మతులు చేపట్టడం లేదని మండిపడ్డారు. కాలనీల రహదారుల్లో మురుగునీరు పారుతున్నా పట్టించకోలేదన్నారు. ఇలాగే ఉంటే రోగాల బారినపడతామని ఉన్నతాధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు.



నిరసన వ్యక్తం చేస్తున్న నూతక్కివారికండ్రిక గిరిజనులు

## అటవీ సంపద అక్రమంగా తరలింపు



కలప తరలిస్తున్న ట్రాక్టర్

**వరికుంటపాడు, ఆగస్టు 5:** మండలంలోని గ్రామాల నుంచి నిబంధనలకు విరుద్ధంగా అటవీ సంపద అక్రమంగా తరలిపోతున్నా పట్టించుకొనే వారు కరువయ్యారు. జిల్లాకేంద్రానికి శివారు మండలం కావడంతో ఉన్నతాధికారుల తనిఖీలు ఉండవనే ధీమాతోనే కొంత మంది అధికారులు అక్రమ వ్యాపారులకు అండగా నిలుస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. అటవీ ప్రాంతాలతో పాటు ఇరిగేషన్, పంచాయతీల పరిధిలోని కంప చెట్లతో సహా వేప, తుమ్మ చెట్లను సైతం నరుకుతూ తీసుకెళుతున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా సమీపంలోని ప్రకాశం జిల్లాతో పాటు తమకు అనుకూలమైన బొగ్గు, ఇటుక బట్టీలకు తరలిస్తూ జేబులు నింపుకుంటున్నారు. స్థానికులు సమాచారం అందించిన సమయంలో అధికారులు తక్కువ మొత్తంలో జరిమానాలు విధించి చేతులు దులుపుకుంటున్నారు. ఉన్న తాధికారులు ప్రత్యేక నిఘా ఉంచి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## విద్యతోనే ప్రగతి సాధ్యం : ఎంపీపీ

**ఆత్మకూరు, ఆగస్టు 5:** విద్యతోనే ప్రగతి సాధ్యమని మండలాధ్యక్షుడు కేతా వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. సోమవారం పట్టణ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు విద్యాకిట్లను పంపిణీ చేశారు. ప్రభుత్వం అందజేసిన కిట్‌లో కాలేజీ బ్యాగ్, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు ఉంటాయన్నారు. జూనియర్ కళాశాలల్లో మెరుగైన విద్యనందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ తుమ్మల చంద్రారెడ్డి, కౌన్సిలర్ నూరా భాస్కర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ వాణి, అధ్యాపకులు ఉన్నారు.



ఆత్మకూరు: విద్యాకిట్‌ను అందజేస్తున్న ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి

## ఇంటర్ విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



ఉదయగిరి రూరల్: విద్యార్థులకు కిట్‌ను అందజేస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

**ఉదయగిరి రూరల్, ఆగస్టు 5:** పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లోని 335మంది విద్యార్థులకు సోమవారం అధ్యాపకులు పాఠ్య, నోట్ పుస్తకాలు, బ్యాగులు విద్యా సామగ్రిని అందశారు. ఇంటర్ విద్యార్థులకు ప్రభుత్వం పుస్తకాలు ఇవ్వడంతో తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

## తాటి చెట్టే కరెంట్ స్తంభం!

**మర్రిపాడు, ఆగస్టు 5:** రెండేళ్ల కిందట తన పొలంలో వేసిన కరెంట్ స్తంభం ఇరిగిపో యిందని దాని స్థానంలో మరో స్తంభంను ఏర్పాటు చేయాలని ఎన్నిసార్లు మండల ట్రాన్స్ కో అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని మర్రిపాడు గ్రామానికి చెందిన గంగినేని వెంకటేశ్వర్లు వాపోతున్నారు. ఈ విషయంపై మంగళవారం ఆయ న ఆంధ్రజ్యోతితో తమగోడు విన్నవిం చుకున్నాడు. సర్వీస్ నెంబర్ 567తో తనకు విద్యుత్ కనెక్షన్ ఉందని, తన పొలానికి కరెంట్ సరఫరా తీసుకున్నపుడు ఏర్పాటు చే సిన స్తంభం విరిగిపోయిందన్నారు. అప్పటినుంచి మరో స్తంభంను ఏర్పాటు చేయాలని ఎన్ని సార్లు సబ్‌స్టేషన్, అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోవడం లేదన్నారు. చేసేదిలేక ప్రత్యా మ్నాయంగా అందుబాటులో ఉన్న తాటిచెట్టుకు కేబుల్ వైరును కట్టుకొని తద్వారా మోటర్ న డుపుకుంటూ ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. వర్షాకాలంలో తీగలకు ఏదైనా అర్త్ వస్తే చె ట్టుకు, తడిసిన పొలానికి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు.



తాటి చెట్టుకు కట్టిన కేబుల్ వైరు

## విధుల్లో చేరిన తహసీల్దార్లు

**చేజర్ల ఆగస్టు 5:** మండల తహసీల్దార్‌గా ఏవీ రమణారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో అనంతసాగరం, జలదంకి మండలాల తహసీల్దారుగా పనిచేస్తూ ఎన్నికల నేపథ్యంలో అమరావతికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా తహసీల్దారు రమణారావు మాట్లాడారు. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యం ఇస్తామన్నారు. పెండింగ్‌లో భూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

**దుత్తలూరు(ఉదయగిరి రూరల్):** మండల తహసీల్దారుగా యనమల నాగరాజు బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల విధుల్లో భాగంగా ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దారు యశోదను బదిలీ చేయడంతో ఆమె స్థానంలో నాగరాజు వచ్చారు. తహసీల్దారుకు ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ మండల కమిటీ సభ్యులు సన్మానించి అభినందనలు తెలిపిపారు. కార్యక్రమంలో సంఘాల నాయకులు గొల్లపల్లి శ్రీనివాస్, యద్దనపూడి రమణయ్య, గొల్లపల్లి మోహన్‌రావు పాల్గొన్నారు.

**వింజమూరు:** మండల తహసీల్దార్ హమీద్ బాధ్యతలు స్వీకరించారు. రెవెన్యూలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించే దిశగా ముందుకు సాగాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు.

## గవర్నర్ కార్యదర్శిని కలిసిన స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

**ఉదయగిరి రూరల్, ఆగస్టు 5:** రాష్ట్ర గవర్నర్ సెక్రటరీ డాక్టర్ ఎం.హరిజవహర్‌లాల్‌ను సోమవారం రాజ్‌భవనలో రాష్ట్ర స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. స్వచ్ఛంద సేవాసంస్థలు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటు పడాలని, రైతులను సేంద్రీయ వ్యవసాయం వైపు మళ్లించాలని సూచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల అధ్యక్షుడు రమణయ్య, సభ్యులు ప్రకాష్, మామిడిపల్లి బాలగంగాధర్, వెంకటశ్రీనివాస్ తదితరులున్నారు.

## వైభవంగా బాలచౌడేశ్వరి గ్రామోత్సవం

**సంగం, ఆగస్టు 5:** స్థానిక రాళ్లచెలిక బాల చౌడేశ్వరిదేవికి ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు గ్రామోత్సవం నిర్వహించారు. .

## చాకలకొండ రాధాకృష్ణమూర్తికి ఘన నివాళి

**వింజమూరు, ఆగస్టు 5:** రాధాకృష్ణ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం రాధాకృష్ణమూర్తి వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పదో తరగతిలో అత్యధిక మార్కుల సాధించిన విద్యార్థులకు నగదుతో పాటు బహుమతిని అందజేశారు. పాఠశాలకు రూ.25వేల మైక్‌సెట్‌ను ఇచ్చారు. కార్యక్రమంలో చాకలకొండ సత్యనారా యణరావు, చెన్నయ్య, కృష్ణారెడ్డి, ఆనంద్, ప్రధానోపాధ్యాయులు రమేష్ ఉన్నారు.

# కావలి

## కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి



## శిథిల పాఠశాలలో చదువులా ?

**లింగసముద్రం, ఆగస్టు 5 :** మండలంలోని చినపవని ఎస్సీకాలనీ ప్రాథమిక పాఠశాల కొన్నేళ్లుగా శిథిలావస్థలో ఉంది. పాఠశాల గోడలు నెర్రెలివ్వడం, శ్లాబు పైకప్పు పెచ్చులూడి ఇనుప చువ్వలు బయటపడి వర్షం కురిస్తే ఉరుస్తోంది. వరండాలోనూ ఇదే పరిస్థితి. ఈ క్రమంలో వారం క్రితం సర్వశిక్ష అభియాన్ ఏఎంవో శాంతికుమారి, ఎంఈవో-2 శివకుమార్‌లు పాఠశాలను పరిశీలించారు. వర్షం కురిస్తే అందులో కూర్చోవద్దని హెచ్‌ఎంకు, విద్యార్థులకు సూచించారు. తగిన చర్యల కోసం ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తానని ఆమె తెలిపారు. వరండా పిల్లర్లు కూడా బలహీనంగా ఉన్నాయని గ్రామ టీడీపీ నాయకుడు పూరిమిట్ల మాల్యాద్రి చెప్పారు. ఈ విషయాన్ని ఆయన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన నెల్లూరులోని విద్యాశాఖ అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అయినా ఇంతవరకు ఇక్కడ ఎలాంటి చర్యలు తీసుకోలేదు.



శిథిలావస్థకు చేరిన చినపవని ఎస్సీ కాలనీ పాఠశాల

## తహసీల్దార్లు బాధ్యతల స్వీకరణ

**కావలి,ఆగస్టు5 :** తహసీల్దార్‌గా పీ. శ్రావణ్‌కుమార్ సోమవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల సమయంలో వచ్చిన నగేష్ సొంతజిల్లాకు వెళ్లటంతో ఆ స్థానంలో శ్రావణ్‌కుమార్ వచ్చారు. డీటీగా ఉంటూ సెలవులో ఉన్న ఆయనకు పదోన్నతినిచ్చి తహసీల్దార్‌గా నియమించారు.

**అల్లూరు :** తహసీల్దారుగా ఏ. లక్ష్మీ నారాయణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సిబ్బంది ఆయనకు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో డీటీ నాగలక్ష్మి, సిబ్బంది సుధీర్, ఈవోపీఆర్డీ పెంచల వీరేంద్ర పాల్గొన్నారు.

**వలేటివారిపాలెం :** తహసీల్దార్‌గా షేక్ అబ్దుల్‌అమీద్ సోమవారం సాయంత్రం బాధ్యతలు చేపట్టారు. ఆయన ప్రకాశం జిల్లా తర్లుపాడు తహసీల్దార్‌గా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఆయనకు ఇన్‌చార్జి తహసీల్దార్ విజయ్‌భాస్కర్, ఆర్ఐ ప్రసాద్ పుష్పగుచ్చాలు అందజేసి అభినందనలు తెలిపారు.

**ఉలవపాడు :** తహసీల్దార్‌గా వీ లావణ్య సోమవారం బాధ్యతలు చేపట్టారు. ప్రకాశం కలెక్టరేట్ నుంచి ఆమె బదిలీపై వచ్చారు. డీటీ వీరయ్య, రీసర్వే డీటీ రామమూర్తి, వీఆర్వోలు, కార్యాలయం సిబ్బంది ఆమెకు అభినందనలు తెలిపి, స్వాగతం పలికారు. తొలిరోజు ఆమె వీఆర్వోలతో సమీక్ష నిర్వహించారు.

**కొండాపురం :** తహసీల్దార్‌గా కేవీబీటీ సుందరమ్మ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల సమయంలో తహసీల్దారుగా పనిచేసిన మస్తానయ్య బదిలీ కావడంతో ప్రకాశం జిల్లా నుంచి సుందరమ్మ ఇక్కడికి వచ్చారు. టీడీపీ నేతలు యారవ క్రిష్ణయ్య, పోలినేని రమేష్, రామమోహన్, అల్లిక మధు తదితరులు ఆమెను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

**చిత్రగుంట :** తహసీల్దారుగా ఎం.సురేష్‌బాబు సోమవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు డీటీ జూలియాభాయ్, రెవెన్యూ అధికారులు శాలువా కప్పి పూలమాలలతో స్వాగతం పలికారు.

## స్వాతంత్ర్య దినోత్సవ పరేడ్‌కు జేబీ విద్యార్థులు

**కావలిటౌన్, ఆగస్టు5:** జేబీ డిగ్రీ కళా శాల ఎన్‌సీసీ క్యాడెట్లు స్వాతంత్ర్య దినోత్సవ పరేడ్‌కు ఎంపి కయ్యారు. సోమవారం ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం నాయుడు అధ్యక్షతన జరిగిన అభినందన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విశ్వోదయ రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్ రెడ్డి పాల్గొని, క్యాడెట్లకు పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ నెల 15న విజయవాడలో జరగనున్న స్వాతంత్ర్య పరేడ్‌లో పాల్గొనేందుకు తమ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు కే కొండబాబు, కే సాగర్, వైరఘువీరసింహ ఎంపికవడం సంతోషంగా ఉందన్నారు. ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ జే కిరణ్‌కుమార్ సరైన శిక్షణ అందించి ఎంపికయ్యేందుకు దోహదపడ్డారని తెలిపారు. సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సు డైరెక్టర్ ఆర్ మాల్యాద్రి, పలువురు అధ్యాపకులు కూడా క్యాడెట్లను అభినందించారు.

## రేపటి నుంచి రాములోరి తిరునాళ్ల

**కావలి రూరల్, ఆగస్టు5:** కావలి మండలం గుమ్మడిబందల గ్రామంలో బుధవారం నుంచి ఈనెల 9వతేదీ వరకు రాములోరి తిరునాళ్ల నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే 10, 11 తేదీల్లో అంకమ్మ తిరునాళ్ల నిర్వహిస్తామన్నారు. ఆదివారం అమ్మవారికి పొంగళ్లు పెడతామని పేర్కొన్నారు. ఏడేళ్ల తరువాత నిర్వహించే ఈ తిరునాళ్లలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని కోరారు.

## రేపు రౌండ్‌టేబుల్ సమావేశం

**ఉలవపాడు, ఆగస్టు 5:** కందుకూరు, అద్దంకి నియోజకవర్గాలను ప్రకాశం జిల్లాలో కలపాలని, మార్కాపురాన్ని జిల్లాగా ఏర్పాటు చేయాలని కోరుతూ బుధవారం ఒంగోలులోని ఎంసీఏ భవనంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం చంద్రబాబు హామీ మేరకు త్వరితగతిన కార్యచరణ చేపట్టాలని, లేనిపక్షంలో ఉద్యమబాట చేపట్టేందుకు వెనుకాడబోమని ఆయన పేర్కొన్నారు.

## హిందు శ్మశానవాటికను అభివృద్ధి చేయండి

**కావలిటౌన్, ఆగస్టు5:** పట్టణంలోని ముసునూరు హిందు శ్మశానవాటికను అభివృద్ధి చేయాలని సంజీవని ఫౌండేషన్ అధ్యక్షుడు కనుమూరు భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానికులతో కలిసి ఆయన ఎమ్మెల్యే కృష్ణారెడ్డి, ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్‌లకు వినతిపత్రాలు అందించారు. అనంతరం మాట్లాడుతూ హిందు శ్మశానవాటిక 62 సెంట్లలో ఉండేదని, హైవే బైపాస్‌కు కొంతస్థలం పోగా, ప్రస్తుతం 40 సెంట్లలో ఉందన్నారు. చుట్టూ ప్రహరీ నిర్మించి, కాల్చుల కోసం మండపం, స్నానాల వసతి, దుస్తులు మార్చుకునే గది నిర్మాణం చేపట్టాలని కోరారు.

## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 8 అర్జీలు

**కందుకూరు, ఆగస్టు 5:** మున్సిపాలిటీలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 8 అర్జీలు వచ్చినట్లు కమిషనర్ కేవీ కృష్ణారెడ్డి తెలిపారు. ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిందిగా సెక్షన్ హెడ్స్‌కు ఆదేశాలు జారీచేసినట్లు తెలిపారు. వీధిలైట్లు, తాగునీరు, పారిశుధ్యం తదితర సమస్యలపై 91777 00267 నెంబరుకు ఫోన్ చేస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

**లింగసముద్రం, ఆగస్టు 5 :** మండలంలోని అన్నెబోయినపల్లి సమీపంలోని మన్నేరు వాగు నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ముందుగా అందిన సమాచారం మేరకు ఎస్‌హెచ్‌వో ఏ మల్లికార్జున, పోలీసు సిబ్బందిని పంపించి ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకొని, డ్రైవర్‌ను, ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

## శాస్త్రీయంగా మిరప నారు పెంపకంపై శిక్షణ

**లింగసముద్రం, ఆగస్టు 5 :** శాస్త్రీయంగా మిరప నారు పెంపకంపై సోమవారం కందుకూరు కృషి విజాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జీ ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ ఇచ్చారు. స్థానిక అంబేద్కర్‌నగర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నారుమళ్ల మీటరు వెడల్పు, 15 సెంటీమీటర్లు ఎత్తు ఉండేలా చేసుకొని, మధ్యలో 30 సెం.మీ కాలువలు తీసుకోవాలన్నారు.అలాగే నారు నాటే పొలాల్లో జనుము, జీలుగ వంటి పచ్చిరొట్ట పైర్లను చల్లుకొని పూతదశలో కలియదున్నుకోవాలన్నారు. తద్వారా ద్వారా నేలలో సేంద్రీయ కర్బనం పెరిగి మిరపలో అధిక దిగుబడులు పొందవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా విత్తనశుద్ధి గురించి, మిరపనారులో సస్యరక్షణ చర్యలు గురించి తెలియజేశారు.ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ వెంకటేష్, డాక్టర్ జ్యోతి, ఇంజనీరు వివేక్, మైరాడ ఎన్‌జీవో సభ్యులు మల్లికార్జున, పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి టీజీ భరత్ జన్మదిన వేడుకలు

**కందుకూరు, ఆగస్టు 5:** రాష్ట్రమంత్రి టీజీ భరత్ జన్మదిన వేడుకలను స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమవారం సాయంత్రం నిర్వహించారు. పట్టణ ఆర్యవైశ్యులు ఏర్పాటుచేసిన కేక్‌ను ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రతినిధులు పబ్బి శెట్టి రాజా, ఇస్కాల సురేంద్ర, ఇస్కాల మధు, నల్లమల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగుడికి ట్రైసైకిల్ అందజేత

**కందుకూరు, ఆగస్టు 5:** సనాతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం గుడ్లూరు మండలం చేవూరు ఎస్సీ కాలనీకి చెందిన వాదనాల నారయ్య అనే దివ్యాంగుడికి స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ట్రైసైకిల్ అందజేశారు. ఎన్ఆర్ఐ డాక్టరు భవినేని అరుణ ట్రైసైకిల్, గుంటూరుకు చెందిన పీ లక్ష్మి నిత్యావసరాలు సమకూర్చగా వాటిని ఫౌండేషన్ ప్రతినిధులు ఎమ్మెల్యే చేతుల మీదుగా దివ్యాంగుడికి అందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు బొద్దుకూరి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగుడికి ట్రై సైకిల్, నిత్యావసరాలు అందచేసిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

## ప్రజాదర్బార్‌లో సమస్యలకు సత్వర పరిష్కారం

**కలిగిరి, ఆగస్టు 5:** టీడీపీ ప్రధాన కార్యాలయం మంగళగిరిలో నిర్వహిస్తున్న ప్రజాదర్బార్ కార్యక్రమంతో ప్రజాసమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందని ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు తెలిపారు. సోమవారం బొల్లినేని ఫోన్‌లో మాట్లాడుతూ పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా, నెల్లూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు అబ్దుల్‌అజీజ్‌తో కలిసి ప్రజాదర్బార్ గ్రీవెన్స్‌లో వినతులు స్వీకరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయగిరి నియోజకవర్గం నుంచి సుమారు 100మందికిపైగా వివిధ సమస్యలపై తనను కలిసినట్లు ఆయన తెలిపారు.



వినతులు స్వీకరిస్తున్న బొల్లినేని, అజీజ్ తదితరులు

## వరద బాధితుల కోసం విరాళాల సేకరణ

**కావలిటౌన్, ఆగస్టు5:** వయనాడ్ వరద బాధితుల సహాయార్థం సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో విరాళాలు సేకరించారు. పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ వయనాడ్ వరద బాధితుల కోసం రెండు రోజులపాటు విరాళాలు సేకరించమని పార్టీ ఆదేశించిందన్నారు. వయనాడ్ విపత్తును జాతీయ విపత్తుగా కేంద్రం ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో తిరుపాల్, కృష్ణయ్య, చెన్నయ్య, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.




విరాళాలు సేకరిస్తున్న సీపీఎం కార్యకర్తలు

## బ్రిడ్జిపై గుంతలు పూడ్చండి

**కొండాపురం, ఆగస్టు 5:** బ్రిడ్జిపై గుంతలు పూడ్చాలంటూ మండలంలోని సాయిపేట గ్రామస్థులు ఆర్‌అండ్‌బీ అధికారులను కోరుతున్నారు. గ్రామం మధ్యలో నుంచి వెళ్తున్న ప్రధాన రహదారిలో స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద ఉన్న బ్రిడ్జిపై రెండు వైపులా గుంతలు పడి ఉన్నాయి. వీటిని వాహన చోదకులు గమనించాలని స్థానికులు రెండువైపులా జెండాలు కట్టారు. రాత్రిళ్లు వాహనచోదకులు గమనించకుండా వెళితే పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉందని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు.ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు గుంతలు పూడ్చాలని వారు కోరుతున్నారు.



బ్రిడ్జిపై గుంత వద్ద జెండా కట్టిన స్థానికులు

## ఒరిగిన విద్యుత్ స్తంభాలు.. పొంచి ఉన్న ప్రమాదాలు

**వలేటివారిపాలెం, ఆగస్టు 5 :** వలేటివారిపాలెం నుంచి చుండి గ్రామం వైపు వెళ్లే జాతీయ రహదారి పక్కన ఉన్న పొలాల్లో విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయి ఉన్నాయి. వీటి వల్ల ప్రమాదాలు పొంచి ఉన్నాయని రైతులు, కూలీలు ఆందోళన చెందుతున్నారు. అయినా విద్యుత్ అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడడంలేదని వారంటున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో వ్యవసాయ పనులు ప్రారంభమయ్యాయి. రైతులు, కూలీలు పనుల నిమిత్తం పొలాల్లోనే ఉంటున్నారు. వర్షంతోపాటు ఉరుములు, మెరుపులు, పెనుగాలులు వీస్తున్నాయి. పెనుగాలులకు విద్యుత్ స్తంభాలు నేలకొరిగే అవకాశాలు ఉన్నాయి. అలాంటి సమయంలో రైతులు, కూలీలతోపాటు పశువులు కూడా ప్రమాదాల బారిన పడే అవకాశాలు ఉన్నాయి. ప్రమాదాలు జరక్కముందే అధికారులు విద్యుత్ స్తంభాలను సరిచేయాల్సి ఉంది.



పొలాల్లో ఒరిగిన విద్యుత్ స్తంభం

## కావలిలో యథేచ్ఛగా రోడ్డు ఆక్రమణలు

**కావలి,ఆగస్టు5:** పట్టణంలోని ఉదయగిరి బ్రిడ్జి కూడలిలో ట్రంకురోడ్డు మలుపు వద్ద యథేచ్ఛగా రోడ్డును ఆక్రమించి, నిర్మాణాలు చేపట్టినా అధికారులు పట్టించుకోలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఆర్వోబీ దక్షిణం వైపు అప్రోచ్‌రోడ్డు, ట్రంకురోడ్డు వైపు పూర్తిగా ఆక్రమించినా పక్కనే ఉన్న పోలీసులు కానీ, మున్సిపల్ అధికారులు కానీ స్పందించడంలేదు. అక్కడ ఇటీవల కొత్తగా షాపులు నిర్మించిన వారు వాటిని అద్దెకు ఇచ్చారు. అద్దెకు తీసుకున్న వారు అక్కడ దుకాణాల ముందు ఉన్న డ్రైనేజీని ఆక్రమించి దానిపై మూత బండలు వేసి నిర్మాణాలు చేపట్టారు. డ్రైనేజీ కాలువను శాశ్వతంగా ఆక్రమించటంతో మురుగునీరు పారుదల సమస్యలు ఏర్పడనున్నాయి. మున్సిపల్ అధికారులు స్పందించి అక్కడ ఆక్రమణలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

**ఆక్రమణల తొలగింపునకు చర్యలు :** రోడ్డుపైకి వచ్చిన ఆక్రమణల తొలగింపునకు చర్యలు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

\- ఎస్. బాబూరావు, పట్టణ ప్రణాళిక అధికారి